ఈ పేపర్ కోసం
www.visionandhra.in
చూడండి




# విజన్ ఆంధ్ర
తెలుగు దినపత్రిక
VISION ANDHRA TELUGU DAILY







ఆదివారం 19 జూలై 2026 | Sunday 19 July 2026 | హైదరాబాద్ Hyderabad | పేజీలు: 12+12 | వెల: రూ.1.00
సంపుటి: 28 సంచిక: 105 | Vol.No 28 Issue No .105
PUBLISHED FROM: HYDERABAD,NALGONDA, VIJAYAWADA
www.visionandhra.in


## భారత అంతరిక్ష రంగంలో
# సరికొత్త అధ్యాయం

- స్కైరూట్ ఏరోస్పే 'విక్రమ్-1' రాకెట్ ప్రయోగం విజయవంతం
- తొలుత ఇంధన ప్రక్రియలో సాంకేతిక లోపం
- అరగంటలోపే సరిదిద్ది ప్రయోగాన్ని పూర్తి చేసిన షార్
- ప్రైవేట్ రంగంలో తొలి రాకెట్ కావడంతో సర్వత్రా హర్షం
- ప్రయోగాన్ని వీక్షించిన లోకేశ్, ఇస్రో మాజీ శాస్త్రవేత్తలు



శ్రీహరికోట,జులై18 : భారత అంతరిక్ష రంగంలో సరికొత్త అధ్యాయం ప్రారంభమైంది. శ్రీహరికోట షార్ అంతరిక్ష కేంద్రం నుంచి చేపట్టిన ప్రయోగం విజయవంతం అయ్యింది. హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ ప్రైవేట్ స్పేస్‌టెక్ స్టార్టప్ 'స్కైరూట్ ఏరోస్పే 'విక్రమ్-1' రాకెట్ రూపొందించింది. శ్రీహరికోటలోని సతీష్ ధవన్ అంతరిక్ష కేంద్రం(షార్) నుంచి శనివారం మధ్యాహ్నం 12:05 గంటలకు చేపట్టిన ఈ ప్రయోగం విజయవంతమైంది. దీంతో ప్రభుత్వ ఆధ్వర్యంలోని అంతరిక్ష కార్యక్రమాలు సహా భారత ప్రైవేటు రంగం కూడా ఉపగ్రహాలను కక్ష్యలోకి పంపగల సామర్థ్యాన్ని ప్రపంచానికి చాటినట్లు అయ్యింది. వాస్తవానికి మిగతా 2లో..

## 'విక్రమ్-1' విజయవంతంపై ప్రధాని మోడీ హర్షం

- స్కైరూట్ ఏరోస్పేస్ బృందానికి ఫోన్‌లో అభినందనలు
- ఇంజనీర్ల కృషిని ప్రశంసిస్తూ..తనను కలవాలని సందేశం



న్యూఢిల్లీ,జులై18 : భారత తొలి ప్రైవేటు అంతరిక్ష ప్రయోగం 'విక్రమ్-1' విజయవంతం కావడంపై ప్రధాని నరేంద్ర మోదీ హర్షం వ్యక్తం చేశారు. ప్రయోగం విజయవంతమైన వెంటనే హైదరాబాద్‌కు చెందిన స్కైరూట్ మిగతా 2లో..

## దేశ అంతరిక్ష కలలకు చిరునామాగా తెలంగాణ
### 'విక్రమ్-1' విజయవంతంపై రేవంత్ హర్షం



హైదరాబాద్,జూలై18 :భారత్ తొలి ప్రైవేట్ అంతరిక్ష ప్రయోగం 'విక్రమ్-1' విజయవంతంపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందించారు. 'హైదరాబాద్ రైజింగ్.. తెలంగాణ రైజింగ్' అంటూ సోషల్ మీడియా ఎక్స్ వేదికగా హర్షం వ్యక్తం చేశారు. భారత్ తొలి ప్రైవేట్ ఆర్బిటల్ రాకెట్ మిగతా 2లో..

# దొరల గడీల ముందు మోకరిల్లని కవి అందెశ్రీ

- అందెశ్రీని, గద్దర్‌ను అవమానించిన కెసిఆర్
- వేల ఎకరాల్లో ఫామ్‌హౌజ్‌లతో కులకుతున్న నేతలు
- నేనున్నంత వరకు బిఆర్ఎస్ అధికారంలోకి రావడం కల్ల
- నిరుద్యోగులను మోసం చేసిన ఘనులు బిఆర్ఎస్ నేతలు
- అందెశ్రీ స్మృతివనం శంకుస్థాపనలో సిఎం రేవంత్ విమర్శలు






హైదరాబాద్,జూలై18 : దొరల గడీల ముందు మోకరిల్లనని ధైర్యంగా చెప్పిన కవి అందెశ్రీ అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ప్రముఖ కవిగా, గాయకుడిగా తెలంగాణ సమాజానికి సుపరిచితులైన ఆయన.. తనకు ఆత్మబంధువని చెప్పారు. ఆయన జయంతి సందర్భంగా రంగారెడ్డి జిల్లా ఘట్‌కేసర్‌లో 'అందెశ్రీ స్మృతివనం' నిర్మాణానికి సీఎం రేవంత్‌రెడ్డి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అందెశ్రీని ఆనాటి ప్రభుత్వం ఎంతో నిర్లక్ష్యం చేసిందన్నారు. ప్రజా గాయకుడు గద్దర్‌ను కూడా ప్రగతిభవన్ గేటు ఎదుట ఎర్రటి ఎండలో నిలబెట్టారని విమర్శించారు. వారిద్దరన్నీ అవమానించినప్పుడే దొరలను సాగనంపాలని జనం నిర్ణయించుకున్నారని అన్నారు. ఈ సందర్భంగా అందెశ్రీతో తనకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్న సీఎం, ఆయన తనకు ఆత్మబంధువని, కుటుంబ సభ్యుడిగా, పెద్దన్నగా భావించానని అన్నారు. అందెశ్రీ పాటలు లక్షలాది మందిలో తెలంగాణ ఉద్యమ స్ఫూర్తిని నింపాయని, తనలోనూ ఉద్యమ చైతన్యాన్ని రగిలించాయని పేర్కొన్నారు. గడీల ముందు మోకరిల్లనని చెప్పిన కవి అందెశ్రీ ఎప్పుడూ దొరల గడప తొక్కలేదని, ఆయన గానంలో గొప్పతనం, సమాజానికి మార్గనిర్దేశం చేసే శక్తి ఉందన్నారు. ఒకప్పుడు నిర్బంధానికి గురైన అందెశ్రీ పాటే నేడు తెలంగాణ రాష్ట్ర గీతంగా మారడం చారిత్రక విషయమని చెప్పారు. ఆనాటి ప్రభుత్వం అందెశ్రీని అవమానించిందని, అలాగే ప్రజాకవి గద్దర్‌ను ప్రగతిభవన్ ఎదుట ఎండలో నిలబెట్టిన ఘటనను కూడా సీఎం గుర్తు చేశారు. ఈ సందర్భంగా మాజీ సీఎం కేసీఆర్, బీఆర్ఎస్ ప్రభుత్వంపై రేవంత్ రెడ్డి తీవ్ర విమర్శలు గుప్పించారు. గ్రూప్ పరీక్షలు నిర్వహించి నిజంగా ఉద్యోగాలు ఇచ్చారా

# ఆహార కల్తీపై ఇక ఉక్కుపాదం

- ప్రజల ప్రాణాలతో చెలగామడితే కఠిన చర్యలు
- ఆహార కల్తీ నిరోధానికి పటిష్టమైన చట్టం
- ప్రపంచ దేశాల్లో అమలవుతున్న విధానాలపై అధ్యయనం
- సేంద్రియ ఉత్పత్తుల పేరుతో విచ్చలవిడిగా అమ్మకాలు
- వాటి స్వచ్ఛతపైనా ఇకనుంచి పరిశీలిన
- అసెంబ్లీలో చర్చించి సమగ్ర చట్టం రూపకల్పన
- ఉన్నతస్థాయి సమీక్షలో సిఎం రేవంత్ ఆదేశం



హైదరాబాద్,జూలై18 : ఆహార, ఔషధాల కల్తీని నిరోధించేందుకు కఠిన చట్టం రూపొందించాలని అధికారులను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. మిగతా 2లో..

## అథ్లెట్ ప్రవల్లికకు సిఎం రేవంత్ అభినందనలు



హైదరాబాద్,జూలై18 : చైనాలోని ఒర్డోస్‌లో జరిగిన తొలి ఆసియా అండర్-23 అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్-2026లో మహిళల 4-400 మీటర్ల రిలే పోటీలో స్వర్ణ పతకం సాధించిన తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఆధ్వర్యంలోని మిగతా 2లో..

## అబద్దాలు ప్రచారం చేసేవారికి సోషల్ మీడియాలో చోటు

- ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న ముఖ్యమంత్రికి ప్రజల గుండెల్లో స్థానం
- కళాకారులు, కవుల సదస్సులో ఉద్యమకారుల కమిటీ స్పష్టం



మిగతా 2లో..

## లక్షల ఉద్యోగాల హామీ
# ఏమయ్యింది

- జాబ్ క్యాలెండర్, రెండు లక్షల ఉద్యోగాలు ఏవీ
- కొలువుల కుంభమేళా కాదు.. కుంభకోణాల కుంభమేళా
- ఢిల్లీలో రాహుల్ గాంధీ జేబులు నిండుతున్నాయి
- తెలంగాణలో లూటీ జరుగుతోంది
- మొహబ్బత్‌కి దుకాణ్ కాదు.. ధోకేకా మకాన్ నడుస్తోంది
- చాయ్ పే చర్చాను మరచిన రాహుల్
- బీఆర్ఎస్ యువ సంగ్రామ సదస్సులో కేటీఆర్ ఘాటు విమర్శలు



హైదరాబాద్,జూలై18 : ఏడాదిలోనే రెండు లక్షల ఉద్యోగాలిస్తానని రాహుల్ గాంధీ ఇచ్చిన మాట తప్పారని కేటీఆర్ తెలిపారు. రాహుల్ గాంధీకి తెలుగు రాదు.. మన బాధ తెల్వదు అని అన్నారు. అశోక్‌నగర్‌లో చాయ్‌పే చర్చా పెట్టింది అసలు రాహుల్‌గాంధీకి గుర్తుందా అని ప్రశ్నించారు. యువత తలరాత మారుస్తానని అబద్ధపు హామీలు ఇచ్చారని.. జాబ్ క్యాలెండర్, రెండు లక్షల ఉద్యోగాలు ఏమయ్యాయని నిలదీశారు. డిగ్రీ విద్యార్థినులకు స్కూటీలు ఏమయ్యాయి? విద్యా భరోసా ఏమైందని అడిగారు. ఢిల్లీలో రాహుల్ గాంధీ జేబులు నిండుతున్నాయని.. తెలంగాణలో లూటీ జరుగుతోందని కేటీఆర్ విమర్శించారు. తెలంగాణలో మొహబ్బత్‌కి దుకాణ్ కాదు.. ధోకేకా మకాన్ నడుస్తోందని ఆరోపించారు. కొలువుల కుంభమేళా అని చెప్పి.. కుంభకోణాల కుంభమేళా చేస్తున్నారని మండిడ్డారు. హైదరాబాద్ సరూర్‌నగర్‌లో బీఆర్ఎస్ తలపెట్టిన యువ సంగ్రామ సదస్సులో కేటీఆర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. ఉద్యోగాలు అడిగితే ఉరికించి కొడుతున్నారని కాంగ్రెస్ సర్కార్‌పై కేటీఆర్ మండిపడ్డారు. డిసెంబర్ 9 నుంచి ఉద్యోగ పర్వం కాదు.. ఉన్మాదపర్వం చూపిస్తున్నారని అన్నారు. నిరుద్యోగుల పట్ల దౌర్జన్య కాండ కొనసాగుతోందని తెలిపారు. రాహుల్ గాంధీకి నిరుద్యోగుల ఆక్రోశం కనబడటం లేదా అని నిలదీశారు. నిరుద్యోగ మిగతా 2లో..

## స్థానిక ఉత్పత్తులను ప్రజలు ఆదరించాలి

- 16 నుండి 26 వరకు 'బోనాలు- చేతివృత్తుల మేళా'
- ట్యాంక్ బండ్ అంబేద్కర్ విగ్రహం వద్ద ప్రదర్శనలు
- మంత్రి పొన్నం ప్రభాకర్



హైదరాబాద్,జూలై18 : చేతి వృత్తి కళాకారులకు చేయూతనివ్వాలని రాష్ట్ర ప్రభుత్వ బిసి సంక్షేమశాఖ ఆధ్వర్యంలో 'బోనాలు- చేతివృత్తుల మేళా, బిసి చేతివృత్తుల అమ్మకాలు- ప్రదర్శన'ను ఈనెల 16వ తేదీ మిగతా 2లో..

## మద్దిమడుగు పబ్బతి ఆంజనేయునికి, సంతు సేవాలాల్ ఆలయాలకు మహర్దశ

- 100 కోట్లతో ఆలయాల అభివృద్ధికి సీఎం రేవంత్ రెడ్డి మంజూరు...
- పట్టు సాధించిన ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ...
- 22 కోట్లతో మాడ వీధులు, 15 కోట్లతో హరిత హోటల్ నిర్మాణ పనులు...
- కృష్ణానది తీరాన మారానున్న ఆలయ రూపురేఖలు....



ఉమ్మడి పాలమూరు జిల్లా బ్యూరో, జూలై 19 (విజన్ ఆంధ్ర) : ఉమ్మడి పాలమూరు జిల్లా ప్రజల ఆరాధ్య దైవం, భక్తుల కొంగుబంగారం "పబ్బతి ఆంజనేయ స్వామి" క్షేత్రానికి ఇప్పుడు మహర్దశ పట్టింది. దశాబ్దాలుగా అభివృద్ధికి మిగతా 2లో..

# గాంధీ జయంతి నాటికి చెత్తకు మోక్షం

- చెత్తనుంచి సంపద సృష్టించడమే మా లక్ష్యం
- తడి, పొడి చెత్తను ఇంట్లోనే వేరు చేయాలి
- ఘన వ్యర్థాల ప్రాసెసింగ్ కేంద్రాల కోసం రూ.528 కోట్లు ఖర్చు
- రౌడీయిజం చేసేవారిని ఉపేక్షించబోమని హెచ్చరిక
- గుడివాడ స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో చంద్రబాబు




విజయవాడ,జూలై18 : రాష్ట్రంలో అక్టోబర్ 2 గాంధీ జయంతి నాటికి చెత్తలేకుండా చేస్తామని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. చెత్త నుంచి సంపద సృష్టించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు. గుడివాడలో జరిగిన స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గుంటూరు, నెల్లూరు నగరాల్లో చెత్త సేకరణకు ఉపయోగించే.. ఎలక్ట్రిక్ ఆటోలను వర్చువల్‌గా ప్రారంభించారు. బాగా పని చేసిన వారికి పురస్కారాలను ప్రదానం చేశారు. ఇంట్లో ఎవరికి వారే.. తడి, పొడి చెత్తను వేరు చేసుకోవాలని చంద్రబాబు పిలుపునిచ్చారు. మే 23 నుంచి జూన్ 20 వరకు ఆపరేషన్ క్లీన్ స్వీప్ కార్యక్రమం చేపట్టాం. ఆగస్టు 26 నాటికి 1140 ఈ-ఆటోలు అందుబాటులోకి వస్తాయి. 108 సమగ్ర ఘన వ్యర్థాల ప్రాసెసింగ్ కేంద్రాల కోసం రూ.528 కోట్లు ఖర్చు చేస్తున్నాం. 'ప్రజారథం' కార్యక్రమం ద్వారా చెత్తను కొనుగోలు చేసి.. నిత్యావసర వస్తువులు అందజేశాం. దీనికోసం ఇప్పటి వరకు రూ.16 కోట్లు ఖర్చు చేశాం. చెత్త నుంచి సంపద సృష్టించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యం అని చంద్రబాబు అన్నారు. ఎవరి ఇంటిపై వాళ్లే కరెంటు తయారు మిగతా 2లో..

# గుంటూరు ఘటనపై చంద్రబాబు ఆగ్రహం

- కఠిన చర్యలు తీసుకోవాలంటూ ఆదేశం
- పార్టీ వారైనా క్షమించేది లేదని వెల్లడి
- ఘటనపై కఠిన చర్యలు తప్పవన్న లోకేశ్



అమరావతి,జూలై18 : గుంటూరు ఘటనను సీరియస్‌గా తీసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. మహిళల భద్రతకు ప్రభుత్వం అత్యున్నత ప్రాధాన్యం ఇస్తుందని స్పష్టం చేశారు. సమాజంలో ఏ ఒక్క మిగతా 2లో..




# జాతీయ చలనచిత్ర అవార్డుల ప్రకటన

- ఉత్తమ ప్రాంతీయ చిత్రంగా కమిటీ కుర్రోళ్లు ఎంపిక
- విజువల్ వండర్ 'కల్కి 2898 ఏడీ'కి రెండు కేటగిరీల్లో అవార్డులు

న్యూఢిల్లీ,జూలై18 : 72వ జాతీయ చలనచిత్ర పురస్కారాల్లో తెలుగు చిత్రాలు అదరగొట్టాయి. 2024 సంవత్సరానికి గానూ వివిధ కేటగిరీల్లో పలు తెలుగు చిత్రాలకు అవార్డులు దక్కాయి. ఉత్తమ మిగతా 2లో..

## అథ్లెట్ ప్రవల్లికకు సిఎం రేవంత్ అభినందనలు

గురుకుల డిగ్రీ కళాశాల విద్యార్థిని నరిమళ్ల ప్రవల్లికను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభినందించారు. మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఉన్నతాధికారులతో కలిసి ప్రవల్లిక ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీ బోధి పెవిలియన్‌లో ముఖ్యమంత్రిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అభినందించిన సిఎం క్రీడలకు తెలంగాణ కేంద్రంగా మారాలని అభినందించారు. ప్రవల్లికకకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

## జాతీయ చలనచిత్ర అవార్డుల ప్రకటన

ప్రాంతీయ చిత్రంగా 'కమిటీ కుర్రోళ్ళు' ఎంపికైంది. అంతేకాదు, ఉత్తమ మేకప్ విభాగంలోనూ అవార్డు వరించింది. కొత్త నటులతో దర్శకుడు యదువంశీ రూపొందించి ఈ చిత్రానికి మెగా డాటర్ నిహారిక కొణిదెల నిర్మాతగా వ్యవహరించడం విశేషం. బాక్సాఫీస్‌తో పాటు ఓటీటీలోనూ అదరగొట్టిన ఈ మూవీ ఇప్పుడు ఏకంగా రెండు జాతీయ అవార్డులను సొంతం చేసుకుంది. ఇటీవల తెలంగాణ ప్రభుత్వం ప్రకటించిన గద్దర్ అవార్డుల్లో జాతీయ సమైక్యత, మతసామరస్యం, అణగారిన వర్గాల సామాజిక అభ్యున్నతికి ఉద్దేశించిన చిత్రంగా వివిధ విభాగాల్లో మెరిసింది. ఇక నాగ్ అశ్విన్ విజువల్ వండర్ 'కల్కి 2898 ఏడీ'కి రెండు కేటగిరీల్లో అవార్డులను దక్కించుకుంది. అద్భుతమైన సెట్స్, విజువల్స్‌తో అలరించినందుకు ఉత్తమ ప్రొడక్షన్ డిజైన్ అవార్డుతో పాటు, ఉత్తమ ప్రజాదరణ పొందిన చిత్రంగా జాతీయ అవార్డును సొంతం చేసుకుంది. 'ఎంత గొప్పగా ఆడావు అన్నది ముఖ్యం కాదు.. ఎప్పుడు ఆపావన్నదే ముఖ్యం, 'ఒక్క రోజులో ఒక అరగంట నాకు నచ్చినట్టు గడవలేదు. దానికి జీవితాంతం ఏడుస్తూ కూర్చోలేను కదా' వంటి సంభాషణలతో అలరించిన చిత్రం 'లక్కీ భాస్కర్'. ఇలాంటి అద్భుతమైన సంభాషణలను రాసి జీవిత సత్యాలెన్నో చెప్పిన దర్శకుడు వెంకీ అట్లూరి ఉత్తమ రచయితగా జాతీయ అవార్డు దక్కింది. మాస్‌నే కాదు, బాక్సాఫీస్‌ను ఓ ఊపు ఊపేసిన చిత్రం 'పుష్ప2'. ఇప్పుడు ఏకంగా రెండు జాతీయ అవార్డులను సొంతం చేసుకుంది. ఈ మూవీని ఆద్యంతం అలరించేలా తీర్చిదిద్దిన దర్శకుడు సుకుమార్ ఉత్తమ స్క్రీన్‌ప్లే రచయిత కేటగిరిలో అవార్డుకు ఎంపిక కాగా, ఉత్తమ కాస్ట్యూమ్ డిజైనర్‌గా దీపాలి నూర్, సీతల్ శర్మలకు అవార్డు దక్కింది. చిన్న చిత్రం కాదు.. ప్రతి ఒక్కరి మనుసుల్ని హత్తుకునేంత పెద్ద చిత్రమనించింది '35- చిన్న కథ కాదు'. ఇప్పుడు జాతీయ అవార్డుల్లో ఉత్తమ బాలల చిత్రంతో పాటు, ఉత్తమ బాల నటుడిగా అరుణ్‌దేవ్ పోతుల అవార్డుకు ఎంపికయ్యారు.

## అబద్దాలు ప్రచారం చేసేవారికి సోషల్ మీడియాలో చోటు

హైదరాబాద్,జూలై18 :ప్రజాకవి, పద్మశ్రీ డాక్టర్ అందెశ్రీ జయంతి వేడుకల సందర్భంగా తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కమిటీ అమరవీరుల స్మారక చిహ్నంలో రాష్ట్రవ్యాప్త కవులు, కళాకారులు మరియు రచయితలతో ముఖాముఖి సమీక్షా సమావేశాన్ని అత్యంత విజయవంతంగా నిర్వహించింది. ప్రత్యేక సమావేశంలో కమిటీ సభ్యులు మరియు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఎగ్జిక్యూటివ్ మెంబర్ మోతె శోభన్ రెడ్డి, ప్రొఫెసర్ ఎమ్. కోదండరామ్, అద్దంకి దయాకర్, ఎస్. రాములు నాయక్ తదితరులు హాజరై, మలిదశ ఉద్యమంలో తమ ఆట పాటలతో ప్రాణవాయువు ఊదిన సాంస్కృతిక పోరాట యోధుల నుండి సలహాలను మరియు సూచనలు నేరుగా స్వీకరించారు. ఈ సందర్భంగా మోతె శోభన్ రెడ్డి మాట్లాడుతూ ప్రతిపక్షాల తీరుపై, సోషల్ మీడియా ప్రచారాలపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. వాళ పొద్దున లేస్తే అబద్దాలు చెప్పే బావమరుదుల మాటలు, వారి అసత్య ప్రచారాలు ఇన్‌స్టాగ్రామ్‌లలో, వాట్సాప్‌లలో గిన్నిస్ బుక్ రికార్డుల రేంజ్‌లో హల్‌చల్ చేస్తుంటాయి. కానీ ప్రజా సంక్షేమం కోసం అహర్నిశలు శ్రమిస్తున్న రేవంత్ రెడ్డి చేస్తున్న చారిత్రాత్మక పనుల గురించి ఆ సోషల్ మీడియా మాధ్యమాల్లో రాదు. మా ముఖ్యమంత్రి పబ్లిసిటీ సీఎం కాదు.. క్షేత్రస్థాయిలో ప్రజల కోసం ప్రాణాలు పెట్టి పనిచేసే సీఎం! ఆయన నాయకత్వంలో మా ప్రభుత్వం సాధించిన విజయాలు సామాన్యమైనవి కావన్నారు. అవన్నీ కంటికి కనిపిస్తున్న నిజాలు. మా ప్రభుత్వం మరియు సీఎం గారు కవులు, కళాకారుల భవిష్యత్తును పూర్తి బాధ్యతతో చూసుకుంటారు. మీ ఆత్మగౌరవాన్ని కాపాడే బాధ్యత మాది. మీరంతా ఈ అద్భుతమైన ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను, నిజాలను ప్రజల్లోకి బలంగా తీసుకువెళ్లాలన్నారు. సాంస్కృతిక శాఖలో ఉద్యోగాలు: ఎలాంటి సిఫార్సులు, రాజకీయ రికమండేషన్లు లేకుండా, కేవలం అర్హత, ప్రతిభ ఆధారంగానే నిజమైన కళాకారులను సాంస్కృతిక శాఖలోని ఉద్యోగాలకు ఎంపిక చేయాలన ఇకళాకారులు కోరారు. ఉద్యమ కళాకారుల ఆవేదనను విన్న కమిటీ సభ్యులు స్పందిస్తూ, గతంలో జరిగిన పొరపాట్లను ఖచ్చితంగా సరిదిద్దుతామని హామీ ఇచ్చారు.

## గుంటూరు ఘటనపై చంద్రబాబు ఆగ్రహం

మహిళకు అవమానం జరిగినా.. అది ఎంతమాత్రం ఆమోదయోగ్యం కాదని అన్నారు. సమాజంలో ఇలాంటి వాటికి తావులేదని తెలిపారు. ఘటనపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి, దోషులపై కఠినమైన చర్యలు తీసుకోవాలని సీఎం ఆదేశించారు. ఈ దారుణానికి సంబంధించి ఇప్పటికే క్రిమినల్ కేసు నమోదైందని, నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారన్నారు. ఈ ఉదంతంలో ప్రమేయం ఉన్న సదరు పార్టీ కార్యకర్తను తక్షణమే పార్టీ నుంచి సస్పెండ్ చేస్తున్నామన్నారు. రాజకీయ అండదండలు ఉన్నా సరే.. చట్టం వదిలిపెట్టదని సీఎం స్పష్టంచేశారు. తప్పు చేసిన వారి విషయంలో ప్రభుత్వం అత్యంత కఠినంగా వ్యవహరిస్తుందన్నారు. చట్టం ఎవరికీ లొంగదు, పక్షపాతం చూపదన్నారు. రాజకీయ పలుకుబడి లేదా పార్టీతో అనుబంధం ఉందనే కారణంతో ఏ ఒక్కరికీ రక్షణ లభించదని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ప్రతి మహిళకు తమ గౌరవానికి, భద్రతకు ఎల్లప్పుడూ రక్షణ ఉంటుందనే నమ్మకాన్ని కల్పించడమే ప్రభుత్వ ధ్యేయమని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టంచేశారు. ఈ ఘటనలో నిందితుడిపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని అధికారులను సీఎం చంద్రబాబు ఆదేశించారు. ఈ కేసులో ప్రమేయం ఉన్న పార్టీ కార్యకర్తపై సస్పెన్షన్ వేటు వేసినట్లు తెలిపారు.భయం, పక్షపాతం లేకుండా చట్టాన్ని అమలు చేయాలని సూచించారు. ఏపీ మహిళల గౌరవం, భద్రతకు తమ కట్టుబడి ఉంటామని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.గుంటూరు ఘటనపై ఆంధ్రప్రదేశ్ విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఘటన తనను దిగ్భ్రాంతికి గురిచేసిందని తెలిపారు. రాజకీయ పలుకుబడి ఎవరినీ కాపాడదని చెప్పుకొచ్చారు. సీఎం చంద్రబాబు ఆదేశాలతో వెంటనే కఠిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. నిందితుడిపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని అన్నారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా మంత్రి లోకేశ్ పోస్టు పెట్టారు. నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారని మంత్రి లోకేశ్ పేర్కొన్నారు. ఈ ఘటనలో ప్రమేయం ఉన్న నాయకుడిపై సస్పెన్షన్ వేటు వేసినట్లు తెలిపారు. పార్టీ పదవులన్నింటి నుంచి వెంటనే సస్పెండ్ చేయాలని ఆదేశించారు. మహిళలను అవమానించే చర్యలను సహించేది లేదని హెచ్చరించారు. ఈ ఘటనలో ప్రభుత్వం జీరో టాలరెన్స్ విధానం అమలు చేస్తుందని స్పష్టం చేశారు. మహిళలను అవమానించిన వారికి చట్టప్రకారం కఠిన శిక్ష తప్పదని హెచ్చరించారు. ఎవరైనా సరే చట్టం ముందు సమానమేనని మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు.

## దేశ అంతరిక్ష కలలకు చిరునామాగా తెలంగాణ

'విక్రమ్-1' విజయవంతమైన ప్రయోగమన్నారు. శ్రీహరికోట నుంచి విక్రమ్-1 నింగిలోకి దూసుకెళ్లిందని, హైదరాబాద్ సంస్థ స్కైరూట్ ఏరోస్పేస్ ఘన విజయం సాధించిందని తెలిపారు. భారత అంతరిక్ష రంగం మరో చారిత్రక మైలురాయిని చేరుకుందన్నారు. దేశ అంతరిక్ష కలలకు చిరునామాగా తెలంగాణ నిలిచిందని సీఎం అన్నారు. హైదరాబాద్ ఇన్నోవేషన్ శక్తికి ప్రపంచ వేదికపై గుర్తింపు లభించిందని తెలిపారు. ఈ సందర్భంగా స్కైరూట్ బృందానికి ముఖ్యమంత్రి అభినందనలు తెలియజేశారు. విక్రమ్-1.. ప్రైవేట్ స్పేస్ రంగంలో భారత్ సత్తా చాటిందని కొనియాడారు. భవిష్యత్తు అంతరిక్ష ప్రయోగాలకు తెలంగాణ నుంచి బలమైన అడుగు పడిందని ఎక్స్‌లో సీఎం రేవంత్ రెడ్డి పోస్ట్ చేశారు.

## DOCUMENT MISSING

విషయం: ఒరిజినల్ ఫ్లాట్ లింక్ డాక్యుమెంట్ పోయింది.
నేను,కల్లపెల్లి గోపాల్
తండ్రి:లచ్చయ్య
నివాసం:నార్కెట్‌పల్లి గ్రామం, నల్గొండ జిల్లా.నార్కెట్‌పల్లి రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబర్:254లో నాకు సొంతమైన ఫ్లాట్ కలదు.ఈ ఫ్లాట్ కు సంబంధించిన ఒరిజినల్ లింక్ డాక్యుమెంట్ (డాక్యుమెంట్ నెంబర్: 4112/2003)ప్రమాదవశాత్తు ఎక్కడో పోయింది.
కావున,సదరు ఒరిజినల్ డాక్యుమెంట్ ఎవరికైనా దొరికితే క్రింది ఫోన్ నెంబర్‌కు సంప్రదించగలరు. 7799306819.

## భారత అంతరిక్ష రంగంలో సరికొత్త అధ్యాయం

ఉదయం 11.30 గంటలకు ప్రయోగం జరగాల్సి ఉండగా సాంకేతిక లోపం తలెత్తింది. దీంతో ప్రయోగానికి స్వల్ప అంతరాయం ఏర్పడింది. ఆ తర్వాత శాస్త్రవేత్తలు పరిశీలనలు చేపట్టి ఇంధన ప్రక్రియలో తలెత్తిన సమస్యను గుర్తించి సరిచేశారు. 35 నిమిషాల తర్వాత తిరిగి రాకెట్‌ను ప్రయోగించారు. ఈ రాకెట్.. సాంకేతిక పేలోడ్‌లు సహా ప్రధాని నరేంద్ర మోదీ స్వహస్తాలతో 'వందేమాతరం' అని రాసి పంపిన ప్రత్యేక పోస్ట్‌కార్డును అంతరిక్షంలోకి తీసుకెళ్లింది. వీటితో పాటు కాస్మోస్ డైమండ్స్ సంస్థ రూపొందించిన 'కాస్మిక్ బ్లూమ్' ఆర్ట్‌వర్క్, విక్రమ్-1 రాకెట్ సూక్ష్మ ప్రతిరూపాన్నీ నింగిలోకి పంపారు. దీనిపై సర్ సీవీ రామన్, విక్రమ్ సారాభాయ్, ఏపీజే అబ్దుల్ కలాం వంటి ప్రముఖుల సూక్ష్మరూపాలను చెక్కారు. అంతేకాకుండా.. ఈ ప్రయోగం విజయవంతం కావాలని కాంక్షిస్తూ స్కైరూట్ టీమ్ సహా ఇస్రో మాజీ ఛైర్మన్లు, శాస్త్రవేత్తలు, భారతీయ వ్యోమగాములు, ఇతరులు పంపిన డజన్ల కొద్దీ చేతిరాత పోస్ట్‌కార్డులనూ ప్రత్యేక పేలోడ్ బాక్స్‌లో భద్రపరిచారు. స్కైరూట్ సంస్థ 'మిషన్ ఆగమన్' పేరిట ఈ ప్రయోగం చేపట్టింది. భారత ప్రైవేట్ అంతరిక్ష రంగం ఆర్బిటాల్ ప్రయోగాల యుగంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా ఈ మిషన్‌కు ఆ పేరు పెట్టింది.

విక్రమ్-1 ద్వారా గ్రహాస్పేస్, కాస్మోసెర్వ్, డీక్యూబ్‌డ్ సంస్థలకు చెందిన టెక్నాలజీ డెమానిస్ట్రేషన్ పేలోడ్‌లు సహా స్కైరూట్‌కు చెందిన 'స్కోప్'ను కూడా అంతరిక్షంలోకి పంపారు. ఈ ప్రయోగం ద్వారా రాకెట్‌లోని ప్రొపల్షన్, స్టేజ్ సెపరేషన్, గైడెన్స్, నావిగేషన్, కంట్రోల్ వ్యవస్థల పనితీరును అంతరిక్ష ప్రయాణంలో పరీక్షించి తద్వారా కీలక సమాచారం రాబట్టనున్నారు. దీంతో రానున్న కాలంలో వాణిజ్య ప్రయోగాల అవసరాలకు సాంకేతిక సామర్థ్యాన్ని మరింత మెరుగుపరుచుకోవడమే లక్ష్యంగా స్కైరూట్ ముందడుగేస్తోంది.ఇక.. సుమారు ఏడంతస్తుల భవనం ఎత్తులో రూపొందిన విక్రమ్-1 పూర్తిగా కార్బన్ కాంపోజిట్ నిర్మాణంతో తయారైంది. దేశీయంగా అభివృద్ధి చేసిన 3డీ ప్రింటెడ్ ఇంజిన్లు, ఘన ఇంధన బూస్టర్లతో పనిచేసే ఈ రాకెట్ 350 కిలోల వరకు చిన్న ఉపగ్రహాలను 450 కిలోమీటర్ల ఎత్తులోని లోఎర్త్ ఆర్బిట్ లో ప్రవేశపెట్టే సామర్థ్యాన్ని కలిగి ఉంది. 2022లో విక్రమ్-ఎస్ ద్వారా తొలి ప్రైవేట్ రాకెట్‌ను విజయవంతంగా కక్ష్యలోకి పంపిన స్కైరూట్.. ఇప్పుడు విక్రమ్-1తో తొలి దేశీయ ప్రైవేట్ ఆర్బిటాల్ ప్రయోగం చేపట్టింది. ఈ ప్రయోగాన్ని ఏపీ మంత్రి నారా లోకేశ్ ప్రత్యక్షంగా వీక్షించారు. కుమారుడు దేవాన్ష్‌తో కలిసి శ్రీహరికోటకు వెళ్లిన లోకేశ్.. ఇస్రో గ్యాలరీ నుంచి 'విక్రమ్-1' ప్రయోగాన్ని వీక్షించారు. ఇస్రో మాజీ ఛైర్మన్లు, సీనియర్ శాస్త్రవేత్తలు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## దొరల గడీల ముందు మోకరిల్లని కవి అందెశ్రీ

అని ప్రశ్నించారు. కేవలం నోటిఫికేషన్లు ఇచ్చి పేపర్లు లీక్ చేయడం ద్వారా కోట్లు సంపాదించారని ఆరోపించారు. తమ కుటుంబ సభ్యులు, బంధువులకే ఉద్యోగాలు, పదవులు కట్టబెట్టారని, కష్టపడి చదివిన నిరుద్యోగులను నిరాశపరిచారని విమర్శించారు. గతంలో ఉద్యోగాల కోసం నిరుద్యోగులు ఆత్మహత్యలు చేసుకున్న ఘటనలను ప్రస్తావించిన సీఎం, తెలంగాణను శవాలమయంగా మార్చింది ఎవరో ప్రజలకు తెలుసని అన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇప్పటికే 70 వేల ఉద్యోగాలు కల్పించామని పేర్కొన్న ఆయన, గత ప్రభుత్వం రాష్ట్రానికి రూ.8 లక్షల కోట్ల అప్పులు మిగిల్చి ఫామ్‌హౌస్ రాజకీయాలు చేసిందని మండిపడ్డారు. కేసీఆర్ నోటిఫికేషన్లు ఇస్తే ఈ ప్రభుత్వం ఉద్యోగాలిచ్చిందని ప్రతిపక్ష నేతలు నిస్సిగ్గుగా చెబుతున్నారని సీఎం మండిపడ్డారు. నిరుద్యోగులు, ఉద్యోగ నియామకాల గురించి ఒక్క రోజైనా బీఆర్ఎస్ పాలకులు ఆలోచించారా? 16 ఏళ్ల తర్వాత.. మేం అధికారంలోకి వచ్చాక గ్రూప్-1 నిర్వహించాం. బీఆర్ఎస్ పాలనలో ఎందరో నిరుద్యోగులు ఆత్మహత్యలు చేసుకున్నారు. అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదే దాదాపు 70 వేల ఉద్యోగాలిచ్చాం. తల్లిదండ్రుల సాక్షిగా వారందరికీ ఉద్యోగ నియామక పత్రాలిచ్చాం. కేసీఆర్ కుటుంబాన్ని తెలంగాణ సమాజం శ్రీమంతుల్ని చేసింది. అలాంటి రాష్ట్రానికి వాళ్లు తిరిగి ఏమిచ్చారు? ఉన్నదంతా దోచుకున్నారు. కేసీఆర్ 1000 ఎకరాల్లో, కేటీఆర్ 100 ఎకరాల్లో, హరీశ్‌రావు 50 ఎకరాల్లో, కవిత 25 ఎకరాల్లో ఫామ్‌హౌస్‌లు కట్టుకున్నారు. మీరు నిజాం రాజును మించిన ధనవంతులుగా ఎలా మారారు? కల్వకుంట్ల కుటుంబాన్ని ప్రజలు అప్పుడే క్షమించారని అనుకుంటున్నారా? నేను ఉన్నంతవరకు మరోసారి మీ సర్కారును రానివ్వను. తెలంగాణను దోచుకోవాలని చూస్తే.. అందెశ్రీ మళ్లీ పాటై పుడతాడని రేవంత్‌రెడ్డి అన్నారు.

## ఆహార కల్తీపై ఇక ఉక్కుపాదం

కూరగాయలు, పండ్లు, పాలు, ఆహార పదార్థాల కల్తీ వల్ల ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారని అన్నారు. ఆహార, ఔషధ కల్తీ నియంత్రణపై మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రంలో ముఖ్యమంత్రి సీఎం రేవంత్‌రెడ్డి సమీక్ష నిర్వహించారు. ఆకుకూరలు, కూరగాయలు, పాలు ఎక్కువ రోజులు నిల్వ ఉంచేందుకు.. పండ్లు త్వరగా మగ్గేందుకు విచ్చలవిడిగా రసాయనాలు వాడుతుండటంతో ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారని సీఎం ఆందోళన వ్యక్తం చేశారు. ఎరువులు, పురుగు మందులు ఎక్కువగా వాడటంతో పంట ఉత్పత్తుల్లోనూ రసాయన అవశేషాలు బయటపడి దిగుమతి చేసుకోవడానికి విదేశాలు నిరాకరిస్తున్న విషయాన్ని ఈ సందర్భంగా సీఎం ప్రస్తావించారు. మార్కెట్‌లో సేంద్రియ ఉత్పత్తుల పేరుతో భారీ ధరలకు అమ్ముతున్నారని, అవి సేంద్రియ ఉత్పత్తులేనని నిర్ధరించేందుకు సరైన వ్యవస్థలు లేవన్నారు. ఈ నేపథ్యంలో కల్తీల నిరోధానికి సమగ్ర చట్టాలు ఉన్న దేశాలకు వెళ్లి అక్కడి విధానాలను అధ్యయనం చేసి సమగ్ర నివేదిక తయారు చేయాలని అధికారులను ఆదేశించారు. బిల్లు రూపొందించి శాసనసభలో సమగ్రంగా చర్చించడంతో పాటు.. ప్రజల అభిప్రాయాలు స్వీకరించనున్నట్లు తెలిపారు. కల్తీలకు సంబంధించి సమాచార సేకరణకు టోల్ ఫ్రీ నెంబర్ ఏర్పాటు చేయాలని చెప్పారు. కల్తీల నిరోధానికి సంబంధించి ముందుగా క్యూర్ ప్రాంతాన్ని పైలట్ ప్రాజెక్టుగా తీసుకోవాలని సూచించారు. పైలట్ ప్రాజెక్టులో వచ్చే లోటుపాట్ల ఆధారంగా ముందుకు సాగాలని సీఎం దిశానిర్దేశర చేశారు.ఈ క్రమంలో తెలంగాణలో ఆహార, ఔషధ కల్తీలను పూర్తిగా అరికట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం కఠిన చట్టాన్ని తీసుకురావాలని నిర్ణయించింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరిగిన సమీక్ష సమావేశంలో కల్తీల నియంత్రణపై పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. కల్తీ ఆహారం, నకిలీ ఔషధాల వల్ల ప్రజల ఆరోగ్యం తీవ్ర ప్రమాదంలో పడుతోందని సీఎం ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో కల్తీకి సంబంధించిన సమాచారాన్ని ప్రజలు నేరుగా ప్రభుత్వానికి చేరవేసేలా ప్రత్యేక టోల్‌ఫ్రీ నంబర్‌ను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే అక్రమాలను వెలుగులోకి తీసుకొచ్చే విజిల్ బ్లోయర్ల వ్యవస్థను కూడా ఏర్పాటు చేయాలని సూచించారు. తెలంగాణ ఫుడ్ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ అథారిటీ చట్టంపై అసెంబ్లీలో సమగ్ర చర్చ నిర్వహించి, ప్రజల అభిప్రాయాలను సేకరించిన అనంతరం బిల్లుకు తుది రూపం ఇవ్వాలని సీఎం స్పష్టం చేశారు. కల్తీల నియంత్రణలో ప్రపంచంలోని వివిధ దేశాల్లో అమలవుతున్న చట్టాలు, విధానాలను అధ్యయనం చేసి వాటిలో ఉత్తమ పద్ధతులను తెలంగాణలో అమలు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. తొలి దశలో 'క్యూర్' ప్రాంతంలో పైలట్ ప్రాజెక్టుగా ఈ వ్యవస్థను అమలు చేసి, అనంతరం రాష్ట్రవ్యాప్తంగా విస్తరించనున్నట్లు తెలిపింది. సేంద్రియ ఉత్పత్తుల ధృవీకరణకు ప్రత్యేక వ్యవస్థను రూపొందించడంపైనా ప్రభుత్వం దృష్టి సారించింది. రసాయన అవశేషాలు, కల్తీ కారణంగా వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతులపై ప్రతికూల ప్రభావం పడుతోందని సీఎం పేర్కొన్నారు. ప్రజల ఆరోగ్య రక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ, కల్తీలకు పాల్పడే వారిపై ఇకపై ఎలాంటి రాజీ లేకుండా కఠిన చర్యలు తీసుకునేందుకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధమవుతోంది. ఈ సమీక్షలో డిజిపి ఆనంద్, సిఎస్ సంజయ్ జాజు తదితరులు పాల్గొన్నారు.

## మద్దిమడుగు పబ్బతి ఆంజనేయునికి, సంతు సేవాలాల్ ఆలయాలకు మహర్దశ

నోచుకోని మద్దిమడుగు క్షేత్ర ఆలయానికి,సంతు సేవాలాల్ ఆలయానికి రూపురేఖలు మారనున్నాయి. సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం మద్దిమడుగు ఆలయ అభివృద్ధికి 100 కోట్ల రూపాయలు మంజూరు చేశారు. అంతకుముందే ఇప్పటికే 22 కోట్ల రూపాయలతో మాడ వీధుల నిర్మాణం ప్రారంభించారు. అలాగే భక్తుల సౌకర్యార్థం 15 కోట్ల రూపాయలతో హరిత హోటల్ నిర్మాణానికి శంకుస్థాపన జరిగి పనులు ప్రారంభం అయ్యాయి. కృష్ణానది తీరాన ఉన్న ఈ పుణ్యక్షేత్రం త్వరలోనే దక్షిణ భారతదేశంలోని ప్రధాన పుణ్యక్షేత్రాల సరసన నిలవనుంది.

### ఎమ్మెల్యే వంశీకృష్ణ కృషి ఫలించింది

ఈ అభివృద్ధికి ప్రధాన కారకుడు అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్





చిక్కుడు వంశీకృష్ణ.. ఆలయ అభివృద్ధి కోసం గత కొంతకాలంగా ప్రభుత్వంపై నిరంతరం పోరాడి ఎమ్మెల్యే కృషి ఫలించి 100 కోట్ల నిధులు మంజూరయ్యాయి. "శ్రీరామునికి భక్తునిగా ఆంజనేయుడు, ఆంజనేయునికి భక్తునిగా ఎమ్మెల్యే వంశీకృష్ణ" అంటూ భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. నిధులు మంజూరు చేసిన సీఎం రేవంత్ రెడ్డికి,సీఎం సలహాదారులు వేం నరేందర్ రెడ్డికి కృషి చేసిన ఎమ్మెల్యే వంశీకృష్ణకు భక్తులు కృతజ్ఞతలు తెలిపారు.

### ఆలయ ప్రాముఖ్యత

కృష్ణానది ఒడ్డున వెలసిన పబ్బతి ఆంజనేయ స్వామి దేవాలయం భక్తులకు అత్యంత పవిత్రమైనది. ప్రతి సంవత్సరం కార్తీక మాసంలో ఇక్కడ వేలాది మంది భక్తులు ఆంజనేయ స్వామి మాలధారణ చేసి, 41 రోజుల దీక్ష పూర్తి చేస్తారు. దీక్షా విరమణ సందర్భంగా లక్షలాది మంది భక్తులు స్వామివారిని దర్శించుకుంటారు. దశాబ్దాలుగా సరైన సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్న భక్తులకు ఇప్పుడు ప్రభుత్వ నిధులతో అన్ని వసతులు కలగనున్నాయి. రహదారులు, మాడ వీధులు, భక్తుల వసతి గృహాలు, అన్నదాన సత్రాలతో ఆలయం కొత్త శోభ సంతరించుకోనుంది.

### ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ మాట్లాడుతూ..

"మద్దిమడుగు అభివృద్ధి నా కల. సీఎం రేవంత్ రెడ్డి 100 కోట్లు మంజూరు చేయడం పట్ల వారికి, ప్రభుత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు. త్వరలోనే మద్దిమడుగును అంతర్జాతీయ స్థాయి పుణ్యక్షేత్రంగా తీర్చిదిద్దుతాం"బి అని తెలిపారు..

## లక్షల ఉద్యోగాల హామీ ఏమయ్యింది

అభ్యర్థుల శోకాలు వినిపించడం లేదా అని ప్రశ్నించారు. సిటీ సెంట్రల్ లైబ్రరీలో దాడులు, ఓయూలో నిర్బంధాలు కనిపించడం లేదా అని అడిగారు. ఢిల్లీలో రాజ్యాంగం చేత పట్టుకుని రాహుల్ గాంధీ సుద్దపూస మాటలు మాట్లాడుతున్నారని విమర్శించారు. హైదరాబాద్ నడిబొడ్డున ప్రజాస్వామ్యం ఖూనీ అవుతుంటే పట్టించుకునే వారే లేరని కేటీఆర్ మండిపడ్డారు. రాహుల్ గాంధీ ప్రధాని అయ్యే వరకు వదిలిపెట్టనని సీఎం రేవంత్ రెడ్డి అంటున్నాడని తెలిపారు. నవంబర్ 22న అవినీతి సొమ్ముతో జాబ్ క్యాలెండర్‌పై యాడ్‌లు వేశారని గుర్తుచేశారు. కానీ ఇవాళ జాబులు లేవు.. జవాబులు లేవని విమర్శించారు. ఉద్యోగాలు లేవు.. క్యాలెండర్ మారినా.. జాబ్ క్యాలెండర్‌కు దిక్కు లేదని అన్నారు. అసెంబ్లీలో ప్రకటించిన జాబ్ క్యాలెండర్ చిత్తు కాగితాలుగా మారిందని విమర్శించారు. చరిత్రను మరిచిపోతే భవిష్యత్ తరాలు క్షమించవని హెచ్చరించారు. చరిత్రలు, ఇతిహాసాలు, పురాణాలు చదవాలని సీఎం రేవంత్ రెడ్డికి కేటీఆర్ సూచించారు. తెలంగాణ ఉద్యమాల్లో చావగొట్టిన వాళ్లే మళ్లీ అధికారంలోకి వస్తారని తెలిపారు. కాంగ్రెస్ అలవిగాని హామీలు నమ్మి తెలంగాణ యువత మోసపోయింద్రు అని తెలిపారు. 1952, 1969లో కాంగ్రెస్ పార్టీ తెలంగాణ యువత గుండెల్లో గుణపాలు నింపిందని గుర్తుచేశారు. వేలమంది యువత ప్రాణాలు తీసుకున్నా కాంగ్రెస్‌కు రక్తదాహం తీరడం లేదని అన్నారు. మన రక్తం పొలాల మీద చల్లాలని చిల్లరమాటలు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. రైతు, యూత్, మహిళ, ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్‌పై కాంగ్రెస్ అనేక హామీలు ఇచ్చిందని తెలిపారు. ఓటు కోసం కోటి మోసాలు చేస్తున్న కాంగ్రెస్ తీరు దేశానికి తెలియాలన్నారు. రేపటి తెలంగాణ నిర్మాతలు మీరు.. భవిష్యత్ నిర్ణేతలు మీరే అని యువతను ఉద్దేశించి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. అలాంటి యువతను కాంగ్రెస్ సర్కార్ మోసం చేస్తున్నదని మండిపడ్డారు. మీకు జరిగిన మోసం, వంచనను గుర్తుచేసుకుని కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. సరిగ్గా 38 నెలల కింద ఇదే సరూర్ నగర్ స్టేడియం సాక్షిగా తెలంగాణ యువత దగా పడిందని తెలిపారు. నిరుద్యోగులను వంచించిన దగాకోరులు కాంగ్రెస్ నాయకులు అని పేర్కొన్నారు. హైకమాండ్ తరలివచ్చి మాయామశ్చీంద్ర కార్యక్రమం ఇక్కడ చేశారని ఎద్దేవా చేశారు. యూత్ డిక్లరేషన్ పేరిట దుర్మార్గమైన వాగ్దానాల వరద పాటించారని మండిపడ్డారు. పాత కేటుగాళ్లు.. కొత్త డూప్లికేట్లు వచ్చి యువతపై లేని ప్రేమను కనబరిచారని తెలిపారు. యూత్‌కు ఇచ్చిన ఒక్క హామీ అయినా నెరవేర్చారా అని కేటీఆర్ ప్రశ్నించారు.

## 'విక్రమ్-1' విజయవంతంపై ప్రధాని మోడీ హర్షం

ఏరోస్పేస్ బృందంతో ఫోన్‌లో మాట్లాడి, వారికి ప్రత్యేక అభినందనలు తెలిపారు మోదీ. ఈ ప్రయోగాన్ని తాను ప్రత్యక్షంగా వీక్షించినట్టు చెప్పిన ఆయన.. ఈ ఘనత దేశానికి గొప్ప విజయమని అభివర్ణించారు. భారత అంతరిక్ష ప్రయాణంలో ఇదో కీలక మైలురాయిగా నిలిచిందని పేర్కొన్నారు. 'ప్రయోగాన్ని నేను ప్రత్యక్షంగా వీక్షించాను. దీని వెనుక ఎందరో యువ ఇంజినీర్ల శ్రమ దాగుంది. మొత్తం బృందానికి నా హృదయపూర్వక అభినందనలు. ఇది ఆరంభం మాత్రమే. ఈ ప్రయాణాన్ని మరింత ముందుకు తీసుకెళ్లాలి' అని స్కైరూట్ టీమ్‌ను ప్రోత్సహించారు. ఈ సందర్భంగా స్కైరూట్ ఏరోస్పేస్ శాస్త్రవేత్తలు, ఇంజినీర్ల బృందం త్వరలో తనను కలవాలని ఫోన్ ద్వారా ఆహ్వానించారు. అంతరిక్ష రంగంలో భారత్ స్వావలంబన దిశగా వేగంగా ముందుకు సాగుతోందని ఈ ప్రయోగం ప్రపంచానికి చాటిచెప్పిందని మోదీ అభిప్రాయపడ్డారు. 'అంతరిక్ష రంగంలోనూ భారత్ ఆత్మనిర్భర్‌గా ఎదగగలదని మీరు ప్రపంచానికి నిరూపించారు' అని ప్రధాని కొనియాడారు. 'విక్రమ్-1'లో తన 'వందేమాతరం' సందేశంతో కూడిన కార్డును కూడా పంపించిన విషయాన్ని ఈ సందర్భంగా ప్రస్తావించారు. ప్రపంచం నలుమూలల నుంచి వచ్చిన శుభాకాంక్షలు సహా ఆ సందేశం కూడా అంతరిక్షంలోకి చేరడం గర్వకారణమన్నారు. 'ఈ ప్రయోగం ద్వారా 'వందేమాతరం' సందేశం మరింత ఉన్నత స్థాయికి చేరి అంతరిక్షంలోనూ మార్మోగింది' అని మోదీ వ్యాఖ్యానించారు. శ్రీహరికోటలోని సతీష్ ధవన్ అంతరిక్ష కేంద్రం నుంచి శనివారం మధ్యాహ్నం 12:05 గంటలకు 'మిషన్ ఆగమన్' పేరిట చేపట్టిన 'విక్రమ్-1' రాకెట్ విజయవంతంగా నింగిలోకి దూసుకెళ్లింది. నిర్ణీత సమయం కంటే 35 నిమిషాలు ఆలస్యంగా ప్రయోగం చేపట్టినప్పటికీ.. అన్ని దశలను విజయవంతంగా పూర్తి చేయడంతో భారత ప్రైవేటు అంతరిక్ష రంగంలో కొత్త అధ్యాయానికి నాంది పలికింది.

## స్థానిక ఉత్పత్తులను ప్రజలు ఆదరించాలి

నుండి 26 వరకు ట్యాంక్ బండ్, అంబేద్కర్ విగ్రహము ప్రక్కన గల గ్రౌండ్స్ లో నిర్వహిస్తోంది.చేతివృత్తుల కళాకారులచే తయారు చేసిన వివిధ వస్తువుల ప్రదర్శన, విక్రయము విజయవంతంగా కొనసాగుతున్నది. ఈ ప్రదర్శనలో కుమ్మరులు వారు తయారు చేసిన మట్టిపాత్రలు, గౌడన్నల 'నీరా' స్టాల్, మేదరివారు తయారు చేసిన వెదురు వస్తువులు,హ్యాండ్ లూమ్స్ పోచంపల్లి-ఇక్కత్, గద్వాల్ - నారాయణపేట్, పూసలవారి సామగ్రి, మహిళా స్వయం సహాయక సంఘాల స్వగృహ ఫుడ్స్, ఇతర బిసి వర్గాలచే తయారు చేయబడిన వస్తువులు, తెలంగాణ వంటకాలు, మత్స్య కారుల తయారు చేయబడే చేప వంటకాలు, ఇతర భోజన స్టాల్స్ సందర్శకులను ఆకట్టుకుంటున్నాయి. ఈ ప్రదర్శనలో లభించే వస్తువులు వినియోగదారులకు, సందర్శకులకు సరసమైన ధరలలో లభ్యమవుతున్నాయి. ఈ ప్రదర్శన ప్రతిరోజు ఉదయం 10:00 గంటల నుండి సాయంత్రం 10:00 గంటల వరకు కొనసాగుతున్నది. ప్రభుత్వం సందర్శకులకు ప్రవేశము ఉచితంగా కల్పిస్తున్నది. ప్రదర్శనలో వివిధ రంగాలకు చెందిన 60 స్టాల్స్ ఏర్పాటు చేశారు. ప్రజల నుంచి వస్తున్న విశేష ఆదరణతో స్టాల్స్ నిర్వాహకులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. చేనేత, హస్తకళలు, మట్టి కళలు, చెక్క బొమ్మలు వంటి సంప్రదాయ కళలను ప్రోత్సహించడ మే ఈ మేళా ప్రధాన లక్ష్యమని, గ్రామీణ కళాకారుల ప్రతిభకు మార్కెట్ కల్పిస్తూ వారి జీవనోపాధిని బలోపేతం చేయడంలో ఇటువంటి మేళాలు కీలక పాత్ర పోషిస్తాయని రాష్ట్ర బిసి సంక్షేమశాఖ, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. 'వోకల్ ఫర్ లోకల్' భావనకు అనుగుణంగా స్థానిక ఉత్పత్తులను ప్రజలు ఆదరించాలని, సాంప్రదాయ కళలను నేటి తరానికి పరిచయం చేసి, భావితరాలకు అందించడం మన అందరి బాధ్యత అని ఆయన తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం కళాకారుల సంక్షేమం, నైపుణ్యాభివృద్ధి, మార్కెటింగ్ అవకాశాల విస్తరణకు కట్టుబడి ఉందన్నారు. మేళాలో పాల్గొన్న ప్రతి కళాకారుడికి అభినందనలు తెలియజేస్తూ, ప్రజలు పెద్ద ఎత్తున సందర్శించి హస్తకళ ఉత్పత్తులను కొనుగోలు చేసి కళాకారులను ప్రోత్సహించాలని మంత్రి విజ్ఞప్తి చేశారు. మన కళలు, మన చేతివృత్తులు? మన సంపద అనే భావనతో ప్రతి ఒక్కరూ ఈ మేళాను విజయవంతం చేయాలన్నారు. బోనాల పండుగకు అవసరమైన బోనం కుండలతో పాటు సంప్రదాయ ఆచారాలకు ఉపయోగించే వివిధ రకాల వస్తువులను ఈ ప్రదర్శనలో అందుబాటులో ఉంచారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, జీవన విధానంలో అంతర్భాగమైన అనేక కులవృత్తులు కనుమరుగు అవ్వకుండా మరింతగా ప్రోత్సహించెందుకు ప్రభుత్వం ప్రదర్శనను ఏర్పాటు చేసింది.

## గాంధీ జయంతి నాటికి చెత్తకు మోక్షం

చేసుకోవాలని పిలుపునిచ్చారు. కాలుష్యం మన ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతోందని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. చెత్త నిర్వహణలో ప్రతి కుటుంబం భాగస్వామ్యం కావాలని సూచించారు. ఇంట్లోనే తడి, పొడి చెత్తలను వేరు చేసుకోవాలని తెలిపారు. తడి చెత్తను కంపోస్ట్‌గా తయారు చేసుకోవాలని పేర్కొన్నారు. ఏపీలో అక్టోబర్ 2వ తేదీ నాటికి చెత్తలేకుండా చేస్తామని చెప్పారు. ఈ నెలలోనే తల్లికి వందనం కింద డబ్బులు వేస్తామని వెల్లడించారు. అంగన్ వాడీ కార్యకర్తలు, స్వచ్ఛాంధ్రప్రదేశ్‌లో పనిచేసే కార్మికులకు తల్లికి వందనం అమలు చేస్తామని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. రౌడీయిజం చేస్తే ఎవరినీ వదిలిపెట్టనని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హెచ్చరించారు. అమృత్ 2.0 శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. స్వర్ణ పంచాయతీ ఉద్యోగులకు స్వచ్ఛ అవార్డులు అందజేశారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు ప్రసంగించారు. గొడ్డలి పార్టీతో పెద్ద సమస్య వచ్చిందని తెలిపారు. రాష్ట్రంలో కొందరు క్రిమినల్స్‌గా మారారని చెప్పుకొచ్చారు. మాజీ మంత్రి కొడుకు యాక్సిడెంట్ చేస్తే ఓ వ్యక్తి చనిపోయాడని తెలిపారు. పోస్టర్లు, కటౌట్‌లకు పొట్టేళ్లను బలి ఇస్తున్నారని ధ్వజమెత్తారు. గత ప్రభుత్వ లక్ష్యం ప్రజలను దోపిడీ చేయడమేనని విమర్శించారు. తన జీవితంలో ఇలాంటి రాజకీయాలు చూడలేదని అన్నారు. ప్రజల జీవితాలతో ఆడుకుంటే తాము చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. ఇదిలావుంటే రాష్ట్రాభివృద్ధిలో మేము సైతం అంటూ కొందరు ఉదారతను చాటారు. గుడివాడలో జరిగిన స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో పాల్గొన్న సీఎం చంద్రబాబుకు తమ వంతు విరాళాలను అందించారు. అమరావతి కోసం గుడివాడకు చెందిన సాయిశ్వేత బంగారు గాజులు అందించారు. ఆమె కుమారుడు దాచుకున్న కిడ్డీ బ్యాంక్ నగదును కూడా అమరావతి అభివృద్ధికి వినియోగించాలని కోరారు. మరోవైపు గుడివాడ ఆర్టీసీ బస్టాండ్ అభివృద్ధి కోసం అన్నే నరసింహారావు, పుష్ప లీలావతి దంపతులు రూ.3 కోట్ల విరాళం ఇచ్చారు. గతంలోనూ వారు గుడివాడ ప్రభుత్వ ఆస్పత్రికి రూ.3 కోట్లు విరాళం ఇచ్చారు.

విజన్ ఆంధ్ర
తెలుగు దినపత్రిక
VISION ANDHRA TELUGU DAILY

## సంపాదకీయం

# కాళేశ్వరం...ఆత్మరక్షణలో కాంగ్రెస్ ప్రభుత్వం !

దొంగలుపడ్డ ఆరు నెలలకు ...అన్న చందంగా ప్రభుత్వం ఏర్పడి మూడేళ్లు కావస్తున్న తరుణంలో ఇప్పుడు ధరణిపై విచారణకు ఓ కమిటీని వేయాలని రేవంత్ సర్కార్ తీసుకున్న నిర్ణయం నవ్వులు తెప్పించేదిగా ఉంది. కెసిఆర్, బిఆర్ఎస్ అవినీతిపై పెద్దపెద్ద మాటలు మాట్లాడి అధికారంలోకి వచ్చిన రేవంత్ ఇప్పటి వరకు పైసా అవినీతిని నిరూపించ లేకపోయారు. కాళేశ్వరం, ధరణి, ఈ కార్ రేస్, పవర్ ప్లాంట్లు, విద్యుత్ ఒప్పందాలు తదితర అంశాలన్నీ ఇప్పుడు ప్రచార వస్తువుగా మారాయి. కేవలం బిఆర్ఎస్‌పై రాజకీయంగా పైచేయి సాధించేందుకు మాత్రమే విమర్శలు చేస్తున్నారు. ఇందులో ప్రధానంగా కాళేశ్వరం కూలేశ్వరం అంటూ చేసిన ఆరోపణల్లో ఇంచు కూడా ముందుకు కదలలేదు. లక్షకోట్లు పెట్టిన ప్రాజెక్ట్ పడావు పడ్డది. దానిని ఎలాగైనా వినియోగంలోకి తేవడం ద్వారా ప్రజాధనాన్ని కాపాడాలన్న ముందుచూపు లేకుండా పోయింది. ఎంతసేపు రాజకీయంగా విమర్శలు తప్ప ఈ ప్రభుత్వం గత బిఆర్ఎస్ చేసిన అవినీతిపై ఎలాంటి పురోగతి సాధించలేదు. రేవంత్ రెడ్డి దీనిని కేవలం రాజకీయంగా ఉపయోగించు కుని బిఆర్ఎస్‌ను భ్రష్టు పట్టించే యోచనలో ఉన్నారా అన్న అనుమానాలు వస్తున్నాయి. ఎందుకంటే కాళేశ్వరాన్ని పక్కన పెట్టి ఇప్పుడు మళ్లీ ప్రాణహిత అంటూ పల్లవి అందుకున్నారు. ఉన్న ప్రాజెక్టులను పూర్తి చేయడం, వినిగింలోకి ఎలా తేవడం అన్న ఆలోచన పక్కన పెట్టారు. అందుకే నిత్యం కాళేశ్వరం ప్రాజెక్టు వివాదం కొనసాగుతూనే ఉంది. రాజకీయ విమర్శలకు కాళేశ్వరం వేదికగా మారుతోంది. పరస్పర విమర్శలు తప్ప గోదావరి జలాలను ఎలా ఉపయోగించుకోవాలన్నది ఆలోచించడం లేదు. కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి నీటి విడుదల వ్యవహారం కాంగ్రెస్, బీఆర్ఎస్‌ల మధ్య సవాళ్లు, ప్రతిసవాళ్లు, పరస్పర ప్రజెంటేషన్లకు కేంద్రంగా మారింది. ఎల్‌నినో ప్రభావంతో వానలు వెనక్కి పోయాయి. మరో వైపు కాళేశ్వరం నుంచి గోదావరి జలాలు తరలింపు అసాధ్యమని ప్రభుత్వం తేల్చి చెప్పింది. ఈ ప్రాజెక్టును అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుని పూర్తి చేసినప్పటికీ మెడిగడ్డ వద్ద కొన్ని పిల్లర్లు కుంగడంతో ఇక అది పనికిరాదన్న రీతిలో ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. మోటర్లు, కాలువలు అంతా వృధా అవుతున్నాయి. ఇదే విషయాన్ని బిజెపి ఎంపి ఈటెల రాజేందర్ ప్రస్తావిస్తే.. ఆయనను బిఆర్ఎస్ ఏజెంట్‌గా అభివర్ణించి విమర్శలతో దాడి చేశారు. నిజానికి గత 2023 శాసనసభ ఎన్నికలలో బీఆర్ఎస్ ఓటమిలో కాళేశ్వరం, ధరణి అక్రమాలు ప్రధాన భూమిక పోషించాయి. అధికారంలోకి రావడానికి అనేకానేక హామీలు, వాగ్దానాలు గుప్పించిన రేవంత్ సర్కార్ ఇప్పుడు గుడ్డెద్దు చేలో పడ్డదన్నట్లుగా సాగుతున్నారు. పదికాలాలపాటు పనికి వచ్చే పనులు చేయడం లేదు. ముఖ్యంగా కాళేశ్వరం ప్రాజెక్టుపై ఎలాంటి విధానం అనుసరిం చాలన్న దానిమీద సరైన అవగాహన లేకుండా వ్యవహరిస్తున్నారు. కాళేశ్వరం పిల్లర్లను పునరుద్దరించే ప్రయత్నాలు చేసి, నీటిని వినియోగంలోకి తీసుకుని వచ్చివుంటే, ఈయేడు మంచి ఫలితాలు వచ్చేవి. ప్రభుత్వానికి మంచిపేరు వచ్చేది. కానీ కాళేశ్వరం ప్రాజెక్టను ఉపయోగించరాదన్న మొండి వైఖరితో రేవంత్ ఉన్నట్లుగా కనిపిస్తోంది. ఆ ప్రాజెక్టు భద్రత ప్రమాదంలో ఉందని నేషనల్ డామ్ సేఫ్టి అథారిటి చెప్పిందని, అందువల్ల అక్కడ నీటిని వినియోగంలోకి తసీఉకుని రావడం అసాధ్యమని చెబుతున్నారు. కాళేశ్వరం ఎటిఎంగా మారిందని గతంలో బిజెపి కూడా ఆరోపించింది. రేవంత్ రెడ్డి కూడా ఇదే ప ÷-రచారం చేశారు. పోనీ అలాగని ఇందులో జరిగిన అవినీతిని వెలికితీసి కెసిఆర్ తదితరులను దోషులుగా నిలబెట్టి ఉంటే రేవంత్ ఇమేజ్ పెరిగేది. కానీ ఆరోపణలతోనే రెండున్నరేళ్లుగా కాలయాపన చేస్తున్నారు. కాళేశ్వరం కమిషన్‌ను కూడా ఏర్పాటు చేశారు. జస్టిస్ పిసి ఘోష్ కమిటీ రిపోర్టుపై హైకోర్టు స్టే విధించింది. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, అప్పటి ఇరిగేషన్ మంత్రి హరీష్ రావులను అరెస్టు చేస్తారేమో అన్నంతగా ప్రచారం జరిగింది. అంతా తుస్సుమంది.ఇప్పుడు కమిషన్ రిపోర్టుకు కూడా పెద్ద విలువ లేకుండా పోయిందా అన్న అనుమానాలు వస్తున్నాయి. ప్రస్తుతం కాళేశ్వరం ప్రాజెక్టు బారేజీలైన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల వద్ద నీరు నిల్వచేసి పంప్‌హౌస్‌ల ద్వారా నీటిని తోడి ఆయా ప్రాంతాలలో ఉన్న రిజర్వాయిర్‌లను నింపాలని బిఆర్ఎస్ డిమాండ్ చేస్తోంది. ఇందుకు రేవంత్ ససేమిరా అనడంతో చంద్రబాబు కోసం గోదావరి జలాలను కిందికి జారవిడుస్తున్నారని బిఆర్ఎస్ నేతలు ఆరోపిస్తున్నారు. ఒక వైపు వర్షాభావ పరిస్థితులతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. అందువల్ల వర్షాలు తక్కువగా ఉన్న ప్రాంతాలకు నీరు ఎలా ఇవ్వవచ్చా అన్నదానిపై ఆలోచన చేసి ఉండాల్సింది. కేసీఆర్ కట్టించినంత మాత్రాన ఆ ప్రాజెక్టు కెసిఆర్‌ది అయిపోదు. ఇదంతా ఒక ఎత్తయితే ఇప్పుడు రాజకీయంగా రేవంత్‌ను ఏకిపారేయడంలో బిఆరెస్ మెల్లగా పైచేయి సాధిస్తోంది. మంత్రులు అవినీతిలో కూరుకు పోయారని కెటిఆర్, హరీష్ రావులు రోజూ విమర్శలు చేస్తున్నారు. కమీషన్లు లేనిదే మంత్రులు కాలు బయటపెట్టడం లేదని అంటున్నారు. ఈ ఎదురుదాడితో ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం ఓ రకంగా ఆత్మరక్షణలో పడిపోయింది. సింగరేణి తదితర విషయాల్లో గొంతులో పచ్చి వెలక్కాయ పడ్డట్లు అయ్యింది. ఈ క్రమంలోనే వాదోపవాదాలు, విమర్శ, ప్రతి విమర్శలతో రాజకీయ వేడెక్కింది. అవినీతి అంటూ ఆరోపించిన రేవంత్ నిరూపించలేదు. దీనికి బదులుగా కేటీఆర్, హరీష్‌రావులే గట్టిగా బదులు ఇస్తున్నారు. దీనివల్ల కూడా రేవంత్ అసహనానికి గురి అవుతున్నారనిపిస్తోంది. ఒక వేళ నిజంగానే గోదావరి నీటిని లిఫ్ట్ చేయడంలో ఇబ్బంది ఉంటే, ఎన్‌డిఎస్‌ఎ నివేదికపై అఖిలపక్షం నిర్వహించి చర్చ చేయాలి. బారేజీల వద్దకు, పంప్ హౌస్‌ల వద్దకు రిటైర్డ్ ఇంజనీర్లను తీసుకునివెళ్లి ఇరిగేషన్ అధికారుల ద్వారా పరిస్థితిని వివరించాలి. కానీ ఇవేవీ చేయకపోవడంతో ఇప్పుడు కాళేశ్వరమే బిఆర్ఎస్‌కు ఆక్సిజన్ నింపుతోంది.

## ఎల్ నినో ప్రభావం.. ఆరుతడి పంటలకు మొగ్గు చూపడం



నల్లబెల్లి: జులై 18, విజన్ ఆంధ్ర: వర్షాభావ పరిస్థితులు నెలకొనే అవకాశాల నేపథ్యంలో రైతులు తక్కువ నీటితో సాగు చేయగల ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించాలని వ్యవసాయ నిపుణులు సూచించారు. ముఖ్యంగా వరి సాగుకు అవసరమైన నీటి లభ్యత తగ్గిన పరిస్థితుల్లో రైతులు సజ్జ, జొన్న, కంది, ఆముదం, పొద్దుతిరుగుడు వంటి పంటలను సాగు చేయడం ద్వారా మెరుగైన దిగుబడులు సాధించవచ్చని పేర్కొన్నారు.వ్యవసాయ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం, ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం తగ్గే అవకాశమున్నందున రైతులు నీటి వినియోగాన్ని సమర్థవంతంగా నిర్వహించాలి. కాలువలకు, కుంటల్లో నీరు నిలవ లేని పరిస్థితి ఉంటే వరి బదులుగా పప్పు జాతి, నూనె గింజల పంటలు లేక చిరుదాన్యాలు మరియు కూరగాయలు పంటలు వేయాలని సూచించడం జరిగింది. అలాగే తక్కువ వ్యవధిలో పూర్తయ్యే, తక్కువ నీటి అవసరమున్న పంటలను ఎంపిక చేసుకోవడం లాభదాయకమని తెలిపారు.ప్రత్యామ్నాయ పంటల్లో సజ్జ పంట 80–85 రోజుల్లో, జొన్న సుమారు 100 రోజుల్లో, కంది 90–120 రోజుల్లో వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులు పంటలు సాగు చేయాలని సూచించారు.

# సోనమ్ వాంగ్‌చుక్ నిరాహార దీక్ష భగ్నం అప్రజాస్వామికం


**- ఉద్యమాన్ని అణచివేయాలని చూస్తున్న బిజెపి ప్రభుత్వం**

**- సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్ళపల్లి శ్రీనివాస్ రావు**

హన్మకొండ జిల్లా ప్రతినిధి జులై 18,( విజన్ ఆంధ్ర ) : ప్రజాస్వామ్య పద్ధతిలో నిరసన తెలుపుతున్న సోనమ్ వాంగ్‌చుక్ దీక్షను పోలీసులు బలవంతంగా భగ్నం చేయడాన్ని సీపీఐ తెలంగాణ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్ళపల్లి శ్రీనివాస్ రావు తీవ్రంగా ఖండించారు. ప్రజా సమస్యలపై, విద్యా వ్యవస్థలోని లోపాలపై, మరియు లడఖ్ ప్రజల హక్కుల కోసం శాంతియుతంగా నిరసన తెలుపుతున్న సోనమ్ వాంగ్‌చుక్ పట్ల కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు అప్రజాస్వామికం.ఒక దేశభక్తుడు, మేధావి తన ప్రాణాలను పణంగా పెట్టి పోరాడుతుంటే, వారి డిమాండ్లను పరిష్కరించాల్సింది పోయి, దీక్షను భగ్నం చేయడం ద్వారా ప్రభుత్వం తన నిరంకుశత్వాన్ని చాటుకుందని ఆయన ఆరోపించారు. నీట్ పరీక్షా పేపర్ లీకేజీలు, పరీక్షల నిర్వహణలో వైఫల్యాలకు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని, ఈ విషయంలో ప్రభుత్వం పారదర్శకంగా వ్యవహరించాలని ఆయన డిమాండ్ చేశారు.సోనమ్ వాంగ్‌చుక్ లేవనెత్తిన అంశాలు కేవలం ఆయనవి మాత్రమే కాదని, అవి దేశ భవిష్యత్తుకు సంబంధించినవని పేర్కొంటూ, వాంగ్‌చుక్ పోరాటానికి సీపీఐ సంపూర్ణ మద్దతు తెలుపుతుందని ఆయన స్పష్టం చేశారు. ఢిల్లీ పోలీసులు ఢిల్లీ హైకోర్టు ఆదేశాల వెనుక దాక్కోలేరు. సోనం వాంగ్‌చుక్ ఆరోగ్యాన్ని పర్యవేక్షించాలని మాత్రమే కోర్టు ఆదేశించింది; ఆయన ఇష్టానికి వ్యతిరేకంగా ఆందోళనా స్థలం నుండి బలవంతంగా తరలించమని ఆదేశించలేదు. ఈ పరిణామాలు ప్రభుత్వ ఉద్దేశాలపై తీవ్ర ఆందోళనలను కలిగిస్తున్నాయి. ఢిల్లీ పోలీస్ కమిషనర్‌ను అకస్మాత్తుగా మార్చడం, ఆ తర్వాత శాంతియుత ఉద్యమంపై ఈ అణచివేత, విద్యార్థుల ఉద్యమాన్ని అణచివేయడమే లక్ష్యమని మరియు జూలై 20న పార్లమెంటుకు జరగాల్సిన మార్చ్‌ను దెబ్బతీయాలనే ఉద్దేశంతోనే ఈ చర్యలు జరుగుతున్నాయనే అనుమానాలను బలపరిచాయి. శాంతియుత ప్రజాస్వామ్య నిరసనల పట్ల ఇటువంటి నియంతృత్వ పోకడలకు రాజ్యాంగబద్ధమైన ప్రజాస్వామ్యంలో చోటు లేదు. ప్రభుత్వం తన అణచివేత విధానాన్ని తక్షణమే విరమించుకోవాలని, శాంతియుత నిరసనకారులందరి ప్రజాస్వామ్య హక్కులను మరియు భద్రతను నిర్ధారించాలని, అలాగే విద్యార్థి ఉద్యమంతో అర్థవంతమైన చర్చలు జరపాలని డిమాండ్ చేస్తున్నాము. దేశ విద్యా వ్యవస్థ అపూర్వమైన రీతిలో కుప్పకూలినందుకు నైతిక బాధ్యత వహిస్తూ, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలనీ డిమాండ్ చేశారు.

## ఎల్ నినో పరిస్థితులపై సమావేశానికి అన్ని ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలి

**- జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**



గద్వాల జూలై 18 ( విజన్ ఆంధ్ర బ్యూరో) : ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ఎల్ నినో పరిస్థితులపై జిల్లా ఇన్చార్జి మంత్రి అధ్యక్షతన ఈ నెల 20 న నిర్వహించనున్న సమావేశానికి అన్ని ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అధికారులను ఆదేశించారు. శనివారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అన్ని జిల్లాల కలెక్టర్లు, ప్రత్యేక అధికారులు, ఉన్నతాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి,ఎల్‌నినో ప్రభావంతో ఏర్పడిన వర్షాభావ పరిస్థితులపై ఈ నెల 20న ఉమ్మడి జిల్లా స్థాయి సమీక్ష సమావేశం పై వివరించారు. ఈ సందర్భంగా ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ ప్రభుత్వం నియమించిన ప్రత్యేక అధికారుల ఆధ్వర్యంలో ఈ నెల 20వ తేదీ (సోమవారం) ఉమ్మడి జిల్లా స్థాయిలో జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి అధ్యక్షతన సమీక్ష సమావేశాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశాల్లో వర్షాభావ పరిస్థితులు, తాగునీటి నీటి వనరుల లభ్యత, వ్యవసాయ, ఉద్యాన పంటల పరిస్థితి, ప్రత్యామ్నాయ పంటల సాగు, భూగర్భ జలాలు, విద్యుత్ సరఫరా, పశు వులకు మేత, తాగునీటి ఏర్పాట్లు, నీటి సంరక్షణ చర్యలు తదితర అంశాలపై శాఖల వారీగా సమగ్ర సమీక్ష నిర్వహించి అవసరమైన నిర్ణయాలు తీసుకోనున్నట్లు పేర్కొన్నారు. ఇందుకోసం సంబంధిత శాఖల అధికారులు పూర్తి సమాచారంతో సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. గద్వాల ఐడీఓసీ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ సంబంధిత జిల్లా అధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. అనంతరం సోమవారం నిర్వహించనున్న ఉమ్మడి జిల్లా స్థాయి సమీక్ష సమావేశానికి అన్ని శాఖల అధికారులు పూర్తి సమాచారంతో సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. జిల్లాలో వర్షాభావ పరిస్థితులు, తాగునీటి లభ్యత, జలాశయాల నీటి నిల్వలు, వ్యవసాయ, ఉద్యాన పంటలు, భూగర్భ జలాలు, విద్యుత్ సరఫరాపై శాఖలవారీగా పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ నర్సింగ రావు, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# వస్త్ర వ్యాపార రంగంలో “మాంగల్య షాపింగ్ మాల్ సంచలనం“

**-దిలసుఖనగర్ లో మాంగళ్య షాపింగ్ మాల్ 32వ శాఖ ఘన ప్రారంభం**

**-ముఖ్యఅతిథిగా హాజరైన ప్రముఖ సినీనటి మీనాక్షి చౌదరి**

**-అంచలంచలుగా వ్యాపిస్తున్నటువంటి మాంగళ్య వస్త్ర వ్యాపార సామ్రాజ్యం: డైరెక్టర్స్**





రంగారెడ్డి జిల్లా బ్యూరో/ఎల్బీనగర్, జూలై (విజన్ ఆంధ్ర): తెలంగాణ రాష్ట్ర వస్త వ్యాపార రంగంలో మాంగల్య షాపింగ్ మాల్ సరికొత్త డిజైన్స్ తో సంచలన సృష్టించింది. సాంప్రదాయ బద్ధమైనటువంటి వస్త్రాలను అందించడంతోపాటు సరికొత్త కలెక్షన్లతో దిల్సుఖ్ నగర్ ప్రాంతంలో 32వ షోరూం శుక్రవారం వైభవంగా ప్రారంభమైంది. 2012లో తెలంగాణ రాష్ట్రం వరంగల్‌లో ప్రారంభమైన మాంగళ్య షాపింగ్ మాల్, వస్త్ర వ్యాపార రంగంలో నూతన ఒరవడిని సృష్టిస్తూ వేగంగా విస్తరిస్తోంది. నాణ్యమైన వస్త్రాలను సరసమైన ధరలకు అందిస్తూ ప్రజల ఆదరణను పొందిన మాంగళ్య, ఇప్పటికే తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల్లో తన ఉనికిని చాటింది. ఈ క్రమంలో దిలసుఖ్ నగర్ లో శాఖను ఘనంగా ప్రారంభించింది. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ప్రముఖ సినీ నటి మీనాక్షి చౌదరి ముఖ్య అతిథిగా హాజరై, జ్యోతి ప్రజ్వలన చేసి మాల్‌ను ప్రారంభించారు. అనంతరం మాల్‌లోని వివిధ విభాగాలను సందర్శించి, అభిమానులతో సంతోషంగా మమేకమయ్యారు. ఉదయం నుంచే పెద్ద సంఖ్యలో అభిమానులు తరలివచ్చి ఉత్సాహభరిత వాతావరణాన్ని సృష్టించారు. అనంతరం నటి మీనాక్షి చౌదరి మాట్లాడుతూ...... దిలసుఖ్ నగర్ ప్రజలు మాంగళ్య షాపింగ్ మాల్‌కు మంచి ఆదరణ అందిస్తారని నమ్మకం ఉందన్నారు. వినియోగదారుల ఆశీర్వాదాలతో ఈ మాల్ మరింత విజయవంతమవుతుందన్నారు. ఈ సందర్భంగా మాంగళ్య షాపింగ్ మాల్ డైరెక్టర్లు పుల్లూరు నరసింహ మూర్తి, కాసం నమశివాయ, కాసం మల్లికార్జున, కాసం కేదారినాథ్, కాసం శివప్రసాద్, పుల్లూరు అరుణ్ కుమార్ మాట్లాడుతూ.. ప్రతి వర్గానికి, ప్రతి సందర్భానికి అనువైన నాణ్యమైన వస్త్రాలను అందుబాటు ధరల్లో అందించడమే మా విజయ రహస్యం అని తెలిపారు.“మా స్వంత హ్యాండ్‌లూమ్ ఉత్పత్తులను ఆధునిక మార్కెట్ ట్రెండ్స్‌కు అనుగుణంగా డిజైన్ చేసి, వస్త్ర వ్యాపారంలో ముందంజలో కొనసాగుతున్నాం అని పేర్కొన్నారు. మాంగళ్య షాపింగ్ మాల్‌లో మహిళలు, పురుషులు, యువత, పిల్లల కోసం తాజా ఫ్యాషన్ కలెక్షన్స్, అలాగే వివాహాలు, శుభకార్యాలకు ప్రత్యేకమైన భారీ వెడ్డింగ్ కలెక్షన్స్ అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ మాల్ ప్రారంభంతో దిలసుఖ్ నగర్ ప్రజలు ఇకపై పెళ్లి షాపింగ్ కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా, తమ ప్రాంతంలోనే నాణ్యమైన వస్త్రాలను సరసమైన ధరలకు కొనుగోలు చేయవచ్చునన్నారు. రూ.99 నుంచి ప్రారంభమై రూ.1 లక్ష వరకు ధరల శ్రేణిలో వస్త్రాలు అందుబాటులో ఉండటంతో పాటు, మాంగళ్య ఒక సంపూర్ణ ఫ్యామిలీ షాపింగ్ మాల్ గా ప్రత్యేక గుర్తింపు పొందిందన్నారు. ప్రస్తుతం మూడు రాష్ట్రాల్లో విజయవంతంగా కొనసాగుతున్న మాంగళ్య షాపింగ్ మాల్, రాబోయే రోజుల్లో ఈ మూడు రాష్ట్రాల్లోనే 10 కొత్త ప్రాజెక్టులు ప్రారంభించనుండగా, భవిష్యత్తులో తమిళనాడు రాష్ట్రానికి కూడా విస్తరించనున్నట్లు డైరెక్టర్లు తెలిపారు. దేశవ్యాప్తంగా వినియోగదారుల విశ్వాసాన్ని పొందిన మాంగళ్య షాపింగ్ మాల్, పాన్ ఇండియా స్థాయిలో నంబర్ వన్ షాపింగ్ మాల్‌గా నిలుస్తోందని వారు పేర్కొన్నారు. ప్రజలు తమ తమ శుభ కార్యక్రమం ఏది ఉన్న ఒకసారి మాంగళ్య షాపింగ్ మాల్ కు సకుటుంబ సపరివారంగా విచ్చేసి ఒక నూతన షాపింగ్ ఒరవడి సృష్టించాలని డైరెక్టర్స్ వినియోగదారులకు విజ్ఞప్తి చేశారు. షాపింగ్ మాల్ ప్రారంభించిన అనంతరం వందలాది సంఖ్యలో హాజరైనటువంటి మహిళలు పెద్ద ఎత్తున కొనుగోలు ప్రారంభించడంతో యజమాన్యం, నిర్వాహకులు ఉత్సాహంతో ఆనందం వ్యక్తం చేశారు. నిరుపేద, మధ్యతరగతి, ప్రజలతో పాటు ప్రతి ఒక్కరికి అందుబాటులో ఉండే విధంగా అత్యాధునిక వస్త్రాలను అందించడంతోపాటు సరళమైన ధరలను కచ్చితంగా ఉంచుతామన్నారు. పెద్ద సంఖ్యలో హాజరైన మహిళలు ప్రత్యేక డిస్కౌంట్లతో ఉన్నటువంటి వస్త్రాలను కొనుగోలు చేసి శు భారంభం చేశారని నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

**ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన మినీ రోబో............**

మాంగల్య షాపింగ్ మాల్ ప్రారంభోత్సవంలో ప్రత్యేక ఆకర్షణగా మినీ రోబో వినియోగదారులను విపరీతంగా ఆకట్టుకుంది. షాపింగ్ మాల్ వచ్చే ప్రతి ఒక్కరిని ముందుకు వెళ్లి ఆహ్వానం పలుకుతూ పూల గుచ్చాన్ని అందించే విధంగా యాక్షన్ చేయడంతో మహిళలు, చిన్నపిల్లలు ఎంతో ఆసక్తిగా తిలకించారు. షాపింగ్ మాల్ లో మినీ రోబో చేసినటువంటి సందడి ఆహుతులను ప్రత్యేకంగా అలరించింది.

# పేరిణి నాట్యం తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతీక..

**- సంప్రదాయ కళలను కాపాడటం అందరి బాధ్యత..**

**- కాళోజీ కళాక్షేత్రాన్ని కళలకు శాశ్వత వేదికగా తీర్చిదిద్దుతున్నాం..**

**- పేరిణి గురు-శిష్య పరంపర వేడుకల్లో ఎమ్మెల్యే నాయిని**



హనుమకొండ జిల్లా ప్రతినిధి జులై 18 ( విజన్ ఆంధ్ర ): తెలంగాణ రాష్ట్ర తెలుగు భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో, నటరాజ కల కృష్ణ నృత్యజ్యోతి అకాడమీ వరంగల్ ఆధ్వర్యంలో హనుమకొండలోని కాళోజీ కళాక్షేత్రంలో గజ్జెల రంజిత్ కుమార్ నిర్వహించిన “పేరిణి నాట్య గురు–శిష్య పరంపర” వేడుకకు ముఖ్య అతిథులుగా హాజరైన వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి తొలుత పలువురు నృత్యకళాకారులు చేసిన కళా ప్రదర్శనలు తిలకించారు,అనంతరం జ్యోతి వెలిగించి కార్యక్రమం ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, పేరిణి నాట్యం వంటి గొప్ప సాంప్రదాయ కళలను సంరక్షించడం చిన్న విషయం కాదన్నారు. ఎంతమంది పాల్గొన్నారన్నది కాకుండా, ఈ కళా సంప్రదాయాన్ని భావితరాలకు చేరవేయాలనే తపన ఉండటం గొప్ప విషయమని కొనియాడారు. పేరిణి నాట్యం కేవలం ఒక నృత్యరూపం మాత్రమే కాదని, యుద్ధానికి వెళ్లే వీరుల్లో ధైర్యం, ఉత్సాహం నింపే అపూర్వమైన వారసత్వ కళారూపమని పేర్కొన్నారు. కాళోజీ కళాక్షేత్రం రాష్ట్రంలో కళలకు నిలయంగా మారడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బాధ్యతలు చేపట్టిన అనంతరం నిలిచిపోయిన కళాక్షేత్ర నిర్మాణాన్ని పూర్తి చేసేందుకు అవసరమైన నిధులు మంజూరు చేసి, కొద్ది నెలల్లోనే అందుబాటులోకి తీసుకురావడం వల్ల నేడు ఇక్కడ వరుసగా సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతున్నాయని తెలిపారు. ఇలాంటి వేదికల ద్వారా యువతకు మన సంస్కృతి, సంప్రదాయాలు చేరువవుతాయని అన్నారు.పేరిణి నాట్య గురు–శిష్య పరంపరను కొనసాగిస్తూ ఈ కళను సజీవంగా ఉంచుతున్న గురువులు, కళాకారులు, నిర్వాహకులను ఎమ్మెల్యే ప్రత్యేకంగా అభినందించారు. ఇలాంటి కార్యక్రమాలు తెలంగాణ సంస్కృతి వైభవాన్ని ప్రపంచానికి చాటిచెప్పే వేదికలుగా నిలవాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో నటరాజ కళ కృష్ణ,పద్మశ్రీ అవార్డ్ గ్రహీత ఉమా మహేశ్వరి,ధరావత్ రాజ్ కుమార్,విజయ రచన,పేరిణి నృత్య గురువులు,నాట్య కళాకారులు పాల్గొన్నారు.

## వలలో చిక్కుకున్న కుకేడు పాము.. అటవీశాఖకు అప్పగించిన ఇంటి యజమాని



వరంగల్ జిల్లా ప్రతినిధి జూలై18(విజన్ ఆంధ్ర); వరంగల్ జిల్లా కేంద్రంలోని పర్వతగిరి మండల కేంద్రానికి చెందిన ఏటూరి తిర్మల్ రావు ఇంటి ఆవరణలో శనివారం ఉదయం కుకేడు పాము వలలో చిక్కుకుని కనిపించడం స్థానికంగా కలకలం రేపింది. తిర్మల్ రావు తన ఇంటి ఆవరణలో పెరటి, ఔషధ మొక్కలను పెంచుకుంటున్నారు. కోతుల బెడద నుంచి మొక్కలను రక్షించేందుకు వాటి చుట్టూ రక్షణ వల ఏర్పాటు చేశారు. శనివారం ఉదయం లేచి ఆవరణలోకి వెళ్లి చూడగా ఆ వలలో కుకేడు పాము చిక్కుకుని కనిపించింది. దీంతో భయాందోళనకు గురైన ఆయన అరుపులు వేయడంతో చుట్టుపక్కల వారు అక్కడికి చేరుకున్నారు. స్థానికులు పామును చంపాలని సూచించినప్పటికీ, తిర్మల్ రావు మానవత్వంతో వ్యవహరించి అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. ఘటనాస్థలికి చేరుకున్న అటవీశాఖ సిబ్బంది పామును సురక్షితంగా వల నుంచి బయటకు తీసి తమ ఆధీనంలోకి తీసుకున్నారు. వన్యప్రాణులను చంపకుండా సంబంధిత అధికారులకు సమాచారం ఇచ్చి అప్పగించిన తిర్మల్ రావును స్థానికులు అభినందించారు. అటవీశాఖ అధికారులు కూడా అడవి జంతువులు లేదా పాములు కనిపించినప్పుడు వాటిని హాని చేయకుండా వెంటనే తమకు సమాచారం ఇవ్వాలని ప్రజలకు సూచించారు.

# భార్యను దూరం పెడుతూ.. సహోద్యోగితో సహవాసం

**- ఉపాధ్యాయుడిపై ఉన్నతాధికారులకు భార్య ఫిర్యాదు**

**- హసన్‌పర్తి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు**

**- నిందితుడిని సస్పెండ్ చేయాలని డిమాండ్**

**- ఐనవోలు మండలంలో సంచలనం**





వరంగల్ జిల్లా ప్రతినిధి జూలై18(విజన్ ఆంధ్ర); ఐనవోలు మండలంలో పనిచేస్తున్న ఓ ప్రభుత్వ ఉపాధ్యాయుడి నిర్వాకంపై ఆయన భార్య భాగ్యలక్ష్మి ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. తనకు వివాహం కాలేదని నమ్మించి, తోటి ఉపాధ్యాయురాలితో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడని, భార్య, ఇద్దరు పిల్లలను అన్యాయానికి గురిచేస్తున్నాడని ఆమె ఆరోపించారు. పోలీసులకు మరియు విద్యాశాఖ అధికారులకు ఫిర్యాదు చేయడంతో ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది.

అధికారులకు ఫిర్యాదు చేసిన భాగ్యలక్ష్మి

భాగ్యలక్ష్మి తెలిపిన వివరాల ప్రకారం, 2012లో వారికి వివాహం జరిగి ఇద్దరు పిల్లలు ఉన్నారు. అయినప్పటికీ, తన భర్త అదే మండలంలో పనిచేస్తున్న మరో ఉపాధ్యాయురాలితో సన్నిహితంగా ఉంటూ, తనకు పెళ్లి కాలేదని ఆమెను నమ్మించాడు. ఈ విషయాన్ని గ్రహించిన భాగ్యలక్ష్మి ప్రశ్నించగా, తనను వదిలించుకునేందుకు విడాకుల నోటీసులు పంపి కుటుంబాన్ని విడదీయాలని చూస్తున్నాడని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. గతంలోనే ఇదే కుటుంబ వివాదాల నేపథ్యంలో అతను ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా, ఇటీవల కోర్టు ప్రాంగణంలో కూడా తనను బెదిరించాడని ఆమె అధికారులకు వివరించారు.

పోలీసు, విద్యాశాఖ విచారణ

భాగ్యలక్ష్మి చేసిన ఫిర్యాదు మేరకు హసన్‌పర్తి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మరోవైపు, జిల్లా గ్రీవెన్స్‌లో ఆమె ఇచ్చిన వినతిపత్రం ఆధారంగా విద్యాశాఖ అధికారులు విచారణ ప్రారంభించారు. తనకు, తన పిల్లలకు రక్షణ కల్పించాలని, బాధ్యుడైన ఉపాధ్యాయుడిని విధుల నుండి సస్పెండ్ చేయాలని ఆమె తన పిల్లలతో కలిసి ఆందోళన చేపట్టారు. విచారణ అనంతరం తదుపరి చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. ఈ వ్యవహారం ఉపాధ్యాయ వర్గాల్లోనూ తీవ్ర కలకలం రేపింది.

## పవన్ కళ్యాణ్‌కు లోకేశ్ పరామర్శ

**- త్వరగా కోలుకోవాలని ఆకాంక్ష**

హైదరాబాద్,జూలై18 : కుడి భుజానికి శస్త్రచికిత్స చేయించుకున్న ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ను మంత్రి నారా లోకేశ్ పరామర్శించారు. హైదరాబాద్ నివాసంలో విశ్రాంతి తీసుకుంటున్న పవన్‌ను కలిసిన ఆయన.. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. వైద్యుల సూచనలు పాటించి విశ్రాంతి తీసుకోవాలని సూచించారు. ఇటీవల ముంబయిలోని కోకిలాబెన్ ధీరూభాయ్ అంబానీ ఆస్పత్రిలో పవన్ కల్యాణ్ శస్త్రచికిత్స చేయించుకున్న సంగతి తెలిసిందే. ఆర్థోపెడిక్ సర్జన్, స్పోర్ట్స్ మెడిసిన్ నిపుణులు డాక్టర్ దిన్షా పార్థీవాలా నేతృత్వంలో వైద్యుల బృందం పవన్ కుడి భుజానికి సర్జరీ చేసింది.

# తెలంగాణ రాష్ట్ర సాంప్రదాయ కులవృత్తుల మేళాకు విశేష స్పందన

**- ఆషాఢ మాస బోనాల సందర్భంగా హెచ్ఎండీఏ గ్రౌండ్స్‌లో ప్రత్యేక ప్రదర్శన**
**- ఆదివారం సెలవు దినాన్ని సద్వినియోగం చేసుకొని మేళాను సందర్శించి బీసీ కళాకారులను ప్రోత్సహించండి- మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్,**





రంగారెడ్డి జిల్లా బ్యూరో, జూలై 18 (విజన్ ఆంధ్ర): తెలంగాణ రాష్ట్ర సాంప్రదాయాల పండుగ ఆషాఢ బోనాల ఉత్సవాల సందర్భంగా హెచ్ఎండీఏ గ్రౌండ్స్‌లో ఏర్పాటు చేసిన కులవృత్తుల మేళాకు నగర ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తున్నదని తెలంగాణ రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. బోనాల పండుగకు అవసరమైన కుండలు, బుట్టలు, మట్టి పాత్రలు తదితర సంప్రదాయ వస్తువులను పెద్ద ఎత్తున కొనుగోలు చేస్తూ ప్రజలు కళాకారులను ప్రోత్సహిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. మొత్తం 60 స్టాళ్లతో 15 రోజుల పాటు నిర్వహిస్తున్న ఈ కులవృత్తుల మేళాను రేపు ఆదివారం సెలవు దినం సందర్భంగా కుటుంబ సమేతంగా సందర్శించి, బీసీ వర్గాలకు చెందిన కళాకారులు తయారు చేసిన ఉత్పత్తులను కొనుగోలు చేసి ప్రోత్సహించాలని మంత్రి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం సంప్రదాయ కులవృత్తులకు నూతన ఊతమిస్తూ, బీసీ వర్గాలకు చెందిన కళాకారులు తమ ఉత్పత్తులను నేరుగా ప్రజలకు విక్రయించుకునేందుకు ప్రత్యేక స్టాళ్లను ఏర్పాటు చేసినట్లు మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా సంప్రదాయ వృత్తులకు ప్రోత్సాహం లభించడంతో పాటు వేలాది మంది కళాకారుల జీవనోపాధికి భరోసా కలుగుతుందని చెప్పారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, జీవన విధానంలో అంతర్భాగంగా ఉన్న అనేక కులవృత్తులు కనుమరుగుకాకుండా కాపాడేందుకు ఇటువంటి ప్రదర్శనలు ఎంతో దోహదపడతాయని మంత్రి పేర్కొన్నారు. ఈ వృత్తులు రాష్ట్ర సాంస్కృతిక వారసత్వాన్ని పరిరక్షించడమే కాకుండా పర్యావరణహితమైన, ఆరోగ్యకరమైన జీవనశైలిని కూడా ప్రోత్సహిస్తాయని అన్నారు. ఈ ప్రదర్శనలో టెర్రకోట ఉత్పత్తులు, మట్టి పాత్రలు, జనపనార ఉత్పత్తులు, మేదర బుట్టలు, గద్వాల్ చీరలు, పోచంపల్లి ఇకత్ చేనేత వస్త్రాలు, నిర్మల్ బొమ్మలు, నిర్మల్ చిత్రకళా ఉత్పత్తులు, వెండి ఫిలిగ్రీ కళాఖండాలు, వరాహి హస్తకళ ఉత్పత్తులు, వరంగల్ దుర్రీలు, నారాయణపేట చేనేత వస్త్రాలు, పెంబర్తి ఇత్తడి కళాఖండాలు, సెర్ప్, మెప్మా ఆధ్వర్యంలోని సేంద్రీయ ఆహార ఉత్పత్తులు, రానున్న వినాయక చవితి సందర్భంగా పర్యావరణహిత మట్టి వినాయక విగ్రహాలు, పూసల కళాఖండాలు, సంప్రదాయ ఔషధాలు, విశ్వకర్మ కళాకారుల ఉత్పత్తులు, ప్రభుత్వ విజయ డెయిరీ ఉత్పత్తులు ప్రజలకు అందుబాటులో ఉన్నాయని మంత్రి తెలిపారు. ఈ ప్రదర్శనలో పాల్గొన్న కళాకారుల నైపుణ్యాన్ని మంత్రి అభినందిస్తూ, తమ సంప్రదాయ కళలు, కులవృత్తులను భావితరాలకు అందించే దిశగా నిరంతరం కృషి చేయాలని ఆకాంక్షించారు. ప్రజలు స్థానిక కళాకారుల ఉత్పత్తులను కొనుగోలు చేయడం ద్వారా సంప్రదాయ కులవృత్తులను పరిరక్షించడమే కాకుండా వేలాది మంది కళాకారుల కుటుంబాలకు అండగా నిలుస్తారని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ రంగాల చెందిన ప్రముఖులు పెద్ద ఎత్తున హాజరయ్యారు.

# వార్త సేకరించే విలేకరిపై దాడి

**- కృష్ణ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసిన విలేకరులు**



నారాయణపేట, జూలై 18 (విజన్ ఆంధ్ర) : గత కొంతకాలంగా తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం ఇసుకను ఆన్లైన్లో లేకపోవడంతో కొందరు ఇసుక మాఫియా వ్యక్తులు ఆన్లైన్ లేకుండా ఇసుకను తరలిస్తున్నారని విషయాన్ని గమనించిన ఓ పత్రిక విలేఖరి ఆ దృశ్యాలను చిత్రీకరించేందుకు వెళ్లిన ఆ విలేకరిపై అక్రమ మాఫియా నాయకులు దాడి చేసిన సంఘటన చోటుచేసుకుంది. ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. నారాయణపేట జిల్లా కృష్ణా మండలంలోని ఇసుక మాఫియా వ్యక్తులు ప్రభుత్వ అధికారుల కళ్ళుగప్పి ఆన్లైన్లో నమోదు చేసుకోకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తూ ప్రతినిత్యం మూడు పువ్వులు ఆరు కాయలుగా అధికారుల కనుసనల్లో తెలుస్తోంది. మండలంలోని రైతులు ప్రతినిత్యం అధికారుల దృష్టికి తమ గ్రామాల నుండి ఇసుకను తరలిస్తున్న వ్యక్తులను పట్టుకోవాలని ఎన్నిసార్లు విన్నవించినా కూడా అధికారులు మాత్రం మామూలుగా మత్తులో ఉన్నారనే విషయాన్ని ఓ విలేఖరి పై దాడి చేసిన సంఘటన నిదర్శనమని అనిపిస్తుంది. మండలంలో ప్రతినిత్యం అక్రమ వ్యక్తులు ఇసుక తరలిస్తుంటే అధికారులకు సమాచారాన్ని విలేకరులు అందిస్తే అలాంటిది ఏమీ లేదని సమాధానాలు చెప్పుకొస్తున్నారు అంతేకాకుండా మండలంలోని ఆయా గ్రామాల రైతులు మాత్రం విలేకరులకు ప్రతినిత్యం ఫోన్లు చేసి రాత్రి పగలు లేకుండా ఇబ్బందులు పెడుతున్నారని తెలుసుకున్న ఓ విలేఖరి వెళ్లి ఆ అక్రమ ఇసుకను తరలిస్తున్న వ్యక్తుల ఫోటోలను తీస్తే ఆ విలేకరిపై దాడి చేయడం ఎంతవరకు సమంజసం అని ఆ రైతులే అధికారులకు ప్రశ్నిస్తున్నారు. ఈ ఇసుక మాఫియాను అధికారుల కనుసన్నల్లో విలేకరులు పత్రికా ప్రకటనతో ఎన్నిసార్లు చెప్పినా కూడా స్పందన లేకపోయిందని రైతులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఇసుక మాఫియా వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని కృష్ణ పోలీస్టేషన్లో విలేకరులు ఫిర్యాదు చేస్తున్నట్లు తెలిపారు.

# కాగజ్ నగర్ లో కార్డాన్ సెర్చ్ ఆపరేషన్ 60 ద్విచక్ర వాహనాలు ట్రాలీ ఆటో సీజ్



కాగజ్‌నగర్, జూలై 18 (విజన్ ఆంధ్ర): కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సుభాష్ చంద్రబోస్ కాలనీలో శనివారం ఉదయం పోలీసులు విస్తృత స్థాయిలో కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ (సీఏఎస్ఓ) నిర్వహించారు. శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ, అనుమానాస్పద వ్యక్తులు మరియు వాహనాల గుర్తింపే ఈ ప్రత్యేక తనిఖీల ప్రధాన ఉద్దేశ్యమని అధికారులు తెలిపారు. ఈ ఆపరేషన్‌కు కాగజ్‌నగర్ డీఎస్పీ వహీదుద్దీన్ నాయకత్వం వహించగా, టౌన్ సీఐ ప్రేమ్ కుమార్, ఎస్ఐలు సందీప్, యాదగిరి, లక్ష్మణ్‌తో పాటు పలువురు పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. ఉదయం నుంచే కాలనీలోని ప్రధాన వీధులు, అంతర్గత రహదారులు, నివాస ప్రాంతాల్లో పోలీసులు ముమ్మర తనిఖీలు చేపట్టారు. ఇళ్లలో నివసిస్తున్న వారి వివరాలను సేకరించడంతో పాటు అనుమానాస్పద వ్యక్తులను ప్రశ్నించి వారి గుర్తింపు పత్రాలను పరిశీలించారు. వాహనాల రిజిస్ట్రేషన్ పత్రాలు, డ్రైవింగ్ లైసెన్స్, బీమా, కాలుష్య నియంత్రణ ధ్రువపత్రాలను కూడా అధికారులు తనిఖీ చేశారు. పత్రాలు లేని, అనుమానాస్పదంగా గుర్తించిన సుమారు 60 ద్విచక్ర వాహనాలు మరియు ఒక ట్రాలీ ఆటోను పోలీసులు సీజ్ చేశారు. సంబంధిత వాహన యజమానులు సరైన పత్రాలతో పోలీస్ స్టేషన్‌కు వచ్చి వివరాలు సమర్పించాలని అధికారులు సూచించారు. టౌన్ సీఐ ప్రేమ్ కుమార్ మాట్లాడుతూ, ప్రజలు వాహనాలకు సంబంధించిన అన్ని చట్టబద్ధమైన పత్రాలను తప్పనిసరిగా వెంట ఉంచుకోవాలని కోరారు. అనుమానాస్పద వ్యక్తులు, చట్టవ్యతిరేక కార్యకలాపాలు లేదా అసాంఘిక సంఘటనలపై వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు. ప్రజల సహకారంతో నేరాల నియంత్రణ మరింత సమర్థవంతంగా సాగుతుందని అధికారులు పేర్కొన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. జిల్లాలోని ఇతర ప్రాంతాల్లో కూడా ఇలాంటి కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్లు దశలవారీగా కొనసాగుతాయని పోలీసులు వెల్లడించారు. ప్రజల భద్రతే తమ ప్రధాన లక్ష్యమని, నేరాల నివారణకు ఇటువంటి ప్రత్యేక తనిఖీలు నిరంతరం నిర్వహిస్తామని తెలిపారు.

# ఆల్ఫోర్స్ జూనియర్ కాలేజీలో ఘనంగా ఫ్రెషర్స్ పార్టీ



హన్మకొండ జిల్లా ప్రతినిధి జులై 18 ( విజన్ ఆంధ్ర ) : ఆల్ఫోర్స్ జూనియర్ కాలేజీలో నూతన విద్యార్థులకు స్వాగతం పలుకుతూ ఫ్రెషర్స్ పార్టీని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆల్ఫోర్స్ గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్ వ్యవస్థాపకులు, చైర్మన్ డా. వి. నరేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా చైర్మన్ నరేందర్ రెడ్డి నూతన విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ, విద్యార్థులు స్పష్టమైన లక్ష్యంతో క్రమశిక్షణ, పట్టుదల, నిరంతర శ్రమతో చదివితే జీవితంలో అత్యున్నత విజయాలను సాధించగలరని తెలిపారు. సమయపాలన, విలువలతో కూడిన విద్య, ఆత్మవిశ్వాసం మరియు సానుకూల దృక్పథమే విజయానికి మూలమని విద్యార్థులకు మార్గదర్శనం చేశారు. విద్యార్థులు చదువుతో పాటు వ్యక్తిత్వ వికాసం, నైతిక విలువలు, సామాజిక బాధ్యతలను కూడా అలవర్చుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించగా, కళాశాల చైర్మన్ డాక్టర్ .వి .నరేందర్ రెడ్డి వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్స్,అధ్యాపకులు, సిబ్బంది మరియు విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# నార్కో టెరర్ నిర్మూలనకు మూడేళ్ల కార్యాచరణ ప్రణాళిక

హైదరాబాద్, జూలై 18 (విజన్ ఆంధ్ర) : దేశవ్యాప్తంగా నార్కో టెరర్‌ను నిర్మూలించి, మాదకద్రవ్యాల ముఠాలను పూర్తిగా కూలదోయడానికి కేంద్ర హోంమంత్రి అమిత్ షా 'డిటెక్ట్–డిస్రప్ట్–డిస్ట్రాయ్'(గుర్తించడంభంగం కలిగించడం – ధ్వంసం చేయడం) వ్యూహంపై ఆధారిత మూడేళ్ల కార్యాచరణ ప్రణాళికను ప్రకటించారు. 10వ ఎన్సీఓఆర్డీ సమావేశానికి అధ్యక్షత వహించిన అమిత్ షా, డ్రగ్ కంట్రోల్ విజన్ డాక్యుమెంట్ 2026–29తో పాటు ఎన్‌సీబీ(ఎన్సీబీ) వార్షిక నివేదికను విడుదల చేశారు. అలాగే సుమారు రూ.6 వేల కోట్ల విలువైన 2,09,500 కిలోల స్వాధీనం చేసుకున్న మాదకద్రవ్యాలను ధ్వంసం చేసే ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమం ప్రధాని నరేంద్ర మోదీ ప్రతిపాదించిన 'నషా ముక్త్ భారత్'(మాదకద్రవ్య రహిత భారత్) లక్ష్యానికి అనుగుణంగా చేపట్టిన కీలక చర్య అని పేర్కొన్నారు. 2014 నుంచి ఇప్పటివరకు దేశ వ్యాప్తంగా రూ.1.84 లక్షల కోట్ల విలువైన మాదకద్రవ్యాలను స్వాధీనం చేసుకున్నామని, దాదాపు రూ.90 వేల కోట్ల విలువైన మాదకద్రవ్యాలను ధ్వంసం చేశామని ఆయన తెలిపారు. మాదకద్రవ్యాల అక్రమ రవాణాపై కేంద్ర ప్రభుత్వం జీరో టాలరెన్స్ విధానంతో కఠిన చర్యలు కొనసాగిస్తోందని స్పష్టం చేశారు.


# ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ2026 ప్రక్రియను పారదర్శకంగా, నిర్దేశిత గడువులో పూర్తి చేయాలి

**- రాష్ట్ర ఎలక్టోరల్ రోల్ అబ్జర్వర్ హరి చందన దాసరి**
**- ఐదు జిల్లాల్లో ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ కార్యక్రమ పురోగతిపై జిల్లా వారీగా సమీక్ష**



హనుమకొండ జిల్లా ప్రతినిధి జులై 18 ( విజన్ ఆంధ్ర ) : ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ2026 (స్పెషల్ ఇంటెన్సివ్ రెవిషన్ 2026) కార్యక్రమాన్ని ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు పారదర్శకంగా, నిష్పాక్షికంగా, నిర్దేశిత గడువులో పూర్తి చేయాలని రాష్ట్ర ఎలక్టోరల్ రోల్ అబ్జర్వర్, తెలంగాణ రాష్ట్ర స్కిల్, హ్యూమన్ క్యాపిటల్ అండ్ నాలెడ్జ్ ట్రైనింగ్ ఇనిషియేటివ్స్ (శక్తి ) శాఖ కార్యదర్శి శ్రీమతి హరి చందన దాసరి, అధికారులను ఆదేశించారు. శనివారం హనుమకొండ కలెక్టరేట్‌లోని ఐడీఓసీ సమావేశ మందిరంలో హనుమకొండ, వరంగల్, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్ జిల్లాల్లో ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ కార్యక్రమం పురోగతిపై జిల్లా వారీగా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్యుమరేషన్ ప్రక్రియ, ఇంటింటి సర్వే, ఫారాల పంపిణీ, స్వీకరణ, మ్యాపింగ్, డిజిటలైజేషన్, అర్హులైన ప్రతి ఓటరును జాబితాలో చేర్చడం, అనర్హుల వివరాల పరిశీలన, పెండింగ్ దరఖాస్తుల పరిష్కారం తదితర అంశాలపై అధికారులతో సమగ్రంగా చర్చించి పలు సూచనలు చేశారు. ఓటరు జాబితా సవరణ ప్రక్రియను పూర్తి పారదర్శకంగా, నిష్పాక్షికంగా నిర్వహించాలని, ప్రతి అర్హుడైన ఓటరుకు ఓటు హక్కు కల్పించేలా క్షేత్రస్థాయిలో సమన్వయంతో పనిచేయాలని సూచించారు. భారత ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాలు, కాలపట్టికను కచ్చితంగా పాటిస్తూ కార్యక్రమాన్ని నిర్ణీత గడువులో పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా హరి చందన దాసరి మాట్లాడుతూ, ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణపై ప్రజల్లో మరింత విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. ఓటర్లు ఎందుకు దరఖాస్తు సమర్పించాలి, ఎప్పుడు, ఎక్కడ, ఎలా సమర్పించాలి, అవసరమైన పత్రాలు ఏమిటి, తరచుగా అడిగే ప్రశ్నలకు (ఫాక్ ) సమాధానాలు వంటి సమాచారాన్ని విస్తృతంగా ప్రచారం చేయాలని తెలిపారు. శాశ్వతంగా నివాసం మారిన వారు, వలస వెళ్లిన వారు, ఓటరు జాబితాలో మార్పులు చేయించుకోవాల్సిన వారు స్వచ్ఛందంగా తమ వివరాలు నమోదు చేసుకునేలా అవగాహన కార్యక్రమాలను మరింత ముమ్మరం చేయాలని సూచించారు. బూత్ స్థాయి అధికారులు (బీఎల్‌వోలు) పనితీరును నిరంతరం పర్యవేక్షిస్తూ, పనితీరు తక్కువగా ఉన్న ప్రాంతాల్లో ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. రాజకీయ పార్టీలు, ప్రజాప్రతినిధులు, మీడియా ప్రతినిధులతో నిరంతరం సమన్వయం కొనసాగిస్తూ, ఎన్నికల ప్రక్రియపై ప్రజలకు సరైన సమాచారం చేరేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అపార్ట్‌మెంట్లు, గేటెడ్ కమ్యూనిటీలు, రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్లు (ర్వస్ ), గిరిజన ప్రాంతాల్లో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, ఒక్క అర్హుడైన ఓటరు కూడా నమోదు కాకుండా మిగిలిపోకుండా చూడాలని పేర్కొన్నారు. జిల్లా అధికారులు ప్రతిరోజూ కార్యక్రమ పురోగతిని పోలింగ్ కేంద్రాల వారీగా విశ్లేషిస్తూ క్షేత్రస్థాయిలో జరుగుతున్న పనులను నిరంతరం పర్యవేక్షించాలని, ఎక్కడైనా సమస్యలు ఎదురైతే వెంటనే పరిష్కార చర్యలు చేపట్టాలని సూచించారు. రాష్ట్ర స్థాయి నుంచి అవసరమైన సహకారం అందించేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. అదేవిధంగా రాజకీయ పార్టీల నుంచి వచ్చే సూచనలు, అభ్యంతరాలు, ఫిర్యాదులను సకాలంలో పరిశీలించి పరిష్కరించాలని, ఎన్నికల ప్రక్రియపై ప్రజల్లో విశ్వాసం పెంపొందేలా పారదర్శకంగా వ్యవహరించాలని అధికారులకు సూచించారు.హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ మాట్లాడుతూలి ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)–2026 కార్యక్రమాన్ని ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు పారదర్శకంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. జిల్లాలోని వరంగల్ పశ్చిమ, పరకాల నియోజకవర్గాలు ఉన్నాయని, 5.09 లక్షల మంది ఓటర్లు, 483 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని, 100 శాతం ఎన్యుమరేషన్ ఫారాలు పంపిణీ చేసి, 68.13 శాతం డిజిటలైజేషన్ పూర్తి చేసినట్లు వెల్లడించారు. గైర్హాజరు ఓటర్లు అధికంగా ఉన్న ప్రాంతాల్లో ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ప్రతి నియోజకవర్గానికి ఎన్నికల అధికారులు, సూపర్‌వైజర్లు, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల బీఎల్‌ఏలను నియమించి, వారికి గుర్తింపు కార్డులు జారీ చేసినట్లు చెప్పారు. కార్యక్రమాన్ని పర్యవేక్షించేందుకు జిల్లా స్థాయి అధికారులు, మంది జూనియర్, సీనియర్ అసిస్టెంట్లను నియమించామని తెలిపారు.ఎస్ఐఆర్‌పై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు 2కే రన్, మీడియా సమావేశాలు, ప్రచార వాహనాలు, బీఎల్‌ఏలకు శిక్షణ, ఎన్నికల అక్షరాస్యత క్లబ్‌ల ద్వారా అవగాహన కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. ఒక్క అర్హుడైన ఓటరు కూడా మిగిలిపోకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. జిల్లా స్థాయిలో మీడియా మానిటరింగ్ సెంటర్, కలెక్టరేట్‌తో పాటు ఈఆర్‌వో, ఏఈఆర్‌వో కార్యాలయాల్లో హెల్ప్‌డెస్క్‌లు ఏర్పాటు చేసి దరఖాస్తుల పూరణలో సహాయం అందిస్తున్నామని తెలిపారు. ఫిర్యాదులను నిర్ణీత గడువులో పరిష్కరిస్తూ, కాల్ సెంటర్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదుపై 48 గంటల్లోపు స్పందించేలా ప్రత్యేక పర్యవేక్షణ కొనసాగుతోందని పేర్కొన్నారు. ఎన్నికల సంఘం నిర్దేశించిన గడువులోగా ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేసేందుకు జిల్లా యంత్రాంగం సమన్వయంతో పనిచేస్తోందని కలెక్టర్ తెలిపారు. వరంగల్ జిల్లా కలెక్టర్ డా. సత్య శారద మాట్లాడుతూ, వరంగల్ జిల్లాలోని వరంగల్ తూర్పు, నర్సంపేట, వర్ధన్నపేట అసెంబ్లీ నియోజకవర్గాల్లో ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)–2026 కార్యక్రమాన్ని భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు సమర్థవంతంగా అమలు చేస్తున్నామని తెలిపారు. జిల్లాలో ఇప్పటివరకు 71 శాతం ఫారాల డిజిటలైజేషన్ పూర్తయిందని వెల్లడించారు. పోలింగ్ స్టేషన్‌ల వారీగా ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ, స్వీకరణ, డిజిటలైజేషన్ పురోగతి, క్షేత్రస్థాయిలో చేపట్టిన చర్యలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఎలక్టోరల్ రోల్ అబ్జర్వర్‌కు వివరించారు. మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ, జిల్లాలో ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)–2026 కార్యక్రమాన్ని భారత ఎన్నికల సంఘం నిబంధనల మేరకు సమర్థవంతంగా అమలు చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమం అమలులో చేపట్టిన చర్యలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. జిల్లాలో 100 శాతం ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ పూర్తి కాగా, 74 శాతం ఫారాల డిజిటలైజేషన్ పూర్తయిందని వెల్లడించారు. ఎన్నికల సంఘం నిర్దేశించిన గడువులోగా కార్యక్రమాన్ని పూర్తి చేసేందుకు జిల్లా యంత్రాంగం సమన్వయంతో పనిచేస్తోందని తెలిపారు.జయశంకర్ భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ, జిల్లాలో ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)–2026 కార్యక్రమం వేగవంతంగా కొనసాగుతోందని తెలిపారు. ఇప్పటివరకు 71.74 శాతం ఎస్ఐఆర్ ఫారాల డిజిటలైజేషన్ పూర్తి చేసినట్లు వెల్లడించారు. ఎన్నికల సంఘం నిర్దేశించిన కాలపట్టిక మేరకు మిగిలిన ప్రక్రియను కూడా సకాలంలో పూర్తి చేసేందుకు జిల్లా యంత్రాంగం సమన్వయంతో కృషి చేస్తోందని పేర్కొన్నారు.ములుగు జిల్లా అదనపు కలెక్టర్ మహేందర్ జి మాట్లాడుతూ, జిల్లాలో ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)–2026 కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. జిల్లాలో 100 శాతం ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ పూర్తి కాగా, 75.60 శాతం ఫారాల డిజిటలైజేషన్ పూర్తయిందని వెల్లడించారు. ఈ సమావేశంలో హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్, వరంగల్ జిల్లా కలెక్టర్ డా. సత్య శారద, జయశంకర్ భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్, ములుగు జిల్లా అదనపు కలెక్టర్ మహేందర్ జి, హన్మకొండ, వరంగల్ జిల్లాల అదనపు కలెక్టర్లు రవి, సంధ్యారాణి, సంబంధిత జిల్లాల ఎన్నికల విభాగ అధికారులు,ఈ ఆర్ ఓ లు, ఏ ఈ ఆర్ ఓ లు, ఎన్నికల విభాగ పర్యవేక్షకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# గంటల వ్యవధిలోనే హత్య కేసును ఛేదించి, నిందితున్ని రిమాండుకు తరలించిన రెబ్బెన పోలీసులు..



ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి జులై 18 (విజన్ ఆంధ్ర) : కోమురం భీం ఆసిఫాబాద్ జిల్లా రెబ్బెన పోలీస్ స్టేషన్ పరిధిలో అసిఫాబాద్ రోడ్ రైల్వే స్టేషన్ సమీపంలో జరిగిన మసాడే సోమయ్య హత్య కేసును పోలీసులు చాకచక్యంగా గంటల వ్యవధిలోనే ఛేదించి నిందితున్ని అరెస్ట్ చేసి, రిమాండ్ కు పంపించనున్నారు. 17 జులై 2026 న సుమారు 12.30 గంటల ప్రాంతంలో మృతుడు, మసాడే సోమయ్య వయసు 65 సం లు నివాసం పర్సనంబాల గ్రామం, అసిఫాబాద్ జిల్లా, తన పెద్ద కూతురును హైదరాబాద్ వెళ్ళడానికి ట్రైన్ ఎక్కివడానికి, మృతుడు, తన భార్య మరియు, తన చిన్న కూతురుతో కలసి అసిఫాబాద్ రోడ్ రైల్వే స్టేషన్కు వచ్చినారు. ట్రైన్ కోసం వేచే సమయంలో, మృతుడు టీ కోసం స్టేషన్ నుండి బయటకు రాగ, అతనివద్ద ఉన్న డబ్బులను చుసిన, అక్కడే ఉన్న గుర్తుతెలియని వ్యక్తి, మృతునివద్దకు వచ్చి, డబ్బులు అడగగా, అందుకు నిరాకరించినందుకు, అట్టి గుర్తుతెలియని వ్యక్తి గొడ్డలితో మృతుని మెడపై నరికి,మృత దేహంనుండి తలను వేరుచేసి అతికిరాతకంగా చంపి, భయంతో అక్కడినుండి పారిపోయినాడు. సమాచారం తెలుసుకున్న వెంటనే రెబ్బెన పోలీసులు అట్టి సంఘటన స్థలంకు చేరుకొని, విచారణ చేపట్టి, నిందితుడు ఆనవాళ్లు తెలుసుకొని, రైల్వే మార్గంగుండా తప్పించుకున్నాడని గుర్తించి, తర్వాత జిల్లా ఉన్నత పోలీస్ శాఖ అధికారిని నితిక పంత్ ఆదేశాలమేరకు, అసిఫాబాద్ సబ్ డివిసన్ B. అశోక్ ఋఖా ఆధ్వర్యంలో CI రెబ్బెన, ఎం.సంజయ్, SI రెబ్బెన, ఏ వెంకటకృష్ణ, SI తిర్యాణి, P. సుబ్బారావు మరియు ఇతర పోలీస్ వారు 5 బృందాలుగా ఏర్పడి, నిందితున్ని CCTV కెమెరాల సహాయంతో సిర్పూర్–T రైల్వే స్టేషనులో గుర్తించి పట్టుకున్నారు. నిందితుడు బోగరపు నగేష్ తండ్రి చంటయ్య, నివాసం తుంగేడ గ్రామం, రెబ్బెన మండలం, నిందితుడు తాగుడుకు అలవాటు పడి, డబ్బులకోసం అందరిదగ్గర అడిగేవాడు, ఇదే క్రమంలో, మృతుడి వద్ద డబ్బులు చూసి, అట్టి డబ్బులు కోసం అడగగా, మృతుడు నిరాకరించడంతో, కోపానికి గురై మృతున్ని ఎలాగైనా చంపాలనే ఉద్దేశంతో, మొదటగా తన వెంటే ఉన్న గొడ్డలితో, మృతుడి మెడపై నరికి, తలను మొండం నుండి వేరుచేసినాడు. సంఘటన జరిగిన వెంటనే పోలీస్ వారు స్పందించి, చాకచక్యంగా నిందితున్ని కొన్ని గంటల వ్యవధిలోనే పట్టుకోవడంలో ఉన్నతమైన ప్రతిభ కనబరిచిన, పోలీస్ అధికారులను మరియు ఇతర సిబ్బందిని వారిని జిల్లా ఉన్నత పోలీస్ శాఖ అధికారిని నితిక పంత్ అబినందించినారు.

# మహిళల భద్రతే పోలీసుల ప్రధాన లక్ష్యం.

**"పోలీస్ అక్క"కార్యక్రమంతో విద్యార్థినుల్లో చట్టాలపై అవగాహన.**



ఉమ్మడి నల్లగొండ జిల్లా బ్యూరో,జులై18,(విజన్ ఆంధ్ర) : మహిళలు,బాలికల భద్రతకు జిల్లా పోలీసు శాఖ అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని,విద్యార్థినులు నిర్భయంగా తమ విద్యను కొనసాగించేలా భద్రతా వాతావరణం కల్పించడమే"పోలీస్ అక్క"కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని మహిళా పోలీసులు తెలిపారు.జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా మహిళా పోలీసుల ఆధ్వర్యంలో "పోలీస్ అక్క"అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగావిద్యార్థినులకు ఆకతాయిల వేధింపులు, ఈవ్‌టీజింగ్, ర్యాగింగ్, సైబర్ నేరాలు,సోషల్ మీడియా వినియోగంలో పాటించాల్సిన జాగ్రత్తలు,వ్యక్తిగత సమాచారాన్ని అపరిచితులతో పంచుకోకూడదు అనే అంశాలపై జిల్లా వ్యాప్తంగా పాఠశాలలు,కళాశాలల్లో అవగాహన కల్పించారు.ఎవరైనా వేధింపులకు పాల్పడినా లేదాఅనుమానాస్పద సంఘటనలు ఎదురైనా వెంటనేడయల్100,షీ టీమ్స్ లేదా సమీప పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని సూచించారు.మహిళల భద్రత కోసం పోలీసు శాఖ ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని,ఎలాంటి సమస్య వచ్చినా భయపడకుండా పోలీసులను ఆశ్రయించాలని విద్యార్థినులకు భరోసా కల్పించారు.అలాగే మహిళల రక్షణ కోసం అమలులో ఉన్న చట్టాలు,మహిళలకు కల్పించిన హక్కులు,అత్యవసర సమయంలో తీసుకోవాల్సిన చర్యలపై కూడా వివరించారు. "పోలీస్ అక్క"కార్యక్రమం ద్వారా విద్యార్థినుల్లో చట్టాలపై అవగాహన పెంపొందించి, ఆత్మవిశ్వాసాన్ని పెంచడమే లక్ష్యమని మహిళా ఎస్సైలు పేర్కొన్నారు.

# ఆరోగ్య శాఖ మంత్రిని కలిసిన ఆర్.ఎం.పి డాక్టర్ల బృందం..!



కాప్రా /జూలై 18(విజన్ ఆంధ్ర ప్రతినిధి ) : శనివారం నాడు ఆర్. ఎం. పి.మరియు పి.ఎం. పి.రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పబ్బా చంద్రశేఖర్ ఆధ్వర్యంలో తెలంగాణ ఆరోగ్య శాఖ మంత్రినీ కలిసి ఆర్ఎంపి మరియు పి.ఎం.పి డాక్టర్ల సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లడం జరిగింది ఊర్లల్లో మండలాలలో మరియు చిన్న చిన్న బస్తీలలో స్థానికంగా ఆర్ఎంపీ డాక్టర్ల కృషి వెలకట్టలేనిది వారు రాత్రనక పగలనక ఎన్నో కుటుంబాలకు అండగా నిలిచి ప్రాథమిక చికిత్స అందిస్తుంటారు. వీరు డబ్బుల కోసమే కాకుండా మనుషుల అవసరాలు మానవత్వం మంచితనంను గుర్తుంచుకొని ప్రథమ చికిత్స అందిస్తుంటారు. రాత్రిళ్ళు పగళ్ళు అర్ధరాత్రిలు అనే తేడా లేకుండా సమస్యతో వచ్చిన రోగికి తగిన చికిత్స అందిస్తూ వారికి తోచినది ఇచ్చిన తీసుకునే సేవాభావం కలవారు. వారి కష్టానికి వెలకట్టి రుసుము వసూలు చేసే ప్రయత్నాలు ఉండవు కానీ ఎన్నో రోజులుగా వీరి సమస్యలు మరుగున పడిపోయాయి గత ప్రభుత్వం లో కూడా వీరి సమస్యలపై రాష్ట్ర మంత్రులను వివిధ శాఖల వారిని కలిసిన ప్రయోజనం లేకపోయింది వీరి ముఖ్య సమస్యలు ఆర్ఎంపి డాక్టర్ల భద్రత వారిపై దాడులు ఐఎమ్ఏశ్రీ వేధింపులు తీవ్రంగా ఉన్నాయి వీరి నుంచి దాడులు జరగకుండా వారికి మినిమం భద్రత అనేది చాలా అతి ముఖ్యమైన సమస్య ఇలాంటి చిన్న చిన్న సమస్యలు ఎన్నో రోజులుగా మరుగున పడి ఉన్నాయి ఈ ప్రభుత్వమైనా కాస్త చొరవ చూపి వైద్యులకు తగిన సహాయం చేస్తారని ఆర్.ఎం.పి మరియు పి.ఎం.పి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పబ్బం చంద్రశేఖర్ మరియు రాష్ట్ర ఉపాధ్యక్షులు పెండెం నాగభూషణం మరియు వంజరి విష్ణు .కృష్ణ మూర్తి .హేమశ్రీనివాస నాయక్ శ్రీనివాస్ . నారాయణ దాస్ .దినకర్ సమస్యల గురించి వీరిపై జరుగుతున్న దాడులనుండి కాపాడవాల్సిందిగా తెలంగాణ వైద్యశాఖ మంత్రి దామోదరం రాజనర్సింహ కి వినతి పత్రం సమర్పించడం జరిగింది.

# జిల్లా న్యాయ సేవా ప్రాధికార సంస్థలో ప్రత్యేక లోక్ అదాలత్ విజయవంతం



గద్వాల జూలై 18 ( విజన్ ఆంధ్ర బ్యూరో) : జోగులాంబ గద్వాల జిల్లా న్యాయ సేవా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో నెగోషియబుల్ ఇన్‌స్ట్రుమెంట్స్ చట్టం, 1881 కు సంబంధించిన కేసుల పరిష్కారం కోసం ప్రత్యేక లోక్ అదాలత్ నిర్వహించబడింది. ఈ ప్రత్యేక లోక్ అదాలత్‌లో మొత్తం 10 కేసులు విచారణకు తీసుకోగా, వాటిలో 10 కేసులు పరస్పర రాజీ ద్వారా పూర్తిగా పరిష్కరించ బడ్డాయి. ఈ కేసుల ద్వారా మొత్తం రూ. 7,22,976/- (ఏడు లక్షల ఇరవై రెండు వేల తొమ్మిది వందల డెబ్బై ఆరు రూపాయలు) రాజీ మొత్తంగా నిర్ణయించ బడింది. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవా ప్రాధికార సంస్థ కార్యదర్శి ఎ. నాగరాజు పాల్గొని, రాజీ ద్వారా వివాదాల పరిష్కారం వేగవంతంగా, తక్కువ ఖర్చుతో జరిగి, పక్షాల మధ్య సుహృద్భావాన్ని పెంపొందిస్తుందని తెలిపారు. ప్రజలు లోక్ అదాలత్‌లను సద్వినియోగం చేసుకొని తమ వివాదాలను సామరస్యపూర్వకంగా పరిష్కరించుకోవాలని ఆయన సూచించారు. ఈ ప్రత్యేక లోక్ అదాలత్ నిర్వహణలో న్యాయవాదులు, సంబంధిత పక్షాలు చురుకుగా పాల్గొని కేసుల పరిష్కారానికి సహకరించారు.

# మహిళలకు ఉపాధితో ఆర్థిక స్వావలంబన

**- గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి**



గద్వాల జూలై 18 ( విజన్ ఆంధ్ర బ్యూరో) : మహిళలు వివిధ సంస్థల ఆధ్వర్యంలో నిర్వహించే శిక్షణ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకుంటే ఉపాధి అవకాశాలు మెరుగుపడి ఆర్థిక స్వావలంబన సాధించవచ్చని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోనీ బిఎస్ఎన్ఎల్ కార్యాలయం వద్ద ఉన్న గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ కేంద్రంలో యూనియన్ బ్యాంక్ ఆధ్వర్యంలో మహిళలకు నిర్వహించిన ఉచిత శిక్షణ ముగింపు కార్యక్రమానికి ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. నెలరోజుల పాటు మహిళలకు టైలరింగ్, బ్యూటీ పార్లర్, ఎంబ్రాయిడరీలో శిక్షణ ఇవ్వడంతో సొంతంగా పనులు చేసుకుని సంపాదించవచ్చన్నారు. ప్రస్తుతం సమాజంలో మహిళలు కూడా పురుషులతో సమానంగా అన్ని రంగాలలో రాణించడం జరుగుతుందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని మహిళలు పొదుపు సంఘాలలో ఉండడం వలన బ్యాంకుల ద్వారా అందించే రుణాలతో చిన్న చిన్న పరిశ్రమలను ఏర్పాటు చేసుకొని మహిళలు ఆర్థికంగా బలోపేతం చెందాలన్నారు. గద్వాల ప్రాంతంలో ఎక్కడా లేని వస్తువుల తయారీ పరిశ్రమను మహిళలు నిర్వహించి ఆర్థికంగా ఎదగాలని, దీనికి కావాల్సిన శిక్షణ, రుణ సదుపాయానికి తన వంతుగా కృషి చేస్తానని ఈ సందర్భంగా ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ తుమ్మల జయలక్ష్మి, వైస్ చైర్మన్ శంకర్, ఎల్డిఎం శ్రీనివాసరావు, ఏపిడి శ్రీనివాస్, ఆర్ఎస్ఈటిఐ డైరెక్టర్ శ్రీనివాస్ నాయక్, పలువురు కౌన్సిలర్స్, మాజీ ప్రజాప్రతినిధులు, నేతలు తదితరులు పాల్గొన్నారు.

## క్రిస్టియన్ మైనారిటీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ పథకాలకు దరఖాస్తుల ఆహ్వానం...

**-జిల్లా మైనారిటీస్ సంక్షేమ శాఖ అధికారి పి. నరేష్ కుమార్ నాయుడు**



పెద్దపల్లి జిల్లా ప్రతినిధి జూలై-18(విజన్ ఆంధ్ర) : తెలంగాణ క్రిస్టియన్ మైనారిటీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ (టీజీసీఎంఎఫ్‌సీ), హైదరాబాద్ ఆధ్వర్యంలో 2026-27 ఆర్థిక సంవత్సరానికి కుట్టు మిషన్, చిరు వ్యాపారం, ఇ-బైక్, ఇ-స్కూటీ, మోటార్ బైక్ యూనిట్ల కోసం అర్హులైన క్రైస్తవ మైనారిటీల నుంచి ఆన్‌లైన్ దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మైనారిటీస్ సంక్షేమ శాఖ అధికారి పి. నరేష్ కుమార్ నాయుడు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కుట్టు మిషన్, చిరు వ్యాపార యూనిట్లకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థుల వయస్సు 21 నుంచి 55 సంవత్సరాల మధ్య ఉండాలని, ఇ-బైక్, ఇ-స్కూటీ, మోటార్ బైక్ యూనిట్లకు 21 నుంచి 50 సంవత్సరాల మధ్య వయస్సు కలిగి ఉండాలని పేర్కొన్నారు. పట్టణ ప్రాంతాల్లో కుటుంబ వార్షిక ఆదాయం రూ.2 లక్షల లోపు, గ్రామీణ ప్రాంతాల్లో రూ.1.50 లక్షల లోపు ఉండాలని అర్హతగా తెలిపారు. ఆసక్తి గల అర్హులైన అభ్యర్థులు జూలై 19 నుంచి జూలై 31 సాయంత్రం 5 గంటల వరకు https://tgobmms.cgg.gov.in/` వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాల కోసం 040-23391067 నంబర్‌ను సంప్రదించవచ్చని లేదా https://tgcmfc.in/` వెబ్‌సైట్‌ను సందర్శించాలని పి.నరేష్ కుమార్ నాయుడు తెలిపారు.

# శ్రీశ్రీశ్రీ వారాహి నవరాత్రి మహోత్సవాల్లో మాజీ ఎమ్మెల్యే కేఎల్ఆర్

**-అమ్మవారి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించిన కేఎల్ఆర్, డిబిఆర్**



ఎల్బీనగర్/సరూర్ నగర్ జూలై 18 (విజన్ ఆంధ్ర): మహేశ్వరం నియోజకవర్గం, రామకృష్ణాపురం డివిజన్ పరిధిలోని శ్రీ వారాహి ప్రత్యంగిరా దేవాలయంలో వైభవంగా జరుగుతున్న శ్రీ వారాహి నవరాత్రి మహోత్సవాల్లో మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్, మాజీ ఎమ్మెల్యే కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి (కేఎల్ఆర్), మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, టీపీసీసీ మెంబర్ దేప భాస్కర్ రెడ్డి పాల్గొని అమ్మవారి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..మహేశ్వరం నియోజకవర్గ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని, అమ్మవారి ఆశీస్సులు ఎల్లప్పుడూ నియోజకవర్గ ప్రజలపై ఉండాలని ప్రార్థించినట్లు తెలిపారు. భక్తిభావం అనేది సమాజంలో శాంతిని, సన్మార్గాన్ని పెంపొందిస్తుందని, ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు ప్రజల మధ్య ఐక్యతను చాటుతాయని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా జనరల్ సెక్రెటరీ చిలుక ఉపేందర్ రెడ్డి, రామకృష్ణపురం డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పూన్న గణేష్ నేత, టిపిసిసి ప్రచార కమిటీ సభ్యులు సామిడీ గోపాల్ రెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ బండి మధుసూదన్ రావు, ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయం చైర్మన్ తలాటి రమేష్ నేత, ముప్పిడి లింగస్వామి గౌడ్, బొడ్డుపల్లి మహేందర్, దుబ్బాక శేఖర్, జ్ఞానేశ్వర్ యాదవ్, కర్ణాకర్ రెడ్డి, యాదవ రెడ్డి, పగడాల ఎల్లయ్య, గోవర్ధన్ రెడ్డి,ఎమహమ్మద్, సుదర్శన్, నబీ, రఘు, రాజు, సైదులు, స్థానిక కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు, ఆలయ కమిటీ సభ్యులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# జిల్లా విద్యాశాఖలో అవినీతి ఆరోపణలు.. విచారణకు ఉన్నతాధికారుల ఆదేశాలు..?

**- డీఎస్ఈ ఆదేశాలతో ఆర్జేడీ అధికారుల విచారణకు రంగం సిద్ధం.?**

గద్వాల జూలై 18 (విజన్ ఆంధ్ర) : జోగులాంబ గద్వాల జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో అవినీతి ఆరోపణలు తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. జిల్లా విద్యాశాఖలో విధులు నిర్వహిస్తున్న ఓ ఉన్నతాధికారిపై కార్యాలయ సిబ్బంది చేసిన ఫిర్యాదుల నేపథ్యంలో డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ (డీఎస్ఈ)ఆదేశాలతో ప్రాంతీయ సంయుక్త సంచాలకులు (ఆర్జేడీ) విచారణ చేపట్టి పూర్తి నివేదికను అందజేయాలనీ ఆదేశాలు ఇచ్చినట్లు విశ్వసనీయ సమాచారం. జిల్లా విద్యాశాఖ అధికారిపై పలు ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాల నుంచి డబ్బులు వసూలు చేశారనే ఆరోపణలతో పాటు కార్యాలయ నిర్వహణలో అవకతవకలకు పాల్పడుతున్నారంటూ సిబ్బంది ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేసినట్లు తెలిసింది. ఈ ఫిర్యాదులను సీరియస్‌గా తీసుకున్న ఉన్నతాధికారులు పూర్తి స్థాయి విచారణ చేపట్టాలని నిర్ణయించినట్లు సమాచారం. అదే విధంగా ఈ మధ్యనే ప్రైమరీ పాఠశాల సమగ్ర శిక్ష కింద 41 పాఠశాలలకు ఒక్క పాఠశాలకు లక్ష రూపాయల నిధులు మొత్తం 41 లక్షలు ప్రభుత్వం మంజూరు చేస్తే ఎలాంటి టెండర్ లేకుండా ఏకపక్షంగా జిల్లా విద్యాశాఖ అధికారి తమకు అనుకూలంగా వున్నా సంస్థ కు కట్టబెట్టారానే ఆరోపణ కూడా వారి పై వున్నది. విచారణ నిమిత్తం అధికారులు తొందరలోనే జిల్లాకు వస్తున్నారన్న సమాచారం తో పరిణామాల మధ్య శుక్రవారం జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో సంబంధిత అధికారి హుటాహుటిన పలు ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలతో సమావేశం నిర్వహించినట్లు తెలుస్తోంది. విచారణ సమయంలో తమ వద్ద నుంచి ఎలాంటి డబ్బులు తీసుకోలేదని అధికారులు విచారణ బృందానికి చెప్పాలని కొందరు పాఠశాలల యాజమాన్యాలపై ఒత్తిడి తెచ్చినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. జిల్లా విద్యాశాఖ అధికారిపై గత కొంతకాలంగా వివిధ అంశాల్లో అనేక ఆరోపణలు వస్తున్నప్పటికీ ఇప్పటివరకు స్పష్టమైన చర్యలు తీసుకోలేదని విద్యావర్గాలు పేర్కొంటున్నాయి. విచారణ నిష్పాక్షికంగా జరిగి వాస్తవాలు వెలుగులోకి రావాలని ఉపాధ్యాయ సంఘాలు, విద్యావేత్తలు కోరుతున్నారు. ఇదిలా ఉండగా, ఈ ఆరోపణలపై వివరణ కోసం సంబంధిత అధికారిని పలుమార్లు సంప్రదించేందుకు ప్రయత్నించినప్పటికీ వారు అందుబాటులోకి రాలేదు. ఈ వ్యవహారం పై అధికారిక స్పందన వెలువడాల్సి ఉంది.

# రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి పెట్టాలి

**- కలెక్టర్ గరిమ అగ్రవాల్**

**- తాగునీటి సంరక్షణకు ప్రాధాన్యం...**



రాజన్న సిరిసిల్ల, జూలై 18 (విజన్ ఆంధ్ర బ్యూరో): ఎల్ నినో ప్రభావంతో జిల్లాలో నెలకొన్న వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులు సంప్రదాయ పంటలకు బదులుగా ప్రత్యామ్నాయ పంటల సాగు వైపు మళ్లాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ సూచించారు. అందుబాటులో ఉన్న నీటి వనరులను తాగునీటి అవసరాలకే వినియోగించేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో నీటి పారుదల, మిషన్ భగీరథ, మున్సిపల్, వైద్య ఆరోగ్య, ఎంపీడీఓలు తదితర శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. జిల్లాలోని ఎగువ మానేరు, మల్కపేట, అన్నపూర్ణ, మిడ్ మానేరు రిజర్వాయర్లలో ప్రస్తుతం ఉన్న నీటి నిల్వల వివరాలను వెల్లడించిన కలెక్టర్, ఈ ఏడాది ఎల్ నినో ప్రభావంతో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదైందని తెలిపారు. ఎగువ ప్రాంతాల నుంచి వరద నీరు రాకపోవడంతో సాగునీటి లభ్యత తగ్గిందని, అందువల్ల రిజర్వాయర్లలోని నీటిని ప్రధానంగా తాగునీటి అవసరాలకే వినియోగించాలని స్పష్టం చేశారు. రిజర్వాయర్లు, చెరువులు, కుంటల్లో నీటి నిల్వలు తక్కువగా ఉండటంతో సాగునీటి అవకాశాలు పరిమితంగా ఉన్నాయని పేర్కొన్న కలెక్టర్, రైతులు స్వల్పకాలిక పంటలు, కూరగాయలు, పప్పుధాన్యాలు, నూనెగింజల పంటలు, ఆయిల్ పామ్ వంటి ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని సూచించారు. ఈ మేరకు వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులు రైతులకు విస్తృత అవగాహన కల్పించాలని ఆదేశించారు. భూగర్భ జలాల పెంపు కోసం ప్రతి గ్రామ పంచాయతీలో ఫామ్ పాండ్లు, బోర్‌వెల్ రీచార్జ్ పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కలెక్టర్ సూచించారు. అర్హులైన రైతులు తమ పొలాల్లో ఫామ్ పాండ్లు ఏర్పాటు చేసుకునేలా ప్రోత్సహించాలని, బోర్ రీచార్జ్ ద్వారా నీటి సమస్యను తగ్గించవచ్చని వివరించారు. సీజనల్ వ్యాధుల నివారణలో భాగంగా ప్రతి మంగళవారం, శుక్రవారం డ్రై డే తప్పనిసరిగా నిర్వహించాలని ఆదేశించారు. వర్షం కురిసిన మరుసటి రోజు కూడా ప్రత్యేక డ్రై డే నిర్వహించి నీరు నిల్వ లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా ముందస్తు ప్రణాళిక సిద్ధం చేయాలని విద్యుత్ శాఖకు, పశువులకు మేత కొరత రాకుండా చర్యలు చేపట్టాలని పశుసంవర్ధక శాఖకు ఆదేశాలు జారీ చేశారు. వైద్య ఆరోగ్య శాఖ అధికారులు ప్రజల్లో వ్యక్తిగత పరిశుభ్రత, చేతులు శుభ్రంగా కడుక్కోవడం, మరిగించి చల్లార్చిన నీటిని తాగడం వంటి అంశాలపై విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, జడ్పీ సీఈవో వెంకట మాధవరావు, డీఆర్డీఓ లక్ష్మీనారాయణ, ప్రొబేషనరీ డిప్యూటీ కలెక్టర్ నిఖిత, జిల్లా పంచాయతీ అధికారి జయశీల, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అఫ్జల్ బేగం, మిషన్ భగీరథ, నీటి పారుదల, మున్సిపల్, వైద్య ఆరోగ్య శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఈశ్వరమ్మ యాదవ్ కు జాగృతి ఘన సత్కారం



ఎల్బీనగర్, జూలై 18 (విజన్ ఆంధ్ర): తెలంగాణ రాష్ట్ర తిరుపతిగా ప్రసిద్ధిగాంచినటువంటి శ్రీశ్రీశ్రీ యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానం పాలక మండలి సభ్యులుగా నియమింపబడిన మాజీ కౌన్సిలర్, పోచబోయిన ఈశ్వరమ్మ యాదవ్ ను జాగృతి అభ్యుదయ సంఘం టీం సభ్యులు శనివారం చింతలకుంటలోని ఆమె స్వగృహంలో కలిసి శుభాకాంక్షలు తెలుపుతూ మిఠాయిలు తినిపించారు. అనంతరం ఈశ్వరమ్మను సత్కరించినవారిలో జాగృతి అభ్యుదయ సంఘం చైర్మన్ భావన శ్రీనివాస్, డైరెక్టర్ యాదా రామలింగేశ్వరరావు, జాయింట్ సెక్రటరి బచ్చనబోయిన యాదయ్య యాదవ్, సభ్యులు రామచంద్రయ్య, గుద్దేటి నర్సింహులు, అరుణ వెంకట రెడ్డి తదితరులున్నారు. 85 సంవత్సరాల వయస్సులో తనకొచ్చిన ఈ అవకాశం పట్ల ఈశ్వరమ్మ కృతజ్ఞతతో దేవాలయ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని, మండలి తీర్మానాలకు అనుగుణంగా భక్తులకు సేవ చేస్తానన్నారు.

## జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలోని RI స్టోర్‌ను వార్షిక తనిఖీ చేసిన ఎస్పీ డి.జానకి

**- యూనిఫాం, బూట్లు, ఇతర కిట్ సామగ్రి నిల్వలు పరిశీలన..**

**- రికార్డులు, స్టాక్ నిర్వహణలో పారదర్శకత పాటించాలని ఆదేశం....**





ఉమ్మడి పాలమూరు జిల్లా బ్యూరో, జూలై 19 (విజన్ ఆంధ్ర) : మహబూబ్‌నగర్ జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలోని రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ (RI) స్టోర్‌ను జిల్లా ఎస్పీ శ్రీమతి డి. జానకి, ఐపీఎస్ శనివారం వార్షిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ స్టోర్‌లో ఉన్న పోలీసు సిబ్బందికి అవసరమైన యూనిఫాం, బూట్లు, బెల్టులు, క్యాపులు, రెయిన్‌కోట్లు, బ్యాడ్జీలు తో పాటు ఇతర కిట్ సామగ్రి నిల్వలను క్షుణ్ణంగా పరిశీలించారు.

**రికార్డులు, స్టాక్ పరిశీలన**

స్టోర్‌లోని రికార్డులు, స్టాక్ రిజిస్టర్లు, జారీ-స్వీకరణ వివరాలు మరియు వస్తువుల నిర్వహణ విధానాన్ని ఎస్పీ క్షుణ్ణంగా తనిఖీ చేశారు. స్టాక్‌లో పారదర్శకత, ఖచ్చితత్వం పాటించాలని అధికారులకు సూచించారు. పాడైన లేదా వినియోగానికి పనికిరాని వస్తువులను నిబంధనల ప్రకారం తొలగించాలని, అవసరమైన సామగ్రి ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

**సిబ్బంది పనితీరు మెరుగుపడాలి**

ఈ సందర్భంగా ఎస్పీ డి.జానకి మాట్లాడుతూ, "పోలీసు సిబ్బంది విధి నిర్వహణకు అవసరమైన అన్ని సామగ్రిని ఎలాంటి కొరత లేకుండా అందించడం ద్వారా వారి పనితీరు మరింత మెరుగుపడుతుంది. స్టోర్ నిర్వహణలో ఎలాంటి అలసత్వం ఉండకూడదు"అని పేర్కొన్నారు. ఎస్పీ తనిఖీతో స్టోర్ నిర్వహణ మరింత క్రమబద్ధంగా ఉంటుందని పోలీసు అధికారులు తెలిపారు.

# మోస్ట్ వాంటెడ్ క్రిమినల్ భూష్మి శ్రీకాంత్ నేర సామ్రాజ్యం బట్టబయలు

**- జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్.**

**- యువకులను మభ్యపెట్టి నేరాల వైపు మళ్లించి, శిక్షణ ఇచ్చిన కరుడుగట్టిన నేరస్థుడు.**

**- భూష్మి శ్రీకాంత్ ఏర్పాటు చేసిన 8 మంది అంతర్‌రాష్ట్ర చోరీ ముఠాలో 6గురు అరెస్ట్,ఇద్దరు పరారీ.**

**- రెండు తెలుగు రాష్ట్రాల్లో 40 చోరీ కేసుల ఛేదన.**

**- 53 లక్షల విలువ చేసే 260 గ్రాముల బంగారు ఆభరణాలు, 5 కిలోల వెండి ఆభరణాలు,1లక్ష50 వేలు నగదు స్వాధీనం.**




ఉమ్మడి నల్లగొండ జిల్లా బ్యూరో,జులై18,(విజన్ ఆంధ్ర) : రెండు తెలుగు రాష్ట్రాల్లో తాళాలు వేసిన ఇళ్లను లక్ష్యంగా చేసుకుని వరుస చోరీలకు పాల్పడుతూ పోలీసులకు సవాల్‌గా మారిన మోస్ట్ వాంటెడ్ అంతర్‌రాష్ట్ర నేరస్థుడు భూష్మి శ్రీకాంత్ అలియాస్ అమ్మిరాజు రూపొందించిన నేర ముఠాను నల్గొండ జిల్లా పోలీసులు ఛేదించారు.ఈ ముఠాలోని 6 గురు సభ్యులను అరెస్టు చేయగా,మరో 2 నిందితులు నిందితులు పరారీలో ఉన్నారు.నిందితుల వద్ద నుంచి 53 లక్షల విలువ చేసే 260 గ్రాముల బంగారు ఆభరణాలు,5 ఖిస్త్ర వెండి ఆభరణాలు,1లక్ష 50వేలు నగదు,2 టీవీలు,2 సౌండ్ బార్స్,5 ద్విచక్ర వాహనాలు,7 మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ వెల్లడించారు.2024లో మిర్యాలగూడ రూరల్ పోలీస్ స్టేషన్లో




కేసు నమోదు అయింది.ఇటీవల అరెస్ట్ అయిన మోస్ట్ వాంటెడ్ నేరస్థుడు భూష్మి శ్రీకాంత్‌ను విచారించగా అతని నేర కార్యకలాపాలకు సంబంధించిన అనేక సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి.శ్రీకాంత్ ఇచ్చిన సమాచారం ఆధారంగా తెలంగాణలో 28,ఆంధ్రప్రదేశ్ లో12 మొత్తం 40 చోరీ కేసులకు పాల్పడిన అతని ముఠాను పట్టుకునేందుకు జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు సి సి ఎస్ ఇన్‌స్పెక్టర్ ఎం. జితేందర్ రెడ్డి,డి.చంద్రశేకర్ రెడ్డి,మిర్యాలగూడ రూరల్ సీఐ పి ఎన్ డి ప్రసాద్,మిర్యాలగూడ టు టౌన్ ా× ఎస్సై ఆంజనేయులు,మాడ్గులపల్లి ఎస్సై సురేశ్ యాదవ్ ఆధ్వర్యంలో 3 ప్రత్యేక పోలీసు బృందాలను ఏర్పాటు చేశారు.ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో విస్తృతంగా గాలింపు నిర్వహించి, పిడుగురాళ్ల, అంజనీపురం, మండేపూడి,అమరావతి ప్రాంతాల్లో నిందితులను అదుపులోకి తీసుకున్నారు.యువకులను మభ్యపెట్టి నేరాల వైపు నడిపించిన శ్రీకాంత్ దర్యాప్తులో వెలుగులోకి వచ్చిన వివరాల ప్రకారం భూష్మి శ్రీకాంత్ విజయవాడ, గుంటూరు, పల్నాడు,ప్రకాశం,నల్గొండ ప్రాంతాల్లో వైన్ షాపుల వద్ద పరిచయమైన యువకులను లక్ష్యంగా చేసుకునేవాడు. మొదట వారికి మద్యం తాగించడం,డబ్బులు ఖర్చు పెట్టడం,వ్యక్తిగత సమస్యల్లో సహాయం చేస్తున్నట్లు నమ్మకం కల్పించి,"తక్కువ సమయంలో ఎక్కువ డబ్బు సంపాదించే మార్గం చోరీలే" అంటూ ప్రలోభపెట్టేవాడు.తాళాలు ఎలా పగులగొట్టాలి, ఎలాంటి ఇళ్లను లక్ష్యంగా ఎంచుకోవాలి,సీసీటీవీ కెమెరాలను ఎలా తప్పించుకోవాలి,చోరీ చేసిన సొత్తును ఎక్కడ విక్రయించాలి వంటి అంశాలపై కూడా తన అనుచరులకు శిక్షణ ఇచ్చినట్లు విచారణలో వెల్లడైంది.మొత్తం 9 మంది సభ్యులతో ఈ ముఠాను ఏర్పాటు చేశాడు.వీరిలో ఎ-3 తమ్మిశెట్టి నాగరాజు పై ఏపీలో గతంలో10 కి పైగా కేసులు, ఒక డెకాయిటీ కేసులో7 సంవత్సరాల జైలు శిక్ష ఉంది.రాజమండ్రి సెంట్రల్ జైల్ లో శిక్ష అనుభవిస్తున్న సమయంలో శ్రీకాంత్ తో పరిచయం ఏర్పడి,అతనికి ఆశ్రయం కల్పించి కలిసి నేరాలకు పాల్పడ్డాడు. తమ్మిశెట్టి నాగరాజు లారీ డ్రైవర్,పిడుగురాళ్ల,పల్నాడు జిల్లా,అల్లంశెట్టి సాయి కిరణ్ ఏపాండు లేబర్, అంజనీపురం, పల్నాడు,సమంతపు వెంకట అశోక్ పురోహిత్యం అంజనీపురం,ఆలేటి కోటేశ్వర్ రావు ఆటో డ్రైవర్,పిడుగురాళ్ల,సపావత్ నాగ కిరణ్ బాబు నాయక్ ఆటో డ్రైవర్ మండేపూడి,పిల్లి రాజేష్ బైక్ మెకానిక్ పెద కూరపాడు లను శనివారం అరెస్టు చేసి రిమాండ్ కు తరలించారు.గాడిబోయిన గోపి సాయి ఆటో డ్రైవర్ పిడుగురాళ్ల,తమ్మంద్ర రమేష్ ఆటో డ్రైవర్ పిడుగురాళ్ల పరారీ లో ఉన్నారు. నిందితులు తెలంగాణలోని మిర్యాలగూడ రూరల్,I & II టౌన్,నల్గొండ I టౌన్,వాడపల్లి, తిప్పర్తి,మాడ్గులపల్లి, చండూర్, కనగల్, డిండి,ఏపీలో నరసారావుపేట, బాపట్ల, పిడుగురాళ్ల, తదితర పోలీస్ స్టేషన్ పరిధుల్లో మొత్తం 40 ఆస్తి నేరాలకు పాల్పడ్డారు.12 నేర ఘటనల్లో వేలిముద్రలు మాక్ అయ్యాయి.సీసీటీవీ ఆధారంగా గుర్తించారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ,"నేరస్థుడు ఎంత తెలివిగా ముఠాను నిర్మించినా చట్టం నుంచితప్పించుకోలేడు.ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం సమర్థమైన దర్యాప్తు,ప్రజల సహకారంతో ప్రతి నేరస్థుడిని చట్టం ముందు నిలబెడతాం అన్నారు.యువత తప్పుడు ప్రలోభాలకు లోనై నేరాల వైపు వెళ్లవద్దు"అని సూచించారు.ఈ ముఠాను ఛేదించిన సి సి ఎస్ ఇన్‌స్పెక్టర్లు ఎం.జితేందర్ రెడ్డి,డి.చంద్రశేకర్ రెడ్డి, ఎస్సైలు,సిబ్బందిని ఎస్పీ ప్రత్యేకంగా అభినందించి నగదు బహుమతులు,ప్రశంసా పత్రాలు ప్రకటించారు.

# ప్రజల గుండెల్లో చెదరని ముద్ర వేసిన మేఘారెడ్డి

**- ప్రజల నమ్మకమే విజయ రహస్యం**

**- "ఇదే మేఘా హిస్టరీ"**



వనపర్తి జిల్లా ప్రతినిధి, జులై 18 (విజన్ ఆంధ్ర) : వనపర్తి అసెంబ్లీ నియోజకవర్గంలో గతంలో ఏ నాయకుడు చేయని విధంగా అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేసి ప్రజల మనిషిగా నిలిచిన ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి ఆరు నెలల్లోనే అసాధ్యాన్ని సుసాధ్యం చేసి చరిత్ర సృష్టించారని స్థానికులు కొనియాడుతున్నారు. 2023 మార్చి 9న BRS పార్టీకి రాజీనామా చేసి కాంగ్రెస్‌లో చేరిన తర్వాత, అధికార పార్టీ బలమైన వ్యవస్థ ఉన్నా వెనక్కి తగ్గకుండా గ్రామం గ్రామం తిరిగారు. ఇంటింటికి వెళ్లి వేలాది కుటుంబాలను కలిసి రైతులు, యువత, మహిళలు, ఉద్యోగుల సమస్యలు తెలుసుకున్నారు. రాజకీయ నాయకుడిగా కాకుండా ఇంటి మనిషిగా ప్రజలతో మమేకమయ్యారు. 2023 నవంబర్‌లో జరిగిన శాసనసభ ఎన్నికల్లో అప్పటి అధికార దీ=ా ప్రభుత్వంలో కీలక మంత్రిపై కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి ఘన విజయం సాధించారు. ఇది కేవలం ఎన్నికల విజయం కాదు, అధికార అహంకారంపై ప్రజల ఆత్మవిశ్వాసం సాధించిన విజయంగా వనపర్తి రాజకీయ చరిత్రలో నిలిచిపోయింది. గ్రామ స్థాయి సర్పంచ్‌గా ప్రారంభమైన ఆయన ప్రస్థానం ఎంపీటీసీ, ఎంపీపీ మెట్లు దాటి ఎమ్మెల్యేగా ఎదిగింది. "సేవ్ వనపర్తి – చేంజ్ వనపర్తి" నినాదంతో ప్రజా ఉద్యమాన్ని నడిపి ప్రత్యామ్నాయ నాయకత్వంపై విశ్వాసం పెంచారు. ఎమ్మెల్యేగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత కూడా అదే ప్రజా బాటలో కొనసాగుతున్నారు. ఎన్నికల హామీల అమలు, గ్రామీణ రహదారులు, విద్య, వైద్యం, రైతు సంక్షేమం, మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తూ నియోజకవర్గాన్ని ముందుకు తీసుకెళ్తున్నారని ప్రజలు చెబుతున్నారు. ఒక నాయకుడు ఎంతకాలం పదవిలో ఉన్నాడన్నది కాదు, ప్రజల కోసం ఎంత నిజాయితీగా నిలబడ్డాడన్నదే ముఖ్యమని, మేఘారెడ్డి గారి ప్రస్థానం అందుకు నిదర్శనమని పేర్కొన్నారు.

# శిశిలిసర్ ప్రక్రియ వేగంగా పూర్తి చేస్తే నగదు బహుమతులు

**- బీఎల్‌వోలు, బీఎల్‌ఏలతో మంత్రి జూపల్లి సమీక్ష**

**- తొలి బహుమతి రూ.10 వేలు.. రెండో బహుమతి రూ.5 వేలు**



పనగండ్ల, జూలై 18 : ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియను నిర్దేశిత గడువులోగా సమర్థవంతంగా, వేగంగా పూర్తి చేయాలని పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఆదేశించారు. శనివారం వీపనగండ్లలో నిర్వహించిన ఎస్ఐఆర్ అవగాహన కార్యక్రమంలో బూత్ లెవల్ అధికారులు (బీఎల్‌వోలు), బూత్ లెవల్ ఏజెంట్లు (బీఎల్ఏలు)తో మంత్రి సమీక్ష నిర్వహించి, ప్రక్రియ అమలుపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా గ్రామాలవారీగా ఎస్ఐఆర్ ప్రక్రియ పురోగతిని మంత్రి సమీక్షించారు. కొన్ని గ్రామాల్లో ప్రక్రియ మందకొడిగా సాగుతోందని గుర్తించి, వెనుకబడిన గ్రామాల్లో ప్రత్యేక దృష్టి సారించి వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. వలస వెళ్లిన ఓటర్లను గుర్తించి, వారిని ఫోన్‌లో సంప్రదించి ఓటరు నమోదుకు అవసరమైన ప్రక్రియను పూర్తి చేయించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అర్హులైన ప్రతి ఓటరును నమోదు చేయడంతో పాటు, ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు పారదర్శకంగా ఎస్ఐఆర్ ప్రక్రియను నిర్వహించాలని తెలిపారు. ఎస్ఐఆర్ ప్రక్రియను నిర్దేశిత గడువులోగా అత్యంత సమర్థవంతంగా పూర్తి చేసిన బూత్ లెవల్ ఆఫీసర్లు, బూత్ లెవల్ ఏజెంట్లను ప్రోత్సహించేందుకు నగదు బహుమతులు అందజేస్తామని మంత్రి ప్రకటించారు. తొలి బహుమతిగా రూ.10,000, ద్వితీయ బహుమతిగా రూ.5,000 అందజేస్తామని తెలిపారు. ఈ ప్రోత్సాహకాలను స్ఫూర్తిగా తీసుకుని ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా విధులు నిర్వహించి, ఎస్ఐఆర్ ప్రక్రియను విజయవంతం చేయాలని మంత్రి పిలుపునిచ్చారు.

# ఆదిలాబాద్ ను గంజాయి రహిత జిల్లాగా మార్చడమే లక్ష్యం

**- ఎస్పీ అఖిల్ మహాజన్**




బోథ్. జూలై 18. (విజన్ ఆంధ్ర) ప్రజల భాగస్వామ్యంతో ఆదిలాబాద్ జిల్లాను గంజాయి రహిత జిల్లాగా మార్చడమే తమ లక్ష్యమని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. శనివారం సోనాల మండలంలోని గుర్రాలతాండ గ్రామంలో పోలీసులు – మీకోసం కార్యక్రమంలో భాగంగా మాదక ద్రవ్యాల వ్యతిరేక, రోడ్డు భద్రతపై అవగాహన సదస్సుతో పాటు గ్రామంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పోలీసు వ్యవస్థ చాలా పటిష్టంగా ఉందని తప్పులు చేసి తప్పించుకునే అవకాశం లేదని అన్నారు. ఒక్కప్పుడు సమస్య వస్తే బాధితులే పోలీసు స్టేషన్ కు వెళ్ళాల్సిన పరిస్థితి ఉండేనని కానీ నేడు ఏ చిన్న ఆపద వచ్చిన డయల్ 100 కు ఒక్క పోన్ కాల్ చేస్తే మీ దగ్గరకు పోలీసులు వస్తారని తెలిపారు. యువతులు, మహిళల భద్రత కోసం షీ టీమ్స్ ఉన్నాయని. ఇటీవలే పోలీసు అక్క పేరుతో నూతన కార్యక్రమాన్ని ప్రారంభించామని అన్నారు. పిల్లలు చెడు వ్యసనాలకు వెళ్లకుండా చూడాల్సిన బాధ్యత తల్లిదండ్రులదేనని, పిల్లల రోజువారీ దిన చర్యను ఎప్పటికప్పుడు పసి గట్టాలని అన్నారు. మగ పిల్లలతో సమానంగా ఆడపిల్లలను చదివించాలని, బాల్య వివాహాలు చేయకూడదని బాల్య వివాహాలు చేసిన వారిపై చట్ట రీత్యా చర్యలు తీసుకోబడుతాయని అన్నారు. ద్విచక్ర వాహనదారులు బయటకు వెళ్లేటప్పుడు విధిగా హెల్మెట్ లను ధరించాలని అన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణ ప్రతి ఒక్కరి బాధ్యతని అన్నారు. గంజాయిని సాగు చేసిన, విక్రయించిన, సేవించినా నేరమేనని గంజాయి సాగు చేస్తూ పట్టుబడితే రైతు భరోసాను నిలిపి వేస్తామని హెచ్చరించారు. ప్రతి గ్రామం సీసీ టీవీ నిఘాలో ఉంటే నేరాల నియంత్రణ మరింత సమర్థవంతంగా ఉంటుందని అన్నారు. గంజాయి నిర్మూలనకు ప్రతి ఒక్కరూ సహకరించాలని పిలుపునిచ్చారు. అనంతరం రెండు రోజుల మండల స్థాయి వాలీబాల్ టోర్నమెంట్ విజేతలకు ఆయన బహుమతులను అందజేశారు. ఈ టోర్నమెంట్ ను నిర్వహించేందుకు సహకరించిన బోథ్ ఫ్రెండ్స్ క్లబ్ సభ్యులు, పీఈటీ లకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ జీవన్ రెడ్డి. బోథ్ సీఐ డి. గురుమూర్తి, ఎస్ఐ పురుషోత్తం, గుర్రాల తండా సర్పంచ్ దినేష్ పలు గ్రామాల సర్పంచ్ లు, ప్రజా ప్రతినిధులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# ప్రీ-ప్రైమరీ ప్రవేశాలను రెండు రోజుల్లో పూర్తి చేయాలి : జిల్లా కలెక్టర్ అంకిత్



పాల్వంచ ప్రతినిధి జూలై 18(విజన్ ఆంధ్ర): జిల్లా కలెక్టర్ అంకిత్ శుక్రవారం పాల్వంచ మండలంలో విస్తృతంగా పర్యటించి సారేకల్లు గ్రామంలో భూ రీ-సర్వే పనులను పరిశీలించారు. అనంతరం కోడిపుంజుల వాగు గ్రామంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎల్‌నీనో ప్రభావంపై రైతుల అవగాహన సదస్సులో పాల్గొని రైతులకు పలు సూచనలు చేశారు. అనంతరం కరకవాగు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసి విద్యా ప్రమాణాలు, ప్రీ-ప్రైమరీ ప్రవేశాలపై అధికారులకు పలు ఆదేశాలు జారీ చేశారు. ముందుగా సారేకల్లు గ్రామపంచాయతీ పరిధిలో కొనసాగుతున్న భూ రీ-సర్వే పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించిన కలెక్టర్, సంబంధిత అధికారులను పురోగతి గురించి అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన భూ రీ-సర్వే కార్యక్రమం ద్వారా భూముల హద్దులు ఖచ్చితంగా నిర్ధారించబడటంతో పాటు భూ రికార్డులు నవీకరించబడతాయని తెలిపారు. దీనివల్ల భూ వివాదాల పరిష్కారానికి దోహదపడటంతో పాటు భూ యజమానులకు పారదర్శకమైన రికార్డులు అందుబాటులోకి వస్తాయని అన్నారు . సర్వే పనులను వేగవంతంగా పూర్తి చేయాలని, సర్వే నిర్వహణలో ఎలాంటి సమస్యలు ఎదురైనా వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని ఆదేశించారు. ప్రజలతో సమన్వయం చేసుకుంటూ నిబంధనలకు అనుగుణంగా సర్వే నిర్వహించాలని సూచించారు. అధికారులు సారేకల్లు గ్రామపంచాయతీ పరిధిలో మొత్తం 28 సర్వే నంబర్లలో 84 ఎకరాల మేర భూ రీ-సర్వే కొనసాగుతోందని, రెండు రోజుల్లో పూర్తి చేస్తామని కలెక్టర్‌కు వివరించారు. అనంతరం కోడిపుంజుల వాగు గ్రామంలో నిర్వహించిన అవగాహన సదస్సులో కలెక్టర్ మాట్లాడుతూ, ఎల్‌నీనో ప్రభావం కారణంగా వర్షపాతం తగ్గడంతో పాటు ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశం ఉన్నందున రైతులు వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటల మార్పిడి చేపట్టాలని సూచించారు. అధిక నీటి అవసరమున్న పంటలకు బదులుగా సజ్జలు, రాగులు, జొన్నలు, కొర్రలు, సామలు వంటి చిరుధాన్యాలు, కంది, పెసర, మినుము, నువ్వులు, పొద్దుతిరుగుడు వంటి తక్కువ నీటి అవసరమున్న పంటలను సాగు చేయాలని సూచించారు. మార్కెట్లో డిమాండ్ ఉన్న కూరగాయల సాగుపై దృష్టి సారించాలని, పంటల వైవిధ్యీకరణ, నీటి పొదుపు, శాస్త్రీయ సాగు విధానాలను అనుసరించడం ద్వారా ఎల్‌నీనో ప్రభావాన్ని సమర్థవంతంగా ఎదుర్కోవచ్చని తెలిపారు. రైతులు వ్యవసాయ శాఖ అధికారుల సాంకేతిక సూచనలను పాటిస్తూ సాగు ప్రణాళికలు రూపొందించుకోవాలని సూచించారు. అనంతరం కరకవాగు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్, మధ్యాహ్న భోజన పథకం ద్వారా విద్యార్థులకు అందిస్తున్న ఆహారం నాణ్యత, పరిశుభ్రతను పరిశీలించి, ప్రతిరోజూ నాణ్యమైన, పోషకాహారం అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. తరగతి గదులను సందర్శించి విద్యార్థుల హాజరు, బోధన విధానం, అభ్యాస స్థాయిని పరిశీలించారు. ఐదో తరగతి విద్యార్థులతో ఇంగ్లీష్‌లో మాట్లాడించి వారి భాషా నైపుణ్యాలను పరీక్షించారు. విద్యార్థుల్లో ఇంగ్లీష్ భాషా ప్రావీణ్యం పెంపొందించేందుకు ప్రత్యేక శిక్షణ అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు.ప్రీ-ప్రైమరీ తరగతి గదిని పరిశీలించిన కలెక్టర్, ఆ విభాగంలో 20 మంది విద్యార్థులు ఉండాల్సిన లక్ష్యానికి గాను ప్రస్తుతం 14 మంది మాత్రమే చేరినట్లు గుర్తించారు. మిగిలిన విద్యార్థుల చేరికల కోసం ప్రత్యేక చర్యలు చేపట్టి, రెండు రోజుల్లో ప్రీ-ప్రైమరీ ప్రవేశాలను పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు, హాజరు, బోధన నాణ్యత, అభ్యాస ఫలితాల మెరుగుదలకు అధికారులు, ఉపాధ్యాయులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమాల్లో కొత్తగూడెం ఆర్డీవో మధు, పాల్వంచ తహసీల్దార్ ధారాప్రసాద్, కోడిపుంజుల వాగు గ్రామ సర్పంచ్ మహేశ్వరి, సర్వే అధికారులు, వ్యవసాయ శాఖ అధికారులు, విద్యాశాఖ అధికారులు, రెవెన్యూ శాఖ అధికారులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సిబ్బంది, రైతులు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# 2.55 కోట్లతో ప్రభుత్వ బడుల ప్రక్షాళన!!

**- ప్రైవేటుకు ధీటుగా సర్కారు బడులు**

**- సర్కారు బడుల్లో పౌష్టికాహారం.. విద్యార్థుల సంఖ్య పెంపే లక్ష్యం**

**- కాంగ్రెస్ హయాంలోనే నిస్వార్థ ప్రగతి**

**- విప్ విజయరమణ రావు**



పెద్దపల్లి బ్యూరో చీఫ్, జూలై 18 (విజన్ ఆంధ్ర): పెద్దపల్లి నియోజకవర్గంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు ఆధ్వర్యంలో విద్య, మౌలిక వసతుల రంగాలు సరికొత్త రూపు సంతరించుకుంటున్నాయి. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ హయాంలో విద్యారంగ అభివృద్ధికి అగ్రతాంబూలం ఇస్తున్న నేపథ్యంలో, నియోజకవర్గ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ సంస్థలకు ధీటుగా తీర్చిదిద్దేందుకు రూ. 2.55 కోట్ల డీఎంఎఫ్‌టీ నిధులతో విప్ విజయరమణ రావు స్థానిక నాయకులతో కలిసి పలు అభివృద్ధి పనులకు ఘనంగా శంకుస్థాపనలు చేశారు. ఈ నిధులలో భాగంగా పెద్దకల్వల పాఠశాలకు రూ. 19 లక్షలు, నిట్టూరుకు రూ. 45 లక్షలు, తుర్కల మద్దికుంటకు రూ. 48 లక్షలు, బొంపల్లికి రూ. 25 లక్షలు, రాగినేడుకు రూ. 58 లక్షలు, అప్పన్నపేట ప్రభుత్వ పాఠశాలకు రూ. 60.50 లక్షలను కేటాయించి మౌలిక సదుపాయాల కల్పనకు శ్రీకారం చుట్టారు. కేవలం ఈ గ్రామాల్లోనే కాకుండా పెద్దపల్లి మండలం, పట్టణ పరిధిలోని సర్కారు బడుల సమగ్ర ప్రక్షాళన కోసం ఏకంగా రూ. 5.70 కోట్లు మంజూరు చేశామని ఈ సందర్భంగా జరిగిన సభలో ఎమ్మెల్యే గుర్తుచేశారు. గత పాలకుల నిర్లక్ష్యంతో కుదేలైన విద్యావ్యవస్థను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవతో మళ్లీ బలోపేతం చేస్తున్నామని, ప్రభుత్వ బడుల్లో నాణ్యమైన విద్యతో పాటు విద్యార్థుల సంఖ్యను గణనీయంగా పెంచగలిగామని ఆయన స్పష్టం చేశారు. విద్యార్థుల శారీరక, మానసిక వికాసం కోసం బడుల్లో పౌష్టికాహారాన్ని అందిస్తూ, మధ్యాహ్న భోజనంతో పాటు ఉదయం పూట పౌష్టిక అల్పాహారాన్ని సైతం కాంగ్రెస్ ప్రభుత్వం పంపిణీ చేస్తోందని, ఫలితంగానే నేడు రాష్ట్రంలో పెద్దపల్లి జిల్లా విద్యారంగంలో అగ్రస్థానంలో నిలిచిందని ఆయన సగర్వంగా ప్రకటించారు. కేవలం పాఠశాలలకే పరిమితం కాకుండా గ్రామీణ రోడ్ల అనుసంధానానికి పెద్దపీట వేస్తూ, పెద్దకల్వల గ్రామంలో రూ. 5 లక్షలతో నూతనంగా నిర్మించిన అంతర్గత సీసీ రోడ్డును ప్రారంభించడంతో పాటు, బొంపల్లి గ్రామంలోని ఆర్ అండ్ బి రోడ్డు నుండి తెనుగువాడ వరకు రూ. 50 లక్షల వ్యయంతో నిర్మించనున్న నూతన బీటీ రోడ్డు పనులకు కూడా విప్ శంకుస్థాపన చేశారు. ప్రైవేట్ పాఠశాలలకు ఏమాత్రం తీసిపోని విధంగా సర్కారు బడులు అద్భుతమైన ఫలితాలను సాధిస్తున్నాయని, భవిష్యత్తులో విద్యార్థుల సంఖ్యను మరింతగా పెంచేందుకు రాజకీయాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. నియోజకవర్గ ప్రగతి పథంలో మైలురాయిగా నిలిచిన ఈ విస్తృత అధికారిక పర్యటనలో విద్యాశాఖ అధికారులు, వివిధ గ్రామాల సర్పంచులు, ప్రస్తుత మరియు మాజీ ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ శ్రేణులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేశారు.

# ఆయిల్ ఫామ్ పంటను పరిశీలించిన జిల్లా కలెక్టర్

**- తక్కువ నీళ్లతో ఎక్కువ సాగు**

**- పామాయిల్ తోటలో అంతర పంటల ద్వారా ఆదాయం**



శంకరంపేట(ఆర్) మండలం, (విజన్ ఆంధ్ర)జులై 18: మండల పరిధిలో ని సూరారం గ్రామంలో రైతులు సత్యనారాయణ, రాజు, జగదీశ్ ముగ్గురు కలిసి 3 సంవత్సరాలు నిండిన ఆయిల్ పామ్ తోటను సందర్శించి తొలిసారిగా వచ్చిన ఆయిల్ పామ్ పంట జిల్లా కలెక్టర్ ప్రతిమ సింగ్ పంటను సందర్శించి ఆమె మాట్లాడుతూ మెదక్ జిల్లాలో 2023-24 నుండి ఇప్పటివరకు 1857 ఎకరాలలో ఆయిల్ పామ్ సాగు జరిగిందని 2026-27 సంవత్సరానికి జిల్లాకు 2500 ఎకరాల లక్ష్యం నిర్దేశించుకోవడంతో ఇప్పటివరకు 693 ఎకరాలలో రైతులు భూమి సిద్ధం చేసుకోగా, అందులో 354 ఎకరాలలో తోటలు స్థాపించడం జరిగిందని వెల్లడించారు. రైతులందరూ మార్కెట్ డిమాండ్ ఉన్న పంటలపై దృష్టి సారించాలని, వాటిలో ఆయిల్ పామ్ ఒకటని తెలిపారు. దేశంలో ఏ పంటకు లేనివిధంగా ఆయిల్ పామ్ సాగు కొరకు చట్టం ద్వారా ప్రభుత్వం ప్రోత్సాహకాలు అందిస్తుందని అన్నారు. మొక్కలపై రాయితీతో పాటు, 4 సంవత్సరాల పాటు తోట నిర్వహణ మరియు అంతర పంటల సాగు కొరకు రాయితీ సొమ్మును నేరుగా రైతు ఖాతాకు జమ చేయడం జరుగుతుందని అన్నారు ఒక రైతుకు గరిష్టంగా 12.50 ఎకరాల వరకు డ్రిప్ పరికరాలపై రాయితీ సదుపాయం కల్పిస్తారని చెప్పారు :ఆయిల్ పామ్ మొక్కలు నాటిన 4 సంవత్సరాల తరువాత ఎకరానికి 10-12 టన్నుల దిగుబడి వస్తుందని . ప్రస్తుతం ఒక టన్ను ఆయిల్ పామ్ గెల ధర,రూ.23,852/-ఉండగా.సంవత్సరానికి ఎకరానికి రూ.2,38,520/- ఆదాయం, ఖర్చులు పోను రూ.2,00,000/- వరకు నికర ఆదాయం పొందవచ్చు. అని సుదీర్ఘంగా వివరించారు.ఒక ఎకరా వరికి పట్టే నీటితో 5 ఎకరాల ఆయిల్ పామ్ సాగు చేయవచ్చు. అని తెలిపారు.ఈ పంటకు మధ్యవర్తులు ఉండకుండా సంబంధిత కంపెనీ నేరుగా కొనుగోలు చేస్తుందని . దొంగలు, కోతుల బెడద లేని పంట అని వెల్లడించారు. రైతులు ముందుకు రావాలని కోరారు.. మొదటి 4 సంవత్సరాలు పంట రాని సమయంలో అంతర పంటల ద్వారా ఆదాయం పొందవచ్చు అని వెల్లడించారు. 5 సంవత్సరాల తర్వాత కోకో, వక్క వంటి నీడను తట్టుకునే పంటలను సాగు చేసి అదనపు ఆదాయం పొందవచ్చు అన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యాన మరియు పట్టు పరిశ్రమ శాఖ అధికారి ప్రతాప్ సింగ్ శంకరంపేట(ఆర్) తాసిల్దార్ మాలతి ఎంపీడీవో దామోదర్ ఆర్ ఐ వినయ్ కుమార్ సూరారం సర్పంచ్ చిలక నాగరాజు మిర్జాపల్లి సర్పంచ్ యాదగిరి కొరివిపల్లి సర్పంచ్ పుల్లారావు గజ్జట్లపల్లి సర్పంచ్ నాగభూషణం పడాల సిద్ధిరాములు దుర్గా పతి వ్యవసాయ, ఉద్యాన, వ్యవసాయ విస్తరణ అధికారులు, వీ/ο లివ్ పామ్ రిసోర్సెస్ ప్రై.లి కంపెనీ మేనేజర్ మరియు ప్రతినిధులు, మైక్రో ఇరిగేషన్ ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

# కిష్టగిరి గ్రామంలో భూముల సమగ్ర రీ-సర్వే అవగాహన సదస్సు

**- గ్రామసభలో లిపాల్గొన్న అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ) వినోద్ కుమార్**

**- విజయవంతంగా సాగిన గ్రామసభ**



వనపర్తి బ్యూరో జులై 18 (విజన్ ఆంధ్ర ):దశాబ్దాలుగా నలుగుతున్న భూ సమస్యలకు, హద్దుల వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపేందుకే ప్రభుత్వం అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రీ-సర్వేను ప్రతిష్టాత్మకంగా చేపట్టిందని అదనపు కలెక్టర్ రెవెన్యూ వినోద్ కుమార్ పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన "భూ భారతి" భూముల సమగ్ర రీ-సర్వే కార్యక్రమం పై రైతులకు, ప్రజలకు అవగాహన కల్పించేందుకు వనపర్తి మండలం కిష్టగిరి గ్రామంలో శనివారం ఒక ప్రత్యేక గ్రామసభ (అవగాహన సదస్సు) నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వనపర్తి జిల్లా అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ) వినోద్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ మాట్లాడుతూ.. దశాబ్దాలుగా నలుగుతున్న భూ సమస్యలకు, హద్దుల వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపేందుకే ప్రభుత్వం అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో (రోవర్స్, డీజీపీఎస్ విధానం ద్వారా) ఈ రీ-సర్వేను ప్రతిష్టాత్మకంగా చేపట్టిందని వివరించారు. ప్రతి అంగుళం భూమికి కచ్చితమైన హద్దులు నిర్ణయించి, వివాదరహిత భూ రికార్డులను రూపొందించడమే దీని ముఖ్య ఉద్దేశమని ఆయన తెలిపారు. రైతులందరూ క్షేత్రస్థాయికి వచ్చే సర్వే బృందాలకు సహకరించి, తమ భూములకు సంబంధించిన సరైన వివరాలను అందించి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. సదస్సులో పాల్గొన్న ఉన్నతాధికారులు రీ-సర్వే ప్రక్రియ, రికార్డుల నమోదు, తదుపరి కేటాయించే 'భూధార్' ఐడీ కార్డుల ప్రాధాన్యత గురించి గ్రామ ప్రజలకు క్షుణ్ణంగా వివరించారు. గ్రామంలోని రైతులు అడిగిన పలు అనుమానాలకు అధికారులు వేదికపైనే నివృత్తి చేశారు. అవగాహన సదస్సులో సహాయ సంచాలకులు శ్రీనివాసులు, వనపర్తి ఆర్డీఓ, సుబ్రహ్మణ్యం, వనపర్తి తహసీల్దార్ రమేష్ రెడ్డి, వనపర్తి ఎంపీడీఓ , మండల పరిషత్ , కిష్టగిరి గ్రామ సర్పంచ్, గ్రామ రెవెన్యూ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు (గ్రామ స్థాయి అధికారులు) మరియు పెద్ద సంఖ్యలో స్థానిక రైతులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# ఫార్మాబయోలాజిక్స్ రంగంలో ఉచిత శిక్షణ..

**-అనంతరం ఉద్యోగావకాశం**

**-జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి కల్పన**

పెద్దపల్లి జిల్లా ప్రతినిధి జూలై-18(విజన్ ఆంధ్ర) : ఫార్మా మరియు బయోలాజిక్స్ రంగంలో ప్రొడక్షన్ కెమిస్ట్‌లను తీర్చిదిద్దేందుకు మూడు నెలల ఉచిత రెసిడెన్షియల్ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పెద్దపల్లి జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి కల్పన తెలిపారు. శనివారం విడుదల చేసిన ప్రకటనలో ఆమె ఈ వివరాలను వెల్లడించారు. విజయవాడలో పూర్తిగా రెసిడెన్షియల్ విధానంలో నిర్వహించే ఈ శిక్షణకు బీఎస్సీ కెమిస్ట్రీ, ఎంఎస్సీ కెమిస్ట్రీ, ఎంఎస్సీ ఆర్గానిక్ కెమిస్ట్రీ, ఎంఎస్సీ అనలిటికల్ కెమిస్ట్రీ, డిప్లొమా ఇన్ కెమికల్ ఇంజినీరింగ్, బీటెక్, ఎంటెక్ కెమికల్ ఇంజినీరింగ్ అర్హత కలిగిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ప్రతి బ్యాచ్‌లో 35 మందికి అవకాశం కల్పిస్తారని పేర్కొన్నారు. శిక్షణ కాలంలో ఉచిత వసతి, భోజనం, శిక్షణ అందించడంతో పాటు, కోర్సును విజయవంతంగా పూర్తి చేసిన వారికి నెలకు రూ.18 వేల నుంచి రూ.24 వేల వరకు వేతనంతో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని తెలిపారు. మొదటి బ్యాచ్ (జూలై 25)కు 35 మందిని ఎంపిక చేసేందుకు ముందుగా 100 మంది అర్హులైన అభ్యర్థులతో అర్హత పరీక్ష నిర్వహించనున్నట్లు చెప్పారు. అర్హులైన విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని, ప్రభుత్వ, ప్రైవేట్ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు తమ కళాశాలల్లోని అర్హులైన విద్యార్థులను ప్రోత్సహించి వారి వివరాలను వెంటనే పంపించాలని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి కల్పన విజ్ఞప్తి చేశారు.

# ఉపాధి పథకాల దరఖాస్తుల గడువు జూలై 31 వరకు పొడిగింపు

గద్వాల జూలై 18 (విజన్ ఆంధ్ర బ్యూరో) : తెలంగాణ క్రైస్తవ మైనారిటీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో అమలు చేస్తున్న క్రైస్తవ మైనారిటీ స్వయం ఉపాధి పథకాలకు దరఖాస్తుల సమర్పణ గడువును ఈ నెల 31వ తేదీ వరకు పొడిగించినట్లు జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి సయ్యద్ అక్బర్ పాషా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పథకాల కింద కుట్టు మిషన్లు, చిరు వ్యాపారాల ఏర్పాటు, ఈ-బైక్‌లు, ఈ-స్కూటీలు, మోటార్ బైక్‌లు పొందేందుకు అర్హులైన క్రైస్తవ మైనారిటీ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చని ఆయన పేర్కొన్నారు. పథకాల అర్హతలు, అవసరమైన పత్రాలు, దరఖాస్తు విధానం తదితర వివరాల కోసం జిల్లా మైనారిటీ సంక్షేమ కార్యాలయం, రూమ్ నెం. ఎఫ్-8, ఐడీఓసీ కాంప్లెక్స్, జోగులాంబ గద్వాల జిల్లా కార్యాలయాన్ని సంప్రదించాలని జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి సయ్యద్ అక్బర్ పాషా సూచించారు.

# ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాలు పెరిగేలా ఎంఈవోలు క్షేత్రస్థాయిలో చర్యలు చేపట్టాలి

**- కేజీబీవీల్లో నాణ్యమైన విద్య,మెరుగైన వసతులు కల్పించాలి**

**- జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**



గద్వాల జూలై 18 (విజన్ ఆంధ్ర బ్యూరో) : జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు గణనీయంగా పెరిగేలా విద్యా శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పని చేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ఆదేశించారు. శనివారం ఐడీఓసీ కాన్ఫరెన్స్ హాల్లో విద్యాశాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో గత విద్యా సంవత్సరంతో పోల్చితే ఈ సంవత్సరం విద్యార్థుల నమోదు పెరిగేలా ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని ఆదేశించారు. తరగతుల వారీగా చేరికలు తగ్గిన పాఠశాలలను ఎంఈవోలు క్షేత్రస్థాయిలో సమీక్షించి, కారణాలను గుర్తించి వెంటనే పరిష్కరించి విద్యార్థుల నమోదును పెంచేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉచితంగా నాణ్యమైన విద్య, యూనిఫాం, మధ్యాహ్న భోజనం, అల్పాహారం అమలవుతుండడమే కాక సుశిక్షితులైన ఉపాధ్యాయులు ఉన్న విషయాన్ని వివరిస్తూ విద్యార్థులను చేర్పించాలని తెలిపారు. ప్రతి పాఠశాలలో విద్యార్థుల నమోదును ఆఫ్‌లైన్, ఆన్‌లైన్ విధానాల్లో పూర్తిచేయాలని ఆదేశించారు. ఇప్పటి వరకు నమోదైన విద్యార్థుల వివరాలను వెంటనే యు డైస్ పోర్టల్‌లో నమోదు పూర్తి చేయాలని,ఎలాంటి పెండింగ్ లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు పెంపునకు కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు మండల విద్యాధికారులతో సమన్వయంతో పనిచేయాలన్నారు. ప్రీ-ప్రైమరీ విద్యను బలోపేతం చేసి ప్రతి కేంద్రంలో కనీసం 25 మంది చిన్నారులు ఉండేలా చర్యలు తీసుకోవాలని, లక్ష్యం సాధించని అధికారులపై చర్యలు చేపడతామన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చేరే విద్యార్థులకు బోనఫైడ్, టీసీలు ఇవ్వకుండా ఇబ్బంది పెట్టే ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకుంటామని, లెర్నింగ్ ఇంప్రూవ్‌మెంట్ ప్రోగ్రామ్, ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ పై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. జిల్లాలోని ప్రతి పాఠశాలను విద్యాశాఖ అధికారులు క్రమం తప్పకుండా పర్యవేక్షించాలని, బోధన,హాజరు, మౌలిక సదుపాయాల పరిస్థితిని సమీక్షించాలని ఆదేశించారు. కాంప్లెక్స్ హెచ్.యం, ఎంఈవోల క్షేత్రస్థాయి పాఠశాల సందర్శనల వివరాలను ప్రతి నెల 15వ తేదీలోగా తెలంగాణ స్కూల్ ఎడ్యుకేషన్ యాప్‌లో అప్‌డేట్ చేయాలని ఆదేశించారు. అపార్ నమోదు పెరగాలని, ప్రీమెట్రిక్ ఉపకార వేతనాలకు రెన్యువల్, కొత్తగా దరఖాస్తు చేసుకునే విద్యార్థులకు సహకరించాలన్నారు. విద్యార్థులకు యూనిఫాంల పంపిణీని వేగవంతం చేయాలన్నారు.కేజీబీవీ కోఆర్డినేటర్లు ప్రతి నెల 12 కేజీబీవీలను సందర్శించి, క్షేత్రస్థాయి పరిస్థితులపై సమగ్ర నివేదికను తప్పనిసరిగా సమర్పించాలన్నారు. 100 శాతం ఎన్‌రోల్‌మెంట్ పూర్తైన కేజీబీవీల్లో ప్రవేశ ద్వారం వద్ద 'అడ్మిషన్స్ క్లోస్డ్' బోర్డు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ రాజ్ కుమార్,జిల్లా విద్యా శాఖ అధికారి విజయ లక్ష్మి, అన్ని మండలాల విద్యాధికారులు, కాంప్లెక్స్ హెడ్ మాస్టర్లు,కేజీబీవీ ప్రధానోపాధ్యాయులు, రెసిడెన్షియల్ పాఠశాలలు ఉపాధ్యాయులు,తదితరులు పాల్గొన్నారు.

# ఇంద్రకీలాద్రి కనకదుర్గమ్మను దర్శించుకున్న మాజీ శాసనసభ్యులు దాస్యం వినయ్ భాస్కర్



హన్మకొండ బ్యూరోచీఫ్ జూలై 18(విజన్ ఆంధ్ర ) : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విజయవాడలోని కనకదుర్గ అమ్మవారిని శనివారం రోజున ప్రభుత్వ మాజీ చీఫ్ విప్, మాజీ శాసనసభ్యులు దాస్యం వినయ్ భాస్కర్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఇంద్రకీలాద్రికి చేరుకున్న మాజీ చీఫ్ విప్ దంపతులకు, వారి కుటుంబ సభ్యులకు ఆలయ అధికారులు, అర్చకులు ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికారు. అనంతరం వారు అంతరాలయంలో శ్రీ కనకదుర్గ అమ్మవారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు. దర్శనానంతరం ఆలయ మండపంలో వేద పండితులు వారికి మంత్రపుష్పాలతో వేదాశీర్వచనం (ఆశీర్వాదాలు) పలికారు. ఆలయ అధికారులు అమ్మవారి శేషవస్త్రం, పవిత్ర తీర్థప్రసాదాలు, అమ్మవారి చిత్రపటాన్ని వారికి బహూకరించి గౌరవించారు. అమ్మవారి దర్శనం అనంతరం దాస్యం వినయ్ భాస్కర్ మాట్లాడుతూ... "దుర్గమ్మ తల్లి కృపాకటాక్షాలతో రెండు తెలుగు రాష్ట్ర ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖశాంతులతో వర్ధిల్లాలని ప్రార్థించాను. అమ్మవారి దర్శనం అత్యంత భక్తిశ్రద్ధలతో, ప్రశాంతంగా జరిగింది. ఆలయ అధికారులు చేసిన ఏర్పాట్లు, ప్రోటోకాల్ మర్యాదలు చాలా బాగున్నాయి" అని పేర్కొన్నారు.

# ఈ నెల 20వ తేదీన ప్రజావాణి రద్దు

**- జిల్లా కలెక్టర్ కె హరిత**



ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి జూలై 18,(విజన్ ఆంధ్ర) : ఉట్నూర్ లోని పి.ఎం.ఆర్.సి. సమావేశ మందిరంలో ఈ నెల 20వ తేదీన జిల్లా స్థాయి అధికారులతో ఉమ్మడి జిల్లా మంత్రి, రాష్ట్ర ఆబ్కారీ మద్యనిషేధ, పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు సమీక్ష సమావేశం నిర్వహించనున్నందున 20వ తేదీ సోమవారం రోజున జిల్లాలోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం రద్దు చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ కే హరిత ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు, దరఖాస్తుదారులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని తెలిపారు.

## 44వ జాతీయ రహదారిపై బైక్ ను ఢీ కొట్టిన ఆర్టీసీ బస్సు

**- ఒకరికి మృతి, ఒకరికి తీవ్ర గాయాలు**



అలంపూర్ జూలై 18 (విజన్ ఆంధ్ర) : జోగులాంబ గద్వాల జిల్లాలోని 44వ జాతీయ రహదారిపై పంచలింగాల స్టేజి వద్ద ఏపీకి చెందిన ఆర్టీసీ బస్సు బైక్ ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్ పై వెళ్తున్న మహిళ అక్కడికక్కడే మృతి చెందగా, తండ్రికి తీవ్ర గాయాలయ్యాయి.ఈ ప్రమాదం పంచలింగాల స్టేజి వద్ద జరిగింది. మానవపాడు మండలం మద్దూరు గ్రామానికి చెందిన చాకలి రాముడు తన కూతుర్ని అల్లుడి ఇంటి నుంచి తీసుకుని బైక్ పై ఇంటికి వస్తున్నాడు. పంచలింగాల స్టేజి వద్దకు రాగానే ఎదురుగా వస్తున్న ఆంధ్రప్రదేశ్ కు చెందిన ఆర్టీసీ బస్సు వేగంగా వచ్చి బైక్ ను ఢీకొట్టింది.ఈ ఘటనలో చాకలి రాముడి కూతురు అక్కడికక్కడే మృతి చెందింది, తండ్రి చాకలి రాముడికి తీవ్ర గాయాలయ్యాయి.

# రంగారెడ్డి జిల్లాలో ప్రత్యేక లోక్ అదాలత్ విజయవంతం

**-పరస్పర అంగీకారంతో 95 ఎన్ఐ యాక్ట్ కేసులకు పరిష్కారం**

**-రంగారెడ్డి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, ప్రధాన జిల్లా సెషన్స్ జడ్జి ఎ.కర్ణకుమార్**




రంగారెడ్డి జిల్లా బ్యూరో/ఎల్బీనగర్, జూలై 18 (విజన్ ఆంధ్ర): తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ (టీఎస్ఎల్ఎస్ఏ) ఆదేశాల మేరకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, రంగారెడ్డి ఆధ్వర్యంలో శనివారం జిల్లా కోర్టు ప్రాంగణంలో ఎన్ఐ యాక్ట్ (నీగోతిబుల్ ఇన్స్టుమెంట్స్ యాక్ట్) కేసుల పరిష్కారం కోసం ప్రత్యేక లోక్ అదాలత్ విజయవంతంగా నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా 15 ప్రత్యేక బెంచీలు ఏర్పాటు చేసి, ఎన్ఐ యాక్ట్‌కు సంబంధించిన పెండింగ్ కేసులను పరస్పర రాజీ ద్వారా పరిష్కరించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఈ ప్రత్యేక లోక్ అదాలత్‌లో 95 కేసులు రాజీ ద్వారా పరిష్కరించబడ్డాయి. ఈ సందర్భంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఛైర్మన్, ప్రధాన జిల్లా సెషన్స్ జడ్జి ఎ.కర్ణ కుమార్ మాట్లాడుతూ, లోక్ అదాలత్‌లు ప్రజలకు సులభ, వేగవంతమైన, ఉచిత న్యాయ సేవలను అందించే సమర్థవంతమైన వేదికలని అన్నారు. రాజీకి అవకాశం ఉన్న కేసులను లోక్ అదాలత్‌ల ద్వారా పరిష్కరించుకోవడం వల్ల కక్షిదారులకు సమయం, ధనం ఆదా కావడంతో పాటు శాశ్వత పరిష్కారం లభిస్తుందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి పేర్కొన్నారు. ప్రజలు లోక్ అదాలత్‌లను మరింతగా సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి అనూష మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు జిల్లాలో 15 ప్రత్యేక బెంచీలు ఏర్పాటు చేసి, 95ఎన్ఐ యాక్ట్ కేసులను విజయవంతంగా పరిష్కరించామని తెలిపారు. న్యాయస్థానాల్లో పెండింగ్‌లో ఉన్న రాజీకి అవకాశం ఉన్న కేసులను త్వరితగతిన పరిష్కరించేందుకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ నిరంతరం కృషి చేస్తోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయమూర్తులు, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధికారులు, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది, సంబంధిత కక్షిదారులు పాల్గొన్నారు.

# ఎస్సీ, ఎస్టీ సంక్షేమ పథకాలు అర్హులందరికీ చేరేలా చర్యలు తీసుకోవాలి

**-పెండింగ్ నిధుల పూర్తి వివరాలు వెంటనే కమిషన్‌కు సమర్పించాలి**

**-గురుకులాలు, కేజీబీవీలు, మోడల్ పాఠశాలల్లో ఒక్క సీటు కూడా ఖాళీగా ఉండరాదు**

**-ఎస్సీ,ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య**





పెద్దపల్లి జిల్లా ప్రతినిధి జూలై-18(విజన్ ఆంధ్ర) : ఎస్సీ, ఎస్టీ వర్గాల సంక్షేమం, అభివృద్ధి కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేసి, అర్హులైన ప్రతి లబ్ధిదారునికి చేరేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య సూచించారు. శనివారం పెద్దపల్లి సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్ష సమావేశంలో కలెక్టర్ కోయ శ్రీహర్ష, డీసీపీ రాంరెడ్డి, అదనపు కలెక్టర్లు బి. శ్రీరాములు, జె. అరుణ శ్రీతో కలిసి ఆయన వివిధ శాఖల అధికారులతో ఎస్సీ, ఎస్టీ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల అమలుపై సమీక్ష నిర్వహించారు. సమావేశంలో గురుకులాలు, గిరిజన సంక్షేమ విద్యాసంస్థలు, కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయాలు, మోడల్ పాఠశాలల నిర్వహణ, మౌలిక వసతులు, విద్యా ప్రమాణాలపై సమీక్షించారు. బెస్ట్ అవైలబుల్ స్కూల్స్, ఓవర్సీస్ విద్యా పథకం, ఎస్సీ, ఎస్టీ బాధితుల పరిహారం, గురుకులాలకు సంబంధించిన పెండింగ్ నిధుల పూర్తి వివరాలను వెంటనే కమిషన్‌కు సమర్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్లు, ఉపాధి కల్పన కార్యాలయం, వారధి సొసైటీ ద్వారా చేపట్టే ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాల భర్తీలో ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్లను తప్పనిసరిగా అమలు చేయాలని స్పష్టం చేశారు. అలాగే ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ నిరోధక చట్టం కింద నమోదయ్యే కేసుల్లో సత్వర విచారణ చేపట్టి బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ జిల్లాలో ఎస్సీ, ఎస్టీ వర్గాల సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న అన్ని పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తున్నామని, కమిషన్ సూచించిన మేరకు పెండింగ్ నిధుల వివరాలను నిర్ణీత గడువులో సమర్పిస్తామని తెలిపారు. విద్య, ఉపాధి, సంక్షేమం, జీవనోపాధి రంగాల్లో ఎస్సీ, ఎస్టీ వర్గాల సమగ్ర అభివృద్ధికి జిల్లా యంత్రాంగం కట్టుబడి పనిచేస్తుందని పేర్కొన్నారు. ఈ సమావేశంలో తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యులు,కుస్రం నీలాదేవి, రాంబాబు నాయక్, కొంకటి లక్ష్మీనారాయణ, జిల్లా శంకర్, రేణికుంట ప్రవీణ్, ఆర్డీవోలు,బి.గంగయ్య, సురేష్, జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి రవీందర్, ఏసిపి రమేష్ ,వివిధ శాఖల జిల్లా అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

# నీట్-2026 ఫలితాల్లో 'శివాని జూనియర్ కళాశాల' విశ్వరూపం!

**- సాధారణ విద్యార్థులను ర్యాంకర్లుగా తీర్చిదిద్దడమే మా ప్రత్యేకత: కళాశాల యాజమాన్యం**

**- టాప్ మార్కులతో ఘనవిజయం సాధించిన విద్యార్థులు**




హన్మకొండ జిల్లా ప్రతినిధి జులై 18 ( విజన్ ఆంధ్ర )
నేడు విడుదలైన నీట్ ( నీట్ -2026) ఫలితాల్లో హన్మకొండలోని 'శివాని జూనియర్ కళాశాల' విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచి, మరోసారి విజయ దుందుభి మోగించారు. గత కొన్ని సంవత్సరాలుగా కార్పొరేట్ విద్యాసంస్థలకు ధీటుగా ఫలితాలను సాధిస్తూ వస్తున్న ఈ కళాశాల, ఈ ఏడాది కూడా తమ విజయ పరంపరను కొనసాగించింది.

ప్రతిభావంతులైన విద్యార్థులను ర్యాంకర్లుగా తీర్చిదిద్దడం అందరికీ సాధ్యమేనని, కానీ సాధారణ విద్యార్థులను సైతం అత్యుత్తమ ర్యాంకర్లుగా తీర్చిదిద్దడం ఒక్క శివాని కళాశాలకే సాధ్యమని యాజమాన్యం ఈ సందర్భంగా సగర్వంగా ప్రకటించింది.టాప్ మార్కులు సాధించిన విద్యార్థుల వివరాలు: ఈ ఫలితాల్లో కళాశాలకు చెందిన పలువురు విద్యార్థులు టాప్ మార్కులతో దూసుకుపోయారు. వారిలో ముఖ్యులు:

పి. శ్రీవాని 472/720
బి. స్వాతి 465/720
జి. హన్సిక 454/720
బి. వంశీ కృష్ణ 437/720

వీరితో పాటు కళాశాల నుండి సుమారు 12 మంది విద్యార్థులు అత్యుత్తమ మార్కులు (టాప్ మర్క్స్ ) సాధించి తమ ప్రతిభను చాటుకున్నారు.

యాజమాన్యం అభినందనలు:
నీట్-2026 ఫలితాల్లో ఘన విజయం సాధించిన విద్యార్థిని, విద్యార్థులను కళాశాల కరస్పాండెంట్ టి. స్వామి, ప్రిన్సిపల్ జి. సురేందర్ రెడ్డి, మరియు విద్యాసంస్థ డైరెక్టర్లు వి. చంద్రమోహన్, టి. రాజు, నరేష్, ఎ. మురళీధర్, వి. సురేష్, ఎస్. సంతోష్ రెడ్డి గార్లు ప్రత్యేకంగా అభినందించారు. ఈ అద్భుత విజయానికి సహకరించిన కళాశాల అధ్యాపక బృందానికి, విద్యార్థుల తల్లిదండ్రులకు మరియు శ్రేయోభిలాషులకు వారు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలియజేశారు.

# సోనమ్ వాంగ్‌చుక్ నిరాహార దీక్ష భగ్నం అప్రజాస్వామికం

**-ఉద్యమాన్ని అణచివేయాలని చూస్తున్న బిజెపి ప్రభుత్వం**

**-సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్ళపల్లి శ్రీనివాస్ రావు**



హన్మకొండబ్యూరో ఛిఫ్ జూలై 18(విజన్ ఆంధ్ర ) : ప్రజాస్వామ్య పద్ధతిలో నిరసన తెలుపుతున్న సోనమ్ వాంగ్‌చుక్ దీక్షను పోలీసులు బలవంతంగా భగ్నం చేయడాన్ని సీపీఐ తెలంగాణ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్ళపల్లి శ్రీనివాస్ రావు తీవ్రంగా ఖండించారు. ప్రజా సమస్యలపై, విద్యా వ్యవస్థలోని లోపాలపై, మరియు లడఖ్ ప్రజల హక్కుల కోసం శాంతియుతంగా నిరసన తెలుపుతున్న సోనమ్ వాంగ్‌చుక్ పట్ల కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు అప్రజాస్వామికం.ఒక దేశభక్తుడు, మేధావి తన ప్రాణాలను పణంగా పెట్టి పోరాడుతుంటే, వారి డిమాండ్లను పరిష్కరించాల్సింది పోయి, దీక్షను భగ్నం చేయడం ద్వారా ప్రభుత్వం తన నిరంకుశత్వాన్ని చాటుకుందని ఆయన ఆరోపించారు. నీట్ పరీక్షా పేపర్ లీకేజీలు, పరీక్షల నిర్వహణలో వైఫల్యాలకు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని, ఈ విషయంలో ప్రభుత్వం పారదర్శకంగా వ్యవహరించాలని ఆయన డిమాండ్ చేశారు.సోనమ్ వాంగ్‌చుక్ లేవనెత్తిన అంశాలు కేవలం ఆయనవి మాత్రమే కాదని, అవి దేశ భవిష్యత్తుకు సంబంధించినవని పేర్కొంటూ, వాంగ్‌చుక్ పోరాటానికి సీపీఐ సంపూర్ణ మద్దతు తెలుపుతుందని ఆయన స్పష్టం చేశారు. ఢిల్లీ పోలీసులు ఢిల్లీ హైకోర్టు ఆదేశాల వెనుక దాక్కోలేరు. సోనం వాంగ్‌చుక్ ఆరోగ్యాన్ని పర్యవేక్షించాలని మాత్రమే కోర్టు ఆదేశించింది; ఆయన ఇష్టానికి వ్యతిరేకంగా ఆందోళనా స్థలం నుండి బలవంతంగా తరలించమని ఆదేశించలేదు. ఈ పరిణామాలు ప్రభుత్వ ఉద్దేశాలపై తీవ్ర ఆందోళనలను కలిగిస్తున్నాయి. ఢిల్లీ పోలీస్ కమిషనర్‌ను అకస్మాత్తుగా మార్చడం, ఆ తర్వాత శాంతియుత ఉద్యమంపై ఈ అణచివేత, విద్యార్థుల ఉద్యమాన్ని అణచివేయడమే లక్ష్యమని జూలై 20న పార్లమెంటుకు జరగాల్సిన మార్చ్‌ను దెబ్బతీయాలనే ఉద్దేశంతోనే ఈ చర్యలు జరుగుతున్నాయనే అనుమానాలను బలపరిచాయి. శాంతియుత ప్రజాస్వామ్య నిరసనల పట్ల ఇటువంటి నియంతృత్వ పోకడలకు రాజ్యాంగబద్ధమైన ప్రజాస్వామ్యంలో చోటు లేదు. ప్రభుత్వం తన అణచివేత విధానాన్ని తక్షణమే విరమించుకోవాలని, శాంతియుత నిరసనకారులందరి ప్రజాస్వామ్య హక్కులను భద్రతను నిర్ధారించాలని, అలాగే విద్యార్థి ఉద్యమంతో అర్థవంతమైన చర్చలు జరపాలని డిమాండ్ చేస్తున్నాము. దేశ విద్యా వ్యవస్థ అపూర్వమైన రీతిలో కుప్పకూలినందుకు నైతిక బాధ్యత వహిస్తూ, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలనీ డిమాండ్ చేశారు.

# "ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ" కార్యక్రమం

**-అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలి: కేఎల్ఆర్, డీబీఆర్**



ఎల్బీనగర్/సరూర్ నగర్, జూలై 18 (విజన్ ఆంధ్ర): తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న "ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ" (సర్) కార్యక్రమం మహేశ్వరం నియోజకవర్గంలో ముమ్మరంగా కొనసాగుతోంది. ఈ కార్యక్రమంలో భాగంగా శనివారం మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్, మాజీ ఎమ్మెల్యే కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, టీపీసీసీ మెంబర్ దేప భాస్కర్ రెడ్డి హాజరై మాట్లాడుతూ.. గత కొన్ని రోజులుగా నియోజకవర్గంలో జరుగుతున్న 'సర్' కార్యక్రమంలో చురుగ్గా పాల్గొని, విజయవంతం చేస్తున్న బూత్ లెవెల్ ఏజెంట్లు బి ఎల్ ఏ, బి.ఎల్.ఓలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రతి ఒక్కరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, వారికి సహాయపడే విధంగా ప్రత్యేక హెల్ప్ డెస్కులను ప్రారంభించాలని వారు సూచించారు. బి ఎల్ ఎ నాయకులు ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటూ ఓటర్ల నమోదు ప్రక్రియను సులభతరం చేయాలని కోరారు. నియోజకవర్గంలో అర్హులైన ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేసుకోవాలని, ఓటర్ల జాబితాలో తప్పుల సవరణకు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కేఎల్ఆర్, డీబీఆర్ ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తున్న తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం

**- గట్టు మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాలలో పాల్గొన్న**

**- ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి**



గద్వాల జూలై 18 (విజన్ ఆంధ్ర బ్యూరో) : గద్వాల నియోజకవర్గంలోని గట్టు మండల పరిధిలో తుమ్మలపల్లి గ్రామం నందు సిసి రోడ్డు, నూతన వాటర్ బోర్డ్, మహిళా సమైక్య భవనం భూమి పూజ కార్యక్రమం,సిసి రోడ్ నిర్మాణానికి మహిళా సమైక్య భవన నిర్మాణాగలకు భూమి పూజ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి హాజరై ప్రారంభించారు. అనంతరం నూతన వాటర్ బోర్ కు ఎమ్మెల్యే స్విచ్ ఆన్ చేసి నీటిని విడుదల చేయడం జరిగింది. అదేవిధంగా అంతంపల్లి గ్రామం నందు వ్యవసాయ గోదాం నిర్మాణానికి, మహిళా సమైక్య భవన నిర్మాణానికి భూమి పూజ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి హాజరై భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు. ఎమ్మెల్యే కి గ్రామ సర్పంచులు శాలువా కప్పి పుష్పగుచ్ఛం ఇచ్చి ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధి కోసం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయడం జరుగుతుందని తెలిపారు. గ్రామాలలోని మహిళా సంఘాలు సమావేశం చేసుకోవడానికి ఒక భవనం ఉండాలని ప్రభుత్వం ఆలోచించి మహిళల కోసం ప్రత్యేకంగా మహిళా సంఘాలు సమైక్య భవనాన్ని ఏర్పాటు చేయడం జరుగుతుందని, మహిళలు సమావేశం నిర్వహించుకోవడానికి ప్రతి గ్రామంలో 10 లక్షలతో మహిళా సమైక్య భవనాలను ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు.అదేవిధంగా రైతులు పండించిన దాన్యమును నిలువ ఉంచుకోవడానికి వ్యవసాయ గోదాములను ఏర్పాటు చేయడం జరుగుతుందని అన్నారు. భవిష్యత్తులో గ్రామాలను మరింత అభివృద్ధి చేయడానికి నా వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ జంబురామన్ గౌడ, మాజీ ఎంపీపీ విజయ్, సర్పంచులు గోవిందమ్మ, శంకరమ్మ దానయ్య, జిల్లా సీనియర్ నాయకుడు రామకృష్ణారెడ్డి, సింగల్ విండో డైరెక్టర్ మహేశ్వర్ రెడ్డి, మాజీ సర్పంచులు చెన్నారాయుడు, ఆంజనేయులు గౌడ్, నాయకులు రవి, లక్ష్మి రెడ్డి, నరసింహులు, జయరామ్ గౌడ్, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# బాల్య వివాహ రహిత సమాజాన్ని నిర్మిద్దాం

**- జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జ్ జి. కళార్చన**

**- మనజిపేటలో చట్టాలపై ఘనంగా అవగాహన సదస్సు**




వనపర్తి జిల్లా ప్రతినిధి, జులై 18 (విజన్ ఆంధ్ర) : బాల్య వివాహాల రహిత సమాజాన్ని నిర్మిద్దాం అని జిల్లా న్యాయ సేవధికార సంస్థ కార్యదర్శి అన్నారు. జిల్లా న్యాయ సేవధికార సంస్థ ఆధ్వర్యంలో మనజిపేట గ్రామ ప్రజలకు చట్టాలపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కార్యదర్శి మాట్లాడుతూ బాల్యవివాహాలకు సహకరించిన మరియు వివాహానికి హాజరైన చట్ట ప్రకారం శిక్ష అర్హులు అవుతారని తెలియజేశారు. అదేవిధంగా బాల బాలికలకు, వయోవృద్ధులకు, బడుగు బలహీన వర్గాలకు మరియు మహిళలకు ఉచితంగా న్యాయ సేవలు అందిస్తామని తెలియజేశారు. మరియు బాల్య వివాహాల నిర్మూలన చట్టం, బాల కార్మికుల నిర్మూలన చట్టం, మోటార్ వాహనాల చట్టం, సైబర్ క్రైమ్, పోక్సో చట్టం మరియు డ్రగ్ అబ్యూస్ గురించి తెలియజేశారు. అదేవిధంగా నాల్సా వారు చట్టాలపై రూపొందించిన లఘు చిత్రాలను ప్రజలతో కలిసి వీక్షించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జ్ టీ కార్తీక్ రెడ్డి, 1r అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జ్ అశ్విని, లాడ్స్ కౌన్సిల్స్ బాలయ్య, కృష్ణయ్య, శ్రీదేవి, రఘు, సబ్ ఇన్స్పెక్టర్ వెంకటేష్, గ్రామ సర్పంచ్ శ్రీలత, విశ్వనాథం, సీనియర్ అసిస్టెంట్ వెంకటేష్ పాల్గొన్నారు.

# విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన వసతులు కల్పించాలి

**- అదనపు కలెక్టర్ నర్సింగరావు**



అలంపూర్ జూలై 18 (విజన్ ఆంధ్ర బ్యూరో) : విద్యార్థులకు మంచి విద్యతో పాటు, వారు ఆరోగ్యంగా ఉండేలా వ్యక్తిగత పరిశుభ్రత, పాఠశాలను పరిశుభ్రంగా ఉంచేలా చూడాలని జిల్లా అదనపు కలెక్టర్ నర్సింగరావు సూచించారు. శనివారం అయన అలంపూర్ మండల కేంద్రంలోని కెజిబివి విద్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అయన పాఠశాలలో విద్యార్థులకు కల్పిస్తున్న విద్యా, వసతి, భోజన సౌకర్యాలను పరిశీలించారు. తరగతి గదులు, వసతి గృహాలు, వంటశాల, భోజనశాల, పరిశుభ్రత, తాగునీటి సౌకర్యం తదితర అంశాలను పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన వసతులు కల్పించాలని, ఆహార నాణ్యత, పరిశుభ్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండరాదని సంబంధిత అధికారులకు సూచించారు. అలాగే ఈ సందర్భంగా విద్యార్థులకు యూనిఫామ్ లను అందజేశారు. వారితో కలిసి భోజనం చేశారు. ఈ తనిఖీలో పాఠశాల ప్రిన్సిపాల్, సిబ్బంది, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# సేవా కార్యక్రమాలను మరింత విస్తరిస్తాం.

**- ఫాస్ట్ గవర్నర్ హారి నారాయణ భట్టడ్.**




నారాయణపేట , జూలై 18 ( విజన్ ఆంధ్ర) : లైన్స్ క్లబ్ సేవా కార్యక్రమాలను మరింత విస్తరిస్తామని నారాయణపేట ఫాస్ట్ గవర్నర్ హరి నారాయణ భట్టాడ్ అన్నారు. శనివారం లయన్స్ క్లబ్ ఆఫ్ నారాయణపేట 320 ఏ ఆధ్వర్యంలో ఎస్.ఆర్.గార్డెన్‌లో శనివారం నిర్వహించిన 48వ ఇన్‌స్టాలేషన్ నైట్ సర్మనీ కార్యక్రమాన్ని అత్యంత ఘనంగా నిర్వహించుకున్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సేవా భావమే పరమావధి.యొక్క ప్రధాన ఉద్దేశ్యం నూతనంగా ఎన్నికైన అధ్యక్షుడు, కార్యదర్శి, కోశాధికారి బాధ్యతల స్వీకారం, అలాగే కొత్త సభ్యులను లయన్స్ క్లబ్‌లోకి ఆహ్వానించారు. సమాజ సేవకు అంకితభావంతో పనిచేసే లయన్స్ క్లబ్ కుటుంబంలో కొత్త సభ్యులు చేరడం ఎంతో ఆనందదాయకమైన విషయం.ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన లయన్ రవికుమార్ గౌడ్ అధ్యక్షుడిగా, లయన్ మోహన్ కుమార్ కోన కార్యదర్శిగా, లయన్ రాజేష్ పోలేపల్లి కోశాధికారిగా బాధ్యతలు స్వీకరించారు. లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో లయన్ ఎస్. చక్రవర్తి ,లయన్ ఉదయ్ గౌడ్ నూతన సభ్యులుగా లయన్స్ క్లబ్ ఆఫ్ నారాయణపేట 320 ఏ లో అధికారికంగా సభ్యత్వం స్వీకరించారు.ఈ సందర్భంగా నూతన కార్యవర్గం సభ్యులందరికీ అభినందనలు తెలిపారు.వారి నాయకత్వంలో లయన్స్ క్లబ్ ఆఫ్ నారాయణపేట 320 ఏ మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించి సమాజానికి విశేష సేవలు అందించాలని ఆకాంక్షిస్తున్నారు.

# వర్షాభావ పరిస్థితులకు తగ్గట్లు ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలి

**- డాక్టర్ పి.అర్చన, శాస్త్రవేత్త, కోఆర్డినేటర్**

గద్వాల జూలై 18 ( విజన్ ఆంధ్ర బ్యూరో): జిల్లాలో ఎల్‌నినో ప్రభావం కారణంగా సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదవుతున్న నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా ఉండి, వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా వ్యవసాయాన్ని ప్రణాళికాబద్ధంగా చేపట్టాలని డాక్టర్ పి. అర్చన, శాస్త్రవేత్త, కోఆర్డినేటర్ సూచించారు. ఎల్‌నినో ప్రభావం వల్ల రుతుపవనాల రాక ఆలస్యం కావడం, వర్షాలు తగ్గిపోవడం, అధిక ఉష్ణోగ్రతలు నమోదవడం వంటి పరిస్థితులు ఎదురయ్యే అవకాశం ఉన్నందున రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. జిల్లాలో ప్రస్తుతం సుమారు 1,07,082 ఎకరాల్లో పత్తి, 24,840 ఎకరాల్లో సీడ్ పత్తి, 965 ఎకరాల్లో వరి నారుమడులు, 9,066 ఎకరాల్లో కంది, 1,000 ఎకరాల్లో మొక్కజొన్న సాగులో ఉన్నాయని తెలిపారు. సాధారణం కంటే 51 శాతం తక్కువ వర్షపాతం నమోదైన నేపథ్యంలో రైతులు మరింత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వర్షాలు ఆలస్యమైతే జూలై 1631 మధ్య పత్తి, కంది, పెసర, మినుములు, అలసందలు, ఉలవలు, సజ్జలు, రాగులు, పొద్దుతిరుగుడు, ఆముదం, మొక్కజొన్న, తక్కువ కాలంలో పండే కూరగాయలను సాగు చేయాలని, ఆగస్టు 115 మధ్య కంది, అలసందలు, ఉలవలు, ఆముదం, పొద్దుతిరుగుడు, కూరగాయలు, ఆగస్టు 1631 మధ్య నువ్వులు సాగు చేయాలన్నారు. వర్షాలు సమృద్ధిగా కురిసిన తరువాత మాత్రమే విత్తనాలు వేయాలని, నేలలో తగినంత తేమ ఉన్నప్పుడే ఎరువులు వేయాలని తెలిపారు.



అవసరమైన చోట ప్రాణాధార నీటిపారుదల, డ్రిప్, స్ప్రింక్లర్ వంటి సూక్ష్మ సేద్య పద్ధతులను వినియోగించి నీటిని పొదుపుగా ఉపయోగించాలని రైతులకు సూచించారు. దీర్ఘకాలిక పొడి పరిస్థితుల్లో 2 శాతం యూరియా లేదా 1 శాతం పొటాషియం నైట్రేట్ ద్రావణాన్ని 23 సార్లు ఆకులపై పిచికారీ చేయాలన్నారు. వరి సాగులో నీటి పొదుపుకు ప్రత్యామ్నాయ తడపడం ఆరబెట్టడం విధానాన్ని అనుసరించాలని, నారుమడులను శాస్త్రీయ పద్ధతిలో నిర్వహించాలని, మొక్కజొన్నలో ఫాల్ ఆర్మీవార్మ్, పత్తిలో త్రిప్స్, తెల్లదోమ వంటి చీడపీడలను నిరంతరం పర్యవేక్షించి సకాలంలో నియంత్రించాలన్నారు. పంటల ఎంపికలో వ్యవసాయ విశ్వవిద్యాలయం ప్రతి మంగళవారం, శుక్రవారం విడుదల చేసే వాతావరణ ఆధారిత వ్యవసాయ సలహాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. పంటలలో కలుపు నివారణ, నేల తేమ సంరక్షణ, సమగ్ర పోషక యాజమాన్యం, సమగ్ర చీడపీడల నియంత్రణ, అంతర పంటల సాగు వంటి చర్యలు చేపట్టడం ద్వారా వర్షాభావ ప్రభావాన్ని గణనీయంగా తగ్గించవచ్చని పేర్కొన్నారు. రైతులు భారత వాతావరణ శాఖ, వ్యవసాయ శాఖ విడుదల చేసే వాతావరణ సూచనలను ఎప్పటికప్పుడు గమనిస్తూ, వాటికి అనుగుణంగా సాగు నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు. ఎల్‌నినో ప్రభావాన్ని పూర్తిగా నివారించడం సాధ్యం కాకపోయినా, ముందస్తు ప్రణాళిక, సరైన పంటల ఎంపిక, నీటి పొదుపు, తేమ సంరక్షణ, శాస్త్రీయ వ్యవసాయ పద్ధతుల అమలు ద్వారా దిగుబడి నష్టాలను గణనీయంగా తగ్గించవచ్చని తెలిపారు. రైతులు వ్యవసాయ శాఖ అధికారుల సలహాలు, శాస్త్రవేత్తల సూచనలను పాటిస్తూ సుస్థిర వ్యవసాయాన్ని కొనసాగించాలని ఆమె కోరారు.

# 'సీపీ కనెక్ట్' కార్యక్రమాన్ని ప్రారంభించిన సీపీ

సిద్దిపేట జిల్లా ప్రతినిధి జూలై 18 : పోలీస్ సిబ్బందిలో ఉత్తమ సేవలను గుర్తించే సంస్కృతిని పెంపొందించడానికి మరియు వారి మనోధైర్యాన్ని పెంచడానికి సిద్దిపేట పోలీస్ కమిషనర్ రష్మి పెరుమాళ్, ఐపీఎస్, "సీపీ కనెక్ట్ అనే వినూత్న కార్యక్రమాన్ని ప్రారంభించారు. సమాజానికి సేవ చేస్తూ, ప్రాణాలను కాపాడుతూ తమ విధుల్లో అసాధారణమైన అంకితభావాన్ని ప్రదర్శించిన పోలీస్ అధికారులు, సిబ్బందిని వ్యక్తిగతంగా అభినందించడమే ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశ్యం. నేరాల గుర్తింపు, ప్రాణాలను రక్షించడం, కమ్యూనిటీ పోలీసింగ్ మరియు ప్రజల భద్రతను నిర్ధారించడంలో అసాధారణ ప్రతిభ కనబరిచిన వారికి సీపీ వ్యక్తిగతంగా ప్రశంసా పత్రాలను అందజేస్తారు. ప్రతి నెలలోని ప్రతి శనివారం ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం వల్ల సిబ్బందికి తమ విధుల పట్ల మరింత బాధ్యతాయుతమైన భావం, ఉత్సాహం కలగడమే కాకుండా, ఇతరులకు కూడా ఇది ఒక ప్రేరణగా నిలుస్తుంది. ఈ చొరవలో భాగంగా, జూలై 18 శనివారం నాడు పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో నిర్వహించిన 'సీపీ కనెక్ట్' కార్యక్రమంలో సీపీ రష్మి పెరుమాళ్ విధుల్లో అద్భుత ప్రతిభ కనబరిచిన 10 మంది పోలీస్ సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించి, వారికి ప్రశంసా పత్రాలు మరియు ప్రత్యేక గిఫ్ట్ కిట్‌లను అందజేశారు. అనంతరం సీపీ వారితో ముచ్చటించారు. అభినందనలు అందుకున్న సిబ్బంది వివరాలు: రాయ్‌పోల్ పోలీస్ స్టేషన్: నలుగురు వ్యక్తులను ఆత్మహత్య చేసుకోకుండా కాపాడిన కానిస్టేబుళ్లు మల్లేష్ మరియు నిమ్మ ప్రశాంత్ చేరియాల పోలీస్ స్టేషన్: అర్ధరాత్రి హాస్టల్ వదిలి వెళ్లిన ఒక బాలుడిని రక్షించి, సురక్షితంగా హాస్టల్ వార్డెన్‌కు అప్పగించిన కానిస్టేబుళ్లు వెంకటేష్ మరియు మహేష్ గజ్వేల్ పోలీస్ స్టేషన్: అర్ధరాత్రి ఒంటరిగా నడుచుకుంటూ వెళ్తున్న ఒక




మైనర్ బాలికను గుర్తించి, సురక్షితంగా ఆమె తల్లిదండ్రులకు అప్పగించిన కానిస్టేబుళ్లు ఆర్. వెంకటేష్ మరియు జి. సుధాకర్. రాజ్‌గోపాల్‌పేట పోలీస్ స్టేషన్: రాత్రిపూట పెట్రోలింగ్ చేస్తుండగా ₹20,000 విలువైన 75 మీటర్ల దొంగిలించబడిన బోర్‌వెల్ వైరుతో ఉన్న అనుమానితుడిని పట్టుకున్న కానిస్టేబుళ్లు జి. ఆనంద్ మరియు రవిరాజు. నిందితుడు తన దొంగతనాన్ని అంగీకరించాడ చిన్నకోడూరు పోలీస్ స్టేషన్: సీసీటీవీ కెమెరాలను పరిశీలించి దొంగను అరెస్ట్ చేసిన ఎస్ఐ బి. చంద్రమోహన్ మరియు కానిస్టేబుల్ ఆర్. స్వామి. వీరు రెండు ఆటో రిక్షాలు మరియు రెండు స్కూటర్లను విజయవంతంగా స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా సీపీ రష్మి పెరుమాళ్, ఐపీఎస్ గారు మాట్లాడుతూ "ఈ కార్యక్రమం కేవలం అవార్డులు ఇవ్వడం మాత్రమే కాదు; మన సిబ్బంది చేసిన నిష్కపటమైన ప్రయత్నాలను మరియు అసాధారణ సేవలను కొనియాడటం. పోలీస్ శాఖలో అభినందించే సంస్కృతిని ప్రోత్సహించడం వల్ల నాయకత్వానికి మరియు బలగానికి మధ్య బంధం మరింత బలోపేతం అవుతుందన్నారు. ఇది ప్రతి ఒక్కరూ సమాజం కోసం మరింత బాధ్యతతో, ఒక అడుగు ముందుకు వేసి పనిచేయడానికి ప్రేరేపిస్తుంది. మన పోలీస్ బలగమే మన గర్వం మన సమాజమే మన బాధ్యత అని తెలిపారు. ప్రజలకు సమర్థవంతంగా సేవ చేయడానికి 'సీపీ కనెక్ట్' చొరవ ద్వారా మరింత బలమైన, సమైక్య మరియు స్పందించే బృందాన్ని నిర్మించడానికి పోలీస్ శాఖ నిరంతరం కృషి చేస్తుందని కమిషనర్ తెలిపారు. ప్రతి నిజాయితీ గల సేవ అభినందనకు అర్హమైనదేనని, సీపీ కనెక్ట్ ద్వారా ప్రజారోగ్య, ప్రజా రక్షణ సేవల్లో అత్యుత్తమ ప్రమాణాలకు కట్టుబడి ఉండేలా... ఉత్సాహభరితమైన, జవాబుదారీతనం కలిగిన మరియు ప్రజల ఆధారిత పోలీస్ బలగాన్ని నిర్మించడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ (అడ్మిన్) కుశాల్కర్, అడిషనల్ డీసీపీ (ఏఆర్) సుభాష్ చంద్రబోస్, ఇన్‌స్పెక్టర్ కిరణ్, పీసీఆర్ ఇన్‌స్పెక్టర్ మల్లేష్ గౌడ్, ఆర్ఎస్ఐ సాయి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# శిక్షల శాతం పెంచడమే లక్ష్యం!!

- **కోర్టు డ్యూటీ అధికారులు పనితీరు మార్చుకోవాలి**
- **సాక్షులకు ధైర్యం చెప్పండి.. నేరస్థులకు శిక్షలు పడేలా చేయండి**
- **ఉత్తమ ప్రతిభ కనబరిస్తే ప్రోత్సాహకాలు**
- **సమన్లు, వారెంట్ల అమలులో నిర్లక్ష్యం వద్దు**
- **రామగుండం సీపీ అంబర్ కిషోర్ ఝా**



పెద్దపల్లి బ్యూరో చీఫ్, జూలై 18 (విజన్ ఆంధ్ర): రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో కోర్టు డ్యూటీ, కోర్టు లైజనింగ్ పోలీసు అధికారుల పనితీరును మరింత మెరుగుపర్చడంతో పాటు, నేరస్థులకు శిక్షల శాతం పెంపుపై ప్రత్యేక దృష్టి సారించాలని పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా అధికారులను ఆదేశించారు. శనివారం సీపీ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించిన ఉన్నత స్థాయి సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సమన్లు, ఎన్‌బీడబ్ల్యూలు, వారెంట్ల అమలును వేగవంతం చేస్తూ నిర్దేశిత గడువులోగా పనుల నాణ్యతను పెంచాలన్నారు. విధుల నిర్వహణలో తలెత్తే పరిపాలనా, సాంకేతిక సమస్యలను దాచకుండా ఉన్నతాధికారుల దృష్టికి తెస్తే శాఖాపరంగా పూర్తి సహకారం అందిస్తామని, ప్రతి అధికారి తన కార్యాచరణను నిరంతరం స్వయం సమీక్ష చేసుకోవాలని సూచించారు. ముఖ్యంగా సాక్షులను సకాలంలో కోర్టుకు హాజరుపరచడంతో పాటు, వారికి న్యాయ ప్రక్రియపై ముందస్తు అవగాహన కల్పించి, గందరగోళానికి గురికాకుండా ధైర్యంగా, స్పష్టంగా వాంగ్మూలం ఇచ్చేలా మార్గదర్శకత్వం చేయాలని స్పష్టం చేశారు. కేసుల్లో శిక్షలు పడేలా దర్యాప్తు అధికారులు, కోర్టు సిబ్బంది పరస్పర సమన్వయం, సమయపాలన పాటించాలని, అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన అధికారులకు ప్రతి నెల ప్రోత్సాహక బహుమతులు ఉంటాయని ప్రకటించారు. బదిలీపై వెళ్లిన అధికారులు గతంలో దర్యాప్తు చేసిన కేసుల్లో శిక్షలు పడినా కూడా వారికి తగిన గుర్తింపు, పురస్కారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. కమిషనరేట్‌లో శిక్షల శాతాన్ని పెంచడమే ప్రధాన లక్ష్యంగా పెట్టుకుని, బాధ్యతాయుతంగా ప్రజలకు సమర్థవంతమైన న్యాయ సేవలు అందించాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా నిందితులకు శిక్షలు పడడంలో కీలక పాత్ర పోషించిన పలువురు సిబ్బందిని సీపీ శాలువాతో సత్కరించగా, కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ కె.శ్రీనివాస్, ఇన్‌స్పెక్టర్లు అనిల్ కుమార్, బాబురావు, ఎస్ఐ వినీత మరియు కోర్టు లైజనింగ్ అధికారులు పాల్గొన్నారు.

# చరిత్రను తెలుసుకోవడం, వారసత్వ సంపదను పరిరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత

**- 'హెరిటేజ్ ఏ ఎవరీస్టెప్ 2.0 ప్రదర్శనలో పాల్గొన్న వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య**







హన్మకొండబ్యూరో ఛీఫ్ జూలై 18(విజన్ ఆంధ్ర ) : ఖాజాగుడా,మహాలక్ష్మి కోర్టియార్డ్ లో నిర్వహించిన "హెరిటేజ్ ఏ ఎవరీస్టెప్ 2.0 ప్రదర్శనకు వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్లీచ్ ఇండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ప్రదర్శనలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోని చారిత్రక ఆధారాలు, గ్రామాలు, దేవాలయాలు, శాసనాలు, పురాతన కట్టడాలు, పురావస్తు ప్రదేశాలకు సంబంధించిన అరుదైన చారిత్రక విశేషాలను వరంగల్ ఎంపీ డా.కడియం కావ్య పరిశీలించారు.ఈ సందర్భంగా వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ.... మన పూర్వీకులు అందించిన అమూల్యమైన చారిత్రక, సాంస్కృతిక వారసత్వ సంపదను భావితరాలకు చేరవేయడం మనందరి బాధ్యత అని అన్నారు. చరిత్ర గురించి ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని, దానిని అధ్యయనం చేయడం ద్వారా సమాజం తన మూలాలను, సంస్కృతిని మరింత లోతుగా అర్థం చేసుకోగలదని పేర్కొన్నారు. ఇలాంటి కార్యక్రమాలు యువతలో చరిత్ర పట్ల ఆసక్తిని పెంపొందించడంతో పాటు వారసత్వ పరిరక్షణకు ప్రేరణగా నిలుస్తాయని తెలిపారు. ప్లీచ్ ఇండియా ఫౌండేషన్ చేపడుతున్న ప్రెజర్వ్ హెరిటేజ్ ఫర్ పోస్టరిటీ (పి ఎహ్ పి ) కార్యక్రమం ద్వారా మరుగున పడిన ఎన్నో చారిత్రక, పురావస్తు విశేషాలను వెలుగులోకి తీసుకువస్తున్న ఫౌండేషన్ సీఈఓ డాక్టర్ ఈ. శివనాగిరెడ్డి కృషిని ఎంపీ ప్రత్యేకంగా అభినందించారు. విలువైన పురాతన సంపదను గుర్తించి, దాని ప్రాముఖ్యతను ప్రజలకు తెలియజేస్తూ చరిత్ర పరిరక్షణకు విశేష సేవలు అందిస్తున్నందుకు ఆయనను కొనియాడారు. ఈ సందర్భంగా డాక్టర్ ఈ. శివనాగిరెడ్డిని శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో చరిత్రాభిమానులు, పరిశోధకులు, విద్యార్థులు, సాంస్కృతిక రంగ ప్రతినిధులు పాల్గొన్నారు.

# సంచలనం సృష్టించిన మహిళ హత్య కేసును శాస్త్రీయ దర్యాప్తుతో ఛేదించిన కామారెడ్డి టౌన్ పోలీసులు నిందితుడి అరెస్ట్

కామారెడ్డి బ్యూరో జులై 18 (విజన్ఆంధ్ర) : జిల్లా ఎస్పీ యం రాజేష్ చంద్ర, ప్రత్యేక చొరవ డీఎస్పీ పర్యవేక్షణలో కామారెడ్డి పట్టణ ఎస్హెచ్ఓ ఆధ్వర్యంలో రెండు ప్రత్యేక బృందాల కృషితో కేసు ఛేదను ఛేదించారు.సీసీటీవీ ఫుటేజీలు, సాంకేతిక ఆధారాలు, నిరంతర గాలింపుతో నిందితుడి అరెస్ట్ కామారెడ్డి పోలీసు బృందాన్ని అభినందించిన జిల్లా ఎస్పీ కేసు వివరాలు వెల్లడించిన కామారెడ్డి డిఎస్పి మధుసూదన్ దకామారెడ్డి టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన మహిళ హత్య కేసును కామారెడ్డి టౌన్ పోలీసులు శాస్త్రీయ దర్యాప్తు, సాంకేతిక ఆధారాలు నిరంతర గాలింపు చర్యలతో సమర్థవంతంగా ఛేదించి నిందితుడిని అరెస్ట్ చేసి, కేసుకు సంబంధించిన కీలక ఆధారాలను స్వాధీనం చేసుకున్నారు.తేదీ 31.05.2026న పోతారం గ్రామానికి చెందిన నర్సాపురం రాజం తన భార్య నర్సాపురం శ్యామల కనిపించడం లేదని కామారెడ్డి టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. రోజు ఉదయం ఇద్దరూ కూలి పనుల కోసం కామారెడ్డికి రాగా, భర్తకు పని దొరకగా భార్యకు పని దొరకలేదు. దీంతో కూరగాయలు కొనుగోలు చేసి ఇంటికి రావాలని చెప్పి అతను పనికి వెళ్లాడు. సాయంత్రం ఇంటికి చేరుకున్న తర్వాత భార్య ఇంటికి రాకపోవడంతో ఆమె మొబైల్‌కు కాల్ చేయగా స్విచ్ ఆఫ్‌లో ఉండటం గమనించాడు. బంధువులు, పరిచయస్తుల వద్ద వెతికినా ఎటువంటి సమాచారం లభించకపోవడంతో పోలీసులను ఆశ్రయించాడు.ఫిర్యాదు మేరకు కామారెడ్డి టౌన్ పోలీస్ స్టేషన్‌లో మహిళ అదృశ్యమైన కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఈ కేసు ప్రాధాన్యతను దృష్టిలో ఉంచుకొని జిల్లా ఎస్పీ యం రాజేష్ చంద్ర, ప్రత్యేక ఆదేశాల మేరకు, కామారెడ్డి డీఎస్పీ ప్రత్యక్ష పర్యవేక్షణలో, టౌన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బి. నరహరి నేతృత్వంలో రెండు ప్రత్యేక పోలీసు బృందాలను ఏర్పాటు చేసి దర్యాప్తును వేగవంతం చేశారు. మహిళ అదృశ్యమైన వెంటనే జిల్లా వ్యాప్తంగా మరియు సమీప జిల్లాల పోలీస్ స్టేషన్లకు




లుక్ అవుట్ నోటీసులు జారీ చేయడంతో పాటు ప్రజా ప్రదేశాల్లో కూడా నోటీసులు ఏర్పాటు చేసి విస్తృత గాలింపు చర్యలు చేపట్టారు.దర్యాప్తు కొనసాగుతున్న సమయంలో 03.06.2026న గ్రీన్ సిటీ సమీపంలోని రైల్వే ట్రాక్ పక్కన గుర్తు తెలియని మహిళ మృతదేహం ఉన్నట్లు సమాచారం అందింది. ఫిర్యాదుదారుడు కుటుంబ సభ్యులు అక్కడికి వెళ్లి మృతదేహాన్ని శ్యామలగా గుర్తించారు. మృతదేహం పూర్తిగా కుళ్లిపోయి ఉండటంతో పాటు తల భాగంలో తీవ్ర గాయాలు ఉండటాన్ని గుర్తించిన పోలీసులు కేసును హత్యగా నమోదు చేసి అన్ని కోణాల్లో దర్యాప్తును మరింత వేగవంతం చేశారు.దర్యాప్తులో భాగంగా ప్రత్యేక బృందాలు పరిసర ప్రాంతాల్లోని సీసీటీవీ ఫుటేజీలను సేకరించి నిశితంగా విశ్లేషించగా, మృతురాలితో కలిసి తిరుగుతున్న ఒక వ్యక్తిని గుర్తించారు. అనంతరం వివిధ ప్రాంతాల్లో గాలింపు నిర్వహిస్తూ, సాక్షులను విచారిస్తూ, సాంకేతిక ఆధారాలను సేకరిస్తూ నిందితుడి కదలికలను నిరంతరం పర్యవేక్షించారు.ఈ క్రమంలో 17.07.2026న విశ్వసనీయ సమాచారం మేరకు కామారెడ్డి లేబర్ అడ్డా వద్ద అనుమానాస్పదంగా సంచరిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. మొదట తన పేరు మామిడి రాజయ్య అని చెప్పి తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేసినప్పటికీ, పూర్తి వివరాలు ధృవీకరించగా అతని అసలు పేరు పిట్ట నర్సింలు ఏ పిట్టల నర్సింలు, శిరాన్‌పల్లి గ్రామం, నవీపేట్ మండలం, నిజామాబాద్ జిల్లా అని తేలింది.పోలీసుల విచారణలో నిందితుడు నేరాన్ని అంగీకరించాడు. మృతురాలు శ్యామలతో కొంతకాలంగా పరిచయం ఏర్పడి, ఇద్దరూ కలిసి కూలి పనులకు వెళ్లేవారని, ఆమెకు తరచూ డబ్బులు ఇస్తూ ఉండేవాడినని తెలిపాడు. అనంతరం ఆమె మరొక వ్యక్తితో సన్నిహితంగా ఉండడాన్ని చూసి అసూయ పెంచుకుని 08.04.2026న గ్రీన్ సిటీ సమీపంలోని రైల్వే ట్రాక్ పక్కన ఉన్న పొదల్లోకి తీసుకెళ్లి, మద్యం సేవించిన అనంతరం వాగ్వాదం జరగడంతో రాయితో తలపై బలంగా కొట్టి హత్య చేసినట్లు ఒప్పుకున్నాడు. అనంతరం ఆమె మొబైల్ ఫోన్ తీసుకొని రైల్వే స్టేషన్‌కు వెళ్లి, రక్తపు మరకలు పడిన బట్టలను మార్చి సంచిలో దాచిపెట్టి, మృతురాలి మొబైల్ ఫోన్‌ను రూ.200లకు గుర్తు తెలియని వ్యక్తికి విక్రయించి ఆ డబ్బుతో మద్యం కొనుగోలు చేసినట్లు వెల్లడించాడు.

# గడల పల్లి చింతపల్లి లో సమగ్ర భూ సర్వే అవగాహన సదస్సు.

**- సర్వేకు రైతులు సహకరించాలి' మార్కెట్ కమిటీ డైరెక్టర్ రామచందర్..**



ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి జులై.18 .(విజన్ ఆంధ్ర) : కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా తిర్యాణి మండలంలో తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన సమగ్ర భూ సర్వేపై అవగాహన కల్పించేందుకు శనివారం మండలంలో గడలపల్లి, చింతపల్లి గ్రామపంచాయతీలలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఆసిఫాబాద్ మార్కెట్ కమిటీ డైరెక్టర్. నైతం రామచందర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ సమగ్ర భూ సర్వే ద్వారా భూముల హద్దులు ఖచ్చితంగా నిర్ధారించడం, ప్రభుత్వ రికార్డులను పారదర్శకంగా రూపొందించడం, భూ వివాదాలను తగ్గించడం లక్ష్యమని తెలిపారు. తెలంగాణ సరిహద్దుల చట్టం1923లోని సెక్షన్ 1, సెక్షన్ 6(1) ప్రకారం గ్రామాల్లో భూముల సరిహద్దుల గుర్తింపు, హద్దుల నిర్ధారణ చట్టబద్ధంగా చేపడుతున్నామని వివరించారు.రైతులు, భూ యజమానులు సర్వే సిబ్బందికి పూర్తి సహకారం అందించాలని కోరారు.ముఖ్య అతిథి మార్కెట్ డైరెక్టర్ రామచంద్ర మాట్లాడుతూ ఈ సర్వే రైతులకు భవిష్యత్తులో ఎంతో ఉపయోగకరమని, భూ హక్కుల పరిరక్షణకు కీలకమని అన్నారు. ఎలాంటి అపోహలకు గురికాకుండా అధికారులకు సహకరించి సర్వేను విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఆత్రం శంకరమ్మ, పిఎసిఎస్ చైర్మన్ చుంచు శ్రీనివాస్ ఎమ్మార్వో శ్రీనివాస్, ఎంపీడీవో నాగేష్ జిల్లా సర్ మేడి మోతిరం రాజ్ గోండు సేవ సమితి జిల్లా ప్రధాన కార్యదర్శిమడావి గుణవంత్ రావు తదితరులు పాల్గొన్నారు.

# విద్యాశాఖ సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించిన జిల్లా కలెక్టర్ హైమావతి

సిద్దిపేట జిల్లా ప్రతినిధి18 జులై : సిద్దిపేట జిల్లాసమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలోని సమావేశ మందిరంలో పాఠశాలలో విద్యార్థుల ప్రవేశాలు, విబి-జి రామ్ జి, గ్రామ సమగ్ర అభివృద్ధి ప్రణాళిక కార్యక్రమ గూర్చి మండల ప్రత్యేక అధికారులు, ఎంపీడీఓలు, ఎంపీఓ లు, ఏంఈఓ లు ఇతర శాఖల అధికారులందరితో జిల్లా కలెక్టర్ కె హైమావతి సమావేశంనిర్వహించారు

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ...

జిల్లా విద్యా శాఖ..

రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకొని నిరుపేదలను విద్యావంతులను చేయడానికి ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడానికి అత్యధిక నిధులను కేటాయిస్తూ ఆయా విద్యాసంస్థలను అన్నిరకాలసదుపాయాలు కల్పిస్తుంది. దీంతోపాటు అతి త్వరలో ప్రభుత్వ పాఠశాలలో అల్పాహార పథకంకూడాప్రవేశపెట్టిందని తెలిపారు.



మధ్యాహ్న భోజనం సైతం మెను పాటిస్తూ రుచికరంగా వండి విద్యార్థులకు పెట్టించాలనిఆదేశించారు జిల్లాలో ప్రభుత్వ పాఠశాల, ఆదర్శ పాఠశాల, కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాల్లో జూలై 31 లోపు ఇచ్చిన టార్గెట్ ప్రకారం విద్యార్థుల ప్రవేశాలు జరపాలని విద్యాశాఖ అధికారులను ఆదేశించారు.యు డైస్ ఎంట్రి పెండింగ్ ఉన్నాయని ఎంఈఓ తెలపగా ప్రక్రియ పూర్తి చేసి అడ్మిషన్ లు యుద్ధప్రాతిపదకన చేయాలని ఆదేశించారు. రాయడం, చదవడం పిల్లలకు ప్రైమరీ స్కూల్ నుండి నేర్పించాలని ఆదేశించారు. మండల ప్రత్యేక అధికారులు, ఎంపిడిఓ, ఏంఈఓ లు మీ మండలంలో ఆశించిన స్థాయిలో పురోగతి లేని పాఠశాలను తరచూ పర్యవేక్షణ చేస్తూ వాటిని అభివృద్ధి చెయ్యాలని ఆదేశించారు.

జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ...

విబి-జి రామ్ జి లో జిల్లాలోని అన్ని గ్రామాల్లో చిన్న, సన్నకారు రైతులు వ్యవసాయ క్షేత్రాలలో ఫామ్పొండ్స్విoచుకునేలాచర్యలుతీసుకోవాలని, నీటి ప్రవాహం ఉన్న కాలువలలో మత్తడి నిర్మాణం, బోర్ వెల్ రీచార్జ్ స్ట్రక్చర్, ఇంకుడు గుంతలు,ఇంకుడుగుంతలు, ఉమ్మడి ప్రజా పారిశుద్య సౌకర్యం ఆయా మండలంలో ప్రభుత్వ భవనాలు, గ్రామ మహిళా సంఘా భావనల వద్ద నిర్మించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

జిల్లా పంచాయతీ శాఖ..

గ్రామ సమగ్ర అభివృద్ధి ప్రణాళిక కార్యక్రమాలు సక్రమంగా అమలు చెయ్యాలనిసూచించారు. డ్రై డే యాక్టివిటీస్, ప్రతి ఇంట్లో నీటినిలువలు ఉండకుండా చూడాలని, గ్రామాల్లో పరిశుభ్రత పాటించాలని, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి. 15వ ఆర్థిక సంఘం నిధులు ప్రాధాన్యత పనులకు వినియోగించుకోవాలి. తాగునీటికి ఎక్కడ కూడా ప్రజలకు ఇబ్బందులు రాకుండా చూసుకోవాలని మిషన్ భగీరథ కొత్త కనెక్షన్ మరియు మైనర్ రిపేర్లు వస్తె వెంటనే పరిష్కరించి ప్రజలకు తాగునీరు అందించాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో సమగ్ర అభివృద్ధి ప్రణాళిక జిల్లా ప్రత్యేక అధికారి ఉమారాణి, జెడ్పి సీఈఓ రమేష్, డిఆర్డిఓ జయదేవ్ ఆర్య, డిపిఓ రవీందర్, మిషన్ భగీరథ ఎస్సీ వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మహిళల అభ్యున్నతే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

**- -రైజ్ హర్2026 మహిళా సాధికారత సదస్సులో పాల్గొన్న ఎంపీ డా.కడియం కావ్య**

హన్మకొండ బ్యూరోచిఫ్ జూలై 18(విజన్ఆంధ్ర ) : మహిళల సాధికారత, ఆర్థిక స్వావలంబనకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య అన్నారు. హైదరాబాద్, రెడ్ హిల్స్ లో తెలంగాణ ఎస్సీ/ఎస్టీ ఇండస్ట్రియల్ చాంబర్ ఆఫ్ కామర్స్ (టీఎస్ఐసీసీ) ఆధ్వర్యంలో నిర్వహించిన రైజ్ హర్26 మహిళా సాధికారత సదస్సు కార్యక్రమానికి వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సమావేశంలో వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ.... మహిళల సంక్షేమం, సాధికారత, ఆర్థిక స్వావలంబనకు తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. మహిళలు ఎల్లప్పుడూ పాజిటివ్ ఎనర్జీతో ముందుకు సాగాలని, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ గారి "పే బ్యాక్ టూ సొసైటీని ప్రతి ఒక్కరిని అలవర్చుకోవాలని సూచించారు. రాజ్యాంగం కల్పించిన హక్కులను పరిరక్షిస్తూ జాతీయ గౌరవాన్ని పెంపొందించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. మహిళలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించి అన్ని రంగాల్లో సమాన అవకాశాలు అందించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సెల్ఫ్ హెల్ప్ గ్రూపులను మరింత



బలోపేతం చేస్తూ మహిళల్లో పొదుపు, స్వయం ఉపాధి, పారిశ్రామికాభివృద్ధిని ప్రోత్సహిస్తోందని స్పష్టం చేశారు. ప్రతి ఒక్కరు జీవితాంతం నిత్య విద్యార్థులుగా నేర్చుకుంటూ ముందుకు సాగాలని, ముఖ్యంగా ఎస్సీ మహిళలు విద్య, ఉద్యోగం, వ్యాపారం, నాయకత్వ రంగాల్లో మరింత ముందుకు వచ్చి సమాజ అభివృద్ధిలో కీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. మహిళలు ఆత్మవిశ్వాసంతో తమ ప్రతిభను చాటుకుని, అందుబాటులో ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకుంటే కుటుంబం, సమాజం, రాష్ట్రం మరింత అభివృద్ధి చెందుతుందని ఎంపీ డాక్టర్ కడియం కావ్య అన్నారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ ఇండస్ట్రియల్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ (టీజీఐఐసి ) చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి, ఇండస్ట్రియల్ కామర్స్ డిపార్ట్మెంట్ అడిషనల్ డైరెక్టర్ శ్రీనివాస్ నాయక్,పి ఎం ఈ జి పి రవి, ఎస్ బి ఐ లీడ్ డిస్టిక్ మేనేజర్ మూర్తి,వి హబ్ డైరెక్టర్ జావేద్ అక్తర్ షేక్ , ప్రెసిడెంట్ నల్ల బాబు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు తమ భవిష్యత్తును బంగారు మయంగా మలచుకోవాలి...

**- జిల్లా కలెక్టర్ కె.హరిత**




అసిఫాబాద్ జిల్లా ప్రతినిధి జూలై 18,(విజన్ ఆంధ్ర) : విద్యార్థులు నైపుణ్య అభివృద్ధి ద్వారా తమ భవిష్యత్తును బంగారు మయంగా మలచుకోవాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. శనివారం జిల్లాలోని కాగజ్ నగర్ పట్టణంలో గల ఎస్.పి. క్లబ్ లో 10వ తరగతి, ఇంటర్మీడియట్ లో ఎంపిక చేసుకోవలసిన కోర్సులు, ఉన్నత విద్య అవకాశాలపై విద్యార్థులకు నిర్వహించిన అవగాహన సదస్సుకు విశ్రాంత వాణిజ్య పన్నుల సంయుక్త కమిషనర్ అనురాధ, కాగజ్ నగర్ రాజస్వ మండల అధికారి చెన్నూరి కృష్ణయ్య, కెరీర్ మిత్ర ఫౌండేషన్ సభ్యులతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ 10వ తరగతి అనంతరం ఇంటర్మీడియట్ లో ఎన్నో ఉపాధి అవకాశాలు కల్పించే కోర్సులను ప్రభుత్వం ప్రవేశపెట్టిందని, ఆయా కోర్సులలో చేరడం ద్వారా ఉపాధి అవకాశాలు లభిస్తాయని తెలిపారు. ప్రస్తుతం ప్రభుత్వ రంగ సంస్థలు, ప్రైవేట్ రంగ సంస్థలలో అనేక ఉపాధి అవకాశాలు ఉన్నాయని, మనలో ఉన్న నైపుణ్యతను మెరుగు పరచుకోవడం ద్వారా ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవచ్చని తెలిపారు. ఎక్కడికో దూర ప్రాంతానికి వెళ్లవలసిన అవసరం లేదని, మన ప్రాంతంలో ఉపాధి అవకాశాలను మెరుగు పరచుకోవచ్చని తెలిపారు. కెరీర్ మిత్ర ఫౌండేషన్ వారు అందించే శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని, కెరీర్ గైడెన్స్ లెటిస్ ప్రభుత్వ ఉద్యోగ అవకాశాలు, నైపుణ్య అభివృద్ధి వంటి వాటిని శిక్షణ ఇవ్వడం జరుగుతుందని, ఉపాధి అవకాశాలు కల్పించే కోర్సులను ఎంపిక చేసుకోవాలని తెలిపారు. ఒకచోట ఆగిపోకుండా నిత్యం ప్రయత్నించాలని, తద్వారా లక్ష్యసాధన సులభతరం అవుతుందని తెలిపారు. అనంతరం విద్యార్థులకు నైపుణ్యతకు సంబంధించిన పుస్తకాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ నరసింహస్వామి, ఫౌండేషన్ సభ్యులు వంశీకృష్ణ, పళ్ళ విజయ్ కుమార్, మెరుగు శ్రీకాంత్, మణికుమార్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# స్పోర్ట్స్ అకాడమీల్లో ప్రవేశాల కోసం ఎంపికలు

**- జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి డాక్టర్ ఓలేటి జ్యోతి.**



మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి జూలై18( విజన్ ఆంధ్ర): తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో 2026-2027 విద్యా సంవత్సరానికి ప్రాంతీయ క్రీడా వసతి గృహాలు పలు స్పోర్ట్స్ అకాడమీల్లో ప్రవేశాల కోసం బాలురు, బాలికల ఎంపికలు నిర్వహించినట్లు జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి డాక్టర్ ఓలేటి జ్యోతి నేడు ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు స్పోర్ట్స్ సర్టిఫికెట్లు, జనన ధ్రువీకరణ పత్రం, 10 పాస్పోర్ట్ సైజ్ ఫోటోలు స్టడీ సర్టిఫికెట్లు ఆధార్ కార్డు లేదా ఏదైనా ధృవీకరణ పత్రం అన్ని ఒరిజినల్, జిరాక్స్ కాపీలను వెంట తీసుకొని వెళ్లాలని సూచించారు. క్రీడా విభాగాల వివరాలు వాలీబాల్ అకాడమీ సిద్దిపేట బాలురు / బాలికలు ఈ నెల 22, 23 తేదీల్లో ఎంపికలు జరుగుతాయని, విద్యార్థులు తేదీ 30-6-2010 నుంచి 1-7-2012 మధ్య జన్మించి ఉండాలని రాజన్న సిరిసిల్ల జిల్లా వాలీబాల్ అకాడమీలో 22, 23 తేదీల్లో సైక్లింగ్, హైదరాబాద్ ఓయూ క్యాంపస్ రెజ్లింగ్ అకాడమీలో 22, 23 తేదీల్లో ఖమ్మం సర్దార్ పటేల్ స్టేడియం లో అథ్లెటిక్స్ 21వ తేదిన బాలుర విభాగంలో ఎంపికలు జరుగుతాయని, మహబూబ్ నగర్ వాలీబాల్ అకాడమీ కబడ్డీ 25, 26 తేదీల్లో వాలీబాల్ అకాడమీ సరూర్ నగర్ ఇండోర్ స్టేడియంలో 20, 21 తేదీల్లో రీజినల్ స్పోర్ట్స్ హాస్టల్ హనుమకొండ జె.ఎన్. ఎస్ స్టేడియం 27, 28 తేదీల్లో జిమ్నాస్టిక్స్ స్విమ్మింగ్, హ్యాండ్ బాల్ అథ్లటిక్స్ రెజ్లింగ్, గచ్చిబౌలి హాకీ అకాడమీ స్పోర్ట్స్ కాంప్లెక్స్ లో 20, 21 తేదీల్లో ఎంపికలు జరుగుతాయని, హైదరాబాద్ ఎల్బీ స్టేడియం హ్యాండ్ బాల్ అకాడమీలో 20, 21 తేదీల్లో ఎంపికలు జరుగుతాయని అర్హత కలిగిన క్రీడాకారులు తమ వయసు ధ్రువీకరణ పత్రాలతో ఇతర పత్రాలతో కేంద్రాలకు సంబంధిత తేదీలలో ఉదయం 8 గంటలకు హాజరుకావాలని సూచించారు. పూర్తి వివరాలకు 9440630681 జిల్లా యువజన క్రీడా శాఖ అధికారిని సంప్రదించగలరని అన్నారు.

# వర్షాకాలంలో నీటి నిల్వ సమస్యల నివారణకు క్షేత్రస్థాయిలో పరిశీలించిన సైబరాబాద్ సీపీ

శేరిలింగంపల్లి. జూలై 18: (విజన్ ఆంధ్ర) : వర్షాకాలంలో ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా, ట్రాఫిక్ అంతరాయం లేకుండా ఉండేలా చర్యలు చేపట్టేందుకు సైబరాబాద్ సీపీ డా ఎం. రమేష్ జాయింట్ సీపీ (ట్రాఫిక్) సన్‌ప్రీత్ సింగ్ శేరిలింగంపల్లి మరియు కూకట్‌పల్లి జోన్ల జోనల్ కమిషనర్లు, ఇరు జోన్లకు చెందిన సంబంధిత ఇంజినీర్లు, డీసీపీ ట్రాఫిక్, ఏడీసీపీ ట్రాఫిక్ తో పాటు ఇతర సంబంధిత అధికారులు కలిసి ఎలక్షన్ బిల్డింగ్ మరియు పిస్తా హౌస్ పరిసర ప్రాంతాల్లో నీరు నిలిచే ప్రాంతాలను శనివారం క్షేత్రస్థాయిలో సందర్శించి సమగ్రంగా పరిశీలించారు. ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా ఆయా ప్రాంతాల్లో నీరు నిల్వ కావడానికి గల కారణాలను అధికారులు పరిశీలించారు. వర్షపు నీరు వేగంగా వెళ్లేలా డ్రైనేజ్ వ్యవస్థ సామర్థ్యాన్ని పెంచడం, బాటిల్‌నెక్ పాయింట్లను తొలగించడం, కల్వర్టులు మరియు స్టార్మ్ వాటర్ డ్రైన్లను విస్తరించడం, సిల్ట్ మరియు చెత్తను పూర్తిగా తొలగించడం, అవసరమైన చోట్ల అదనపు డ్రైనేజ్ లైన్లను ఏర్పాటు చేయడం వంటి తక్షణ మరియు దీర్ఘకాలిక చర్యలపై సంబంధిత అధికారులతో విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ,లి వర్షాకాలంలో ట్రాఫిక్‌కు ఎలాంటి అంతరాయం కలగకుండా ముందస్తు ప్రణాళికతో పనిచేయాలని అధికారులను ఆదేశించారు. నీరు నిలిచే ప్రాంతాల్లో అత్యవసర స్పందన బృందాలు, మోటార్ పంపులు, అవసరమైన యంత్రాలు మరియు



సిబ్బందిని ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంచాలని సూచించారు. అదేవిధంగా జీహెచ్ఎంసీ, ట్రాఫిక్ పోలీస్, ఇరిగేషన్ మరియు ఇతర సంబంధిత శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేసి నీటి నిల్వ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేలా కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, వర్షపు రోజులలో ట్రాఫిక్ సాఫీగా కొనసాగేలా అవసరమైన అన్ని చర్యలను వేగవంతంగా అమలు చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ప్రజల భద్రత, సౌకర్యం మరియు నిరంతర ట్రాఫిక్ నిర్వహణకు సైబరాబాద్ పోలీసులు అన్ని శాఖలతో సమన్వయంగా పనిచేస్తూ వర్షాకాల సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు కట్టుబడి ఉన్నామని అధికారులు తెలిపారు.

# 20వ తేదీ నాటి ప్రజావాణి కార్యక్రమం రద్దు



నిజామాబాద్, జూలై 18 :( విజన్ ఆంధ్ర ) ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం ప్రతి సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని ప్రధాన సమావేశ మందిరంలో నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమాన్ని తాత్కాలికంగా రద్దు వేయడం జరిగిందని కలెక్టర్ ఇలా త్రిపాఠి ఒక ప్రకటనలో తెలిపారు. కీలక అంశాలపై ఉమ్మడి జిల్లా సమీక్షా సమావేశం ఉండడంతో ఈ నెల 20న జరగాల్సిన ప్రజావాణిని రద్దు చేశామని అన్నారు. ఈ నెల 27వ తేదీ నుంచి తిరిగి యధావిధిగా ప్రతి సోమవారం ప్రజావాణి కొనసాగుతుందని తెలిపారు.

# ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి శ్రీరమ్య ఇండస్ట్రీస్ అధినేత బండ్ల రాజశేఖర్ రెడ్డి ఉదారత

**- అభినందించిన ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి**



గద్వాల జూలై 18 ( విజన్ ఆంధ్ర బ్యూరో) : గద్వాల పట్టణంలోని ప్రభుత్వ అభ్యసన ఉన్నత పాఠశాల అభివృద్ధికి, విద్యార్థుల సౌకర్యార్థం డిజిటల్ క్లాస్ రూమ్ ఏర్పాటుకు, స్వచ్ఛమైన త్రాగునీటి అవసరాల కోసం శ్రీరమ్య ఇండస్ట్రీస్ అధినేత, సీనియర్ నాయకులు బండ్ల రాజశేఖర్ రెడ్డి సహాయ సహకారాలు అందిస్తానని ప్రకటించి గొప్ప ఉదారతను చాటుకున్నారు. శనివారం గద్వాల పట్టణంలోని ప్రభుత్వ అభ్యసన ఉన్నత పాఠశాలలో నూతనంగా నిర్మించిన అదనపు గదులు, సైన్స్ ల్యాబ్ ప్రారంభోత్సవ సమావేశంలో ప్రభుత్వ పాఠశాలలో త్రాగు నీటి సమస్య ఉందని, అలాగే డిజిటల్ క్లాస్ రూమ్ ఏర్పాటు చేయాలని విద్యార్థులు గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. పాఠశాలలోని విద్యార్థుల విద్యా ప్రమాణాలను పెంచేందుకు ఆధునిక ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్ డిజిటల్ క్లాస్ రూమ్ సౌకర్యాన్ని, అలాగే విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణ కోసం ఆర్వో ప్లాంట్ త్రాగునీటి వసతిని కల్పించడానికి బండ్ల రాజశేఖర్ రెడ్డి ముందుకు రావడంతో గద్వాల్ ఎమ్మెల్యే ఆయనను అభినందించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి డిజిటల్ విద్యా వసతులను కల్పించేందుకు, మౌలిక వసతుల కల్పనలో భాగస్వాములైన శ్రీరమ్య ఇండస్ట్రీస్ అధినేత బండ్ల రాజశేఖర్ రెడ్డి సేవా నిరతి ఎంతో అభినందనీయ మన్నారు. దాతల సహకారంతో ప్రభుత్వ పాఠశాలలను మరింత బలోపేతం చేయవచ్చని ఆయన పేర్కొన్నారు. పాఠశాల అభివృద్ధికి అండగా నిలిచిన బండ్ల రాజశేఖర్ రెడ్డి కి పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు, తల్లిదండ్రులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

# భూ వివాదాల పరిష్కారానికే సమగ్ర రీ-సర్వే

**- కిష్టగిరి గ్రామసభలో అదనపు కలెక్టర్ వినోద్ కుమార్**

**- భారీగా హాజరైన రైతులు, ప్రజలు**

వనపర్తి జిల్లా ప్రతినిధి, జులై 18 (విజన్ ఆంధ్ర) : దశాబ్దాలుగా నలుగుతున్న భూ సమస్యలకు, హద్దుల వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపేందుకే ప్రభుత్వం అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రీ-సర్వేను ప్రతిష్టాత్మకంగా చేపట్టిందని అదనపు కలెక్టర్ రెవెన్యూ వినోద్ కుమార్ పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన "భూ భారతి" భూముల సమగ్ర రీ-సర్వే కార్యక్రమం పై రైతులకు, ప్రజలకు అవగాహన కల్పించేందుకు వనపర్తి మండలం కిష్టగిరి గ్రామంలో శనివారం ఒక ప్రత్యేక గ్రామసభ (అవగాహన సదస్సు) నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వనపర్తి జిల్లా అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ) వినోద్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ మాట్లాడుతూ.. దశాబ్దాలుగా నలుగుతున్న భూ సమస్యలకు, హద్దుల వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపేందుకే ప్రభుత్వం అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో (రోవర్స్, డీజీపీఎస్ విధానం ద్వారా) ఈ రీ-సర్వేను ప్రతిష్టాత్మకంగా చేపట్టిందని వివరించారు. ప్రతి అంగుళం భూమికి కచ్చితమైన హద్దులు నిర్ణయించి, వివాదరహిత భూ రికార్డులను రూపొందించడమే దీని ముఖ్య ఉద్దేశమని ఆయన



తెలిపారు. రైతులందరూ క్షేత్రస్థాయికి వచ్చే సర్వే బృందాలకు సహకరించి, తమ భూములకు సంబంధించిన సరైన వివరాలను అందించి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. సదస్సులో పాల్గొన్న ఉన్నతాధికారులు రీ-సర్వే ప్రక్రియ, రికార్డుల నమోదు, తదుపరి కేటాయించే 'భూధార్' ఐడీ కార్డుల ప్రాధాన్యత గురించి గ్రామ ప్రజలకు క్షుణ్ణంగా వివరించారు. గ్రామంలోని రైతులు అడిగిన పలు అనుమానాలకు అధికారులు వేదికపైనే నివృత్తి చేశారు. ఈ అవగాహన సదస్సులో సహాయ సంచాలకులు ఏ డి ఎస్ ఎల్ ఆర్ శ్రీనివాసులు, వనపర్తి ఆర్డీఓ సుబ్రహ్మణ్యం, వనపర్తి తహసీల్దార్ రమేష్ రెడ్డి, వనపర్తి ఎంపీడీఓ (ఎంపీడీఓ), మండల పరిషత్ అధికారి (ఎంపీఓ), కిష్టగిరి గ్రామ సర్పంచ్, గ్రామ రెవెన్యూ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు (గ్రామ స్థాయి అధికారులు) మరియు పెద్ద సంఖ్యలో స్థానిక రైతులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# స్పెషల్ బ్రాంచ్ సమాచారమే జిల్లా భద్రతకు బలమైన కవచం

**- సమీక్షా సమావేశంలో ఎస్పీ సునిత రెడ్డి**

**- సమాచార సేకరణలో అప్రమత్తతతో నేర నియంత్రణకు సమర్ధవంతమైన తోడ్పాటు**

**- పాస్‌పోర్ట్, ఉద్యోగ వెరిఫికేషన్లు ప్రజలకు వేగవంతమైన, పారదర్శక సేవలు**

**- సమన్వయం, క్రమశిక్షణ, సేవాభావంతో మరింత సమర్థవంతంగా పనిచేయాలి**

వనపర్తి జిల్లా ప్రతినిధి జులై 18 (విజన్ ఆంధ్ర) : స్పెషల్ బ్రాంచ్ విభాగం జిల్లా పోలీస్ వ్యవస్థలో కీలక పాత్ర పోషిస్తోందని, క్షేత్రస్థాయిలో సిబ్బందికి సమాచారం అందించి నేర నియంత్రణకు తోడ్పడుతోందని జిల్లా ఎస్పీ సునిత రెడ్డి అన్నారు.బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో స్పెషల్ బ్రాంచ్ అధికారులు, సిబ్బందితో ఆమె ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు. స్పెషల్ బ్రాంచ్ పనితీరును ప్రశంసిస్తూ మరింత సమర్ధంగా పనిచేసి ప్రజలకు వేగవంతమైన సేవలు అందించాలని సూచించారు. ఎస్పీ సూచనలు : స్పెషల్ బ్రాంచ్ అందించే సమాచారంతోనే నేరాలను ముందుగానే అడ్డుకోవడం సాధ్యమవుతుంది. అప్రమత్తతతో సమాచార సేకరణ చేయాలి. పాస్‌పోర్ట్ వెరిఫికేషన్, ఉద్యోగ వెరిఫికేషన్లు, పోలీస్ క్లియరెన్స్ సర్టిఫికెట్ల జారీలో పారదర్శకత, వేగం ఉండాలి.సమన్వయం, క్రమశిక్షణ, సేవాభావంతో పనిచేయడం ద్వారా పోలీసు శాఖపై ప్రజల నమ్మకం పెరుగుతుంది. ప్రతి పనిని నిర్ణీత సమయంలో పూర్తి చేయాలి.అజిల్లా భద్రతా వ్యవస్థలో స్పెషల్ బ్రాంచ్ కీలక స్తంభమని ఎస్పీ కొనియాడారు. ఈ సమావేశంలో స్పెషల్ బ్రాంచ్ సీఐ నరేష్, ఎస్సైలు మంజునాథ్ రెడ్డి, నరేష్, పర్వతాలులితో పాటు స్పెషల్ బ్రాంచ్ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రతి కేసులో నిందితులకు శిక్ష పడేలా కృషి చేయాలి

**- జిల్లా ఎస్పీ సునిత రెడ్డి**

వనపర్తి జిల్లా ప్రతినిధి జులై 18 (విజన్ ఆంధ్ర) : కోర్టు కేసుల్లో నిందితులకు శిక్షలు పడేలా చూడడమే పోలీసు శాఖపై ప్రజల నమ్మకాన్ని పెంచుతుందని జిల్లా ఎస్పీ సునిత రెడ్డి అన్నారు. శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో కోర్ట్ లైజన్, కోర్టు డ్యూటీ కానిస్టేబుళ్లతో ఆమె సమావేశం నిర్వహించారు. కోర్టు కేసుల్లో శిక్షల శాతం పెంచడం, పెండింగ్ కేసులను వేగంగా పరిష్కరించడం, నిందితులకు చట్టపరమైన శిక్షలు ఖచ్చితంగా పడేలా చర్యలు



తీసుకోవాలని దిశా నిర్దేశం చేశారు.

ఎస్పీ సూచనలు:

FIR నమోదు నుంచి కేసు పూర్తయ్యే వరకు రుజువులు, పత్రాలు, సాక్షుల వాంగ్మూలాన్ని కోర్టుకు సకాలంలో సమర్పించాలి. సాక్షులు, బాధితులను సమయానికి కోర్టుకు హాజరు పరచాలి. వారికి కేసు వివరాలపై అవగాహన కల్పించాలి. కోర్టు, ప్రాసిక్యూషన్ సమాచారాన్ని ఎప్పటికప్పుడు సంబంధిత ఎస్ఐలకు అందించాలి. పెండింగ్‌లో ఉన్న నాన్ బెయిలబుల్ వారెంట్లు, సమన్లను వెంటనే అమలు చేసి నిందితులను కోర్టులో హాజరు పరచాలి. కేసులు పెండింగ్ లేకుండా చూసుకోవడం ద్వారానే నేరాల నియంత్రణ సాధ్యం. కోర్టు కానిస్టేబుల్ బాధ్యత కీలకమైనదని, వ్యక్తిగత బాధ్యతతో విధులు నిర్వర్తించాలని ఎస్పీ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో వనపర్తి డీఎస్పీ గిరిబాబు, డీసీఆర్బీ డీఎస్పీ బాలాజీ నాయక్, డీసీఆర్బీ ఎస్ఐ తిరుపతిరెడ్డితో పాటు జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల కోర్టు డ్యూటీ అధికారులు పాల్గొన్నారు.

# పిల్లలే తల్లిదండ్రులకు అసలైన ఆస్తి

**- పిటీఎం సమావేశంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల జాజాపూర్**

**- ఆర్జెడి సోమిరెడ్డి**




నారాయణపేట, జూలై 18 (విజన్ ఆంధ్ర) : పిల్లలే తల్లిదండ్రులకు అసలైన ఆస్తి అని పిల్లల ప్రగతి కోసం తల్లిదండ్రులు ఆరు వాగ్దానాలు చేయాలని ఆర్జెడి సోమిరెడ్డి అన్నారు. నారాయణపేట మండల పరిధిలోని జాజాపూర్ ఉన్నత పాఠశాలలో జరిగిన తల్లిదండ్రుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ పిల్లలపైన ప్రత్యేక శ్రద్ధ వహిస్తే ఖచ్చితంగా అభివృద్ధి చెందుతారని చెప్పారు. ఇంటి వద్ద విద్యార్థులను చదివించడం ప్రతిరోజు పాఠశాలకు పంపడం పాఠశాలకు ఆబ్సెంట్ అయిన పిల్లలపై ప్రత్యేకంగా ఫోన్లు చేయాలని విద్యార్థి తల్లిదండ్రుల పైన ప్రత్యేకమైన శ్రద్ధ వహించి ఇంటికి వచ్చిన తర్వాత అన్ని సబ్జెక్టుల వివరాలను అడిగి తెలుసుకోవాలని సూచించారు. విద్యార్థి తల్లిదండ్రులకు పాఠశాల ప్రగతిని విద్యాభివృద్ధి గురించి తెలుసుకున్నారు. మండల విద్యాధికారుల సమావేశం ఏర్పాటు చేసి ఎన్రోల్మెంట్ యు డాష్ ప్రకారం విద్యార్థులు ఉపాధ్యాయుల ఎఫ్ఆర్ఎస్ అటెండెన్స్ ప్రీ ప్రైమరీ పాఠశాలల గురించి వర్క్ బుక్స్ నోట్ బుక్స్ టెక్ట్స్ బుక్స్ ఎంట్రీ గురించి అపార ఆధార్ టీచర్స్ వర్క్ అడ్జస్ట్మెంట్ ప్యానల్ ఇన్స్పెక్షన్ పై చర్చించారు. ఇన్ సర్వీస్ టీచర్స్ శిక్షణలో ఉపాధ్యాయులందరూ తప్పకుండా ఇక్కడ నేర్చుకున్నటువంటి విషయాలను విద్యార్థులకు చేరినప్పుడే శిక్షణకు సార్థకము ఉంటుందని అన్నారు. ఇక్కడ నేర్చుకున్నటువంటి విషయాలను విద్యార్థులకు తెలియజేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి డాక్టర్ గోవిందరాజ్ ఏ ఎం ఓ విద్యాసాగర్ సీఎమ్ఓ రాజేంద్ర కుమార్ మధ్యాహ్న భోజనం పథకం ఇంచార్జ్ అధికారి యాదవ్ శెట్టి సెక్టోరియల్ ఆఫీసర్ నాగార్జున రెడ్డి శ్రీనివాసులు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు భారతి భాను ప్రకాష్ నరసింహ మంగళ శశిరేఖ శ్రీదేవి విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# వట్టివాగు ప్రాజెక్ట్ ను సందర్శించిన ఆసిఫాబాద్ శాసన సభ్యురాలు కోవ లక్ష్మీ.



ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి జులై 18 (విజన్ ఆంధ్ర) : కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని ప్రాజెక్ట్ ను సందర్శించిన ఆసిఫాబాద్ శాసన సభ్యురాలు కోవ లక్ష్మీ ఈ సందర్భంగా మాట్లాడుతూ వట్టివాగు కెనాల్ మరమ్మతుల పనులను త్వరగా పూర్తి చేసి వరి సాగు రైతులకు నీళ్లను అందించాలని అధికారులకు సూచించారు,వర్షపాత నమోదును దృష్టిలో ఉంచుకొని అధికారులు వ్యవహరించాలి అన్నారు, ఈ కార్యక్రమంలో రెబ్బెన మండల సింగిల్ విండో చైర్మన్ సంజీవ్ గారు అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్‌గా అంబాజీ బాధ్యతల స్వీకరణ





అసిఫాబాద్ జిల్లా ప్రతినిధి జులై 18 (విజన్ ఆంధ్ర) : కోమురం భీం ఆసిఫాబాద్ జిల్లా గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ (ణఖఔ)గా అంబాజీ శనివారం పదవీ బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కె. హరిత ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛం అందజేసిన అనంతరం తన కార్యాలయంలో అధికారికంగా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా డిప్యూటీ డైరెక్టర్ అంబాజీ మాట్లాడుతూ,... గిరిజన సంక్షేమం, విద్యాభివృద్ధి, విద్యార్థుల విద్యా ప్రమాణాల పెంపు, ప్రభుత్వ సంక్షేమ పథకాల సమర్థవంతమైన అమలుకు అందరి సహకారంతో ప్రత్యేక శ్రద్ధ తీసుకొని జిల్లా అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. అలాగే అధికారులు, ఉపాధ్యాయులు, ఉద్యోగులు సమన్వయంతో పనిచేసి గిరిజన విద్యను మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారులు, ఏ సి ఎం ఓ ఉద్ధవవ్ , ఏ టి డి ఓ లు చిరంజీవి, భాస్కర్, శ్రీనివాస్, డి ఎస్ ఓ షేకు, జి సి డి ఓ, ఎస్ సి ఆర్ పి రవీందర్, అనంత్, తెలంగాణ గిరిజన సంక్షేమ ఉపాధ్యాయ సంఘం (ౡఔఖ) నాయకులు అశోక్, రవీందర్, కృష్ణారావు, గోపాల్, మీనా రెడ్డి, నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం నాయకులు నారాయణ, రామ్‌చందర్, ఇతర శాఖల అధికారులు, ఉద్యోగులు మరియు సిబ్బంది అంబాజీ పుష్పగుచ్ఛాలు అందజేసి, శాలువాతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

# మంత్రి త్వరగా కోలుకోవాలని ఆలయాల్లో ప్రత్యేక పూజలు.



మాగనూరు, జూలై 18 (విజన్ ఆంధ్ర) : రాష్ట్ర పాడి పరిశ్రమల, మత్స్య, క్రీడలు, యువజన శాఖ మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి తీవ్ర జ్వరంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న నేపథ్యంలో ఆయన త్వరగా కోలుకోవాలని శనివారం నారాయణపేట జిల్లా మాగనూరు మండల కేంద్రంలోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో మండల కాంగ్రెస్, యువజన కాంగ్రెస్ నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా శివరాం రెడ్డి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మాట్లాడుతూ ప్రజలకు నిరంతరం సేవలందిస్తున్నమంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి సంపూర్ణ ఆరోగ్యంతో త్వరగా కోలుకుని ప్రజాసేవలో తిరిగి పాల్గొనాలని భగవంతుడిని ప్రార్థించామని అన్నారు. రాష్ట్ర ప్రజల ఆశీస్సులతో మంత్రి త్వరగా కోలుకుంటారనే విశ్వాసం వ్యక్తం చేశారు. అంతేకాకుండా రాష్ట్ర మంత్రి కాకముందు ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో మక్తల్ నుండి అసెంబ్లీ సమావేశాలకు వెళ్లే సమయాల్లో రోడ్డు ప్రమాదాలు ఎన్ని జరిగినా కూడా ఆయన ముందు జరిగిన రోడ్డు ప్రమాదాలను వారిని సహకరించి ఆసుపత్రికి తరలించే దిశగా ఎన్నో చర్యలు తీసుకున్నారని ఆ చర్యలకు ఆ భగవంతుడు ఆయనకు ఆరోగ్యాన్ని ప్రసాదించాలని ఆయన కోరారు. అదేవిధంగా మండలంలోని ప్రతి ఒక్కరూ ఆయన సుఖ సంతోషాలతో ఉండాలని మాగనూరు మండలంలోని హయా గ్రామాలలో ని దేవాలయాల లో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారని ఆయన తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలోని మక్తల్ నారాయణపేట చివరగా ఉండటంతో బీసీ నాయకుడిగా ఈ నారాయణపేట జిల్లాను అభివృద్ధి చేసేందుకు అయినా మంత్రి ఆరోగ్యం కోలుకోవాల్సిందిగా ఆ భగవంతున్ని దేవాలయంలో ప్రత్యేక పూజలు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కార్యకర్తలు ప్రజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు ఆనంద్ గౌడ్, వాకిటి నారాయణ , రవి ,కృష్ణ ఆయా గ్రామాల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# కరీంనగర్ విద్యాశాఖకు ప్రత్యేక గుర్తింపు తీసుకురావాలి

**- కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దండి..**

**- విద్యార్థుల నమోదు భారీగా పెంచండి..**

**- కలెక్టర్ చిత్రా మిశ్రా**



కరీంనగర్(విజన్ ఆంధ్ర బ్యూరో), జూలై 17: ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా తీర్చిదిద్ది, కరీంనగర్ జిల్లాకు విద్యారంగంలో రాష్ట్రస్థాయి ప్రత్యేక గుర్తింపు తీసుకురావాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాలలు, మోడల్ స్కూల్స్, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాలు (కేజీబీవీలు)లో విద్యార్థుల నమోదు గణనీయంగా పెంచేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని సూచించారు. శుక్రవారం రాత్రి కలెక్టరేట్‌లో జిల్లా విద్యాశాఖపై ఎంఈఓలు, మోడల్ స్కూల్ ప్రిన్సిపాళ్లు, కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్లు, కోఆర్డినేటర్లతో జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, విద్యకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యారంగ అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని అన్నారు. విద్యాశాఖలో వినూత్న, విప్లవాత్మక మార్పులు తీసుకొస్తున్న నేపథ్యంలో కరీంనగర్ జిల్లా ఆదర్శంగా నిలిచేలా అధికారులు కృషి చేయాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇవ్వడంతో పాటు నాణ్యమైన విద్యాబోధన అందేలా నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. ప్రతి విద్యార్థికి మెరుగైన విద్యా వాతావరణం కల్పించడం అధికారుల బాధ్యత అని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేయనున్న ఇంటిగ్రేటెడ్ స్కూల్స్, తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ లక్ష్యాలను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వ విద్యా వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని కలెక్టర్ సూచించారు. విద్యాశాఖ అధికారులు పాఠశాలలను నిత్యం తనిఖీ చేస్తూ బోధన, హాజరు, మౌలిక వసతులు, విద్యార్థుల నమోదు వంటి అంశాలను నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. పాఠ్యపుస్తకాల పంపిణీ యూనిఫాంలో పంపిన పై వివరాలు తెలుసుకున్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, జిల్లా విద్యాశాఖ అధికారి చైతన్య జైనీ, కోఆర్డినేటర్లు అశోక్ రెడ్డి శ్రీనివాసు ఉమారాణి శ్రీనివాసు, విద్యాశాఖ అధికారులు, ఎంఈఓలు, మోడల్ స్కూల్ ప్రిన్సిపాళు ,, కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్లు, కోఆర్డినేటర్లు పాల్గొన్నారు.

# కాలు తీసేయాల్సిన పరిస్థితి నుండి 81 ఏళ్ల వృద్ధుడిని కాపాడిన యశోద వైద్యులు

**- అత్యాధునిక రక్తనాళాల శస్త్రచికిత్సతో పునరుజ్జీవం**

**- మలక్‌పేట్ యశోద సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి వైద్యుల అరుదైన విజయగాథ**



హన్మకొండ జిల్లా ప్రతినిధి జులై 18 ( విజన్ ఆంధ్ర ) : మధుమేహం (షుగర్) ఉన్న వృద్ధుల్లో పాదాలపై ఏర్పడే చిన్న గాయాన్ని నిర్లక్ష్యం చేస్తే అది ప్రాణాంతకంగా మారే ప్రమాదం ఉందని మలక్‌పేట్ యశోద సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి వైద్యులు హెచ్చరించారు. ముఖ్యంగా కాలికో రక్తప్రసరణ తగ్గినప్పుడు 'గ్యాంగ్రీన్' (కుళ్లిపోవడం) ఏర్పడి కాలు తొలగించాల్సిన పరిస్థితి వస్తుంది. ఇటువంటి క్లిష్టమైన స్థితిలో ఉన్న వరంగల్ జిల్లా వర్ధన్నపేటకు చెందిన 81 ఏళ్ల వృద్ధుడు కుసుమ భద్రయ్యను అత్యాధునిక వాస్కులర్ శస్త్రచికిత్స ద్వారా యశోద ఆసుపత్రి వైద్యులు విజయవంతంగా కాపాడారు.

కేసు వివరాలు:

కుసుమ భద్రయ్య కుడి కాలి మూడు వేళ్లు గ్యాంగ్రీన్‌కు గురికావడంతో యశోద ఆసుపత్రిని ఆశ్రయించారు. పరీక్షలు నిర్వహించిన వైద్యులు, ఆయన కాలికి రక్తప్రసరణ అందించే ప్రధాన ధమనిలో తీవ్రమైన అడ్డంకులు ఉన్నట్లు గుర్తించారు. ఆయనకు 'రైట్ ఫెమురో-పాప్లిటియల్ అక్లూజివ్ డిసీజ్'తో కూడిన 'క్రిటికల్ లింబ్ థ్రెటెనింగ్ ఇస్కీమియా (జూ×-జ5)' ఉన్నట్లు తేలింది. దీనికి తోడు టైప్-2 మధుమేహం, రక్తపోటు (బీపీ) కూడా ఉండటంతో కాలు పూర్తిగా తొలగించాల్సిన ముప్పు పొంచి ఉందని వైద్య బృందం గుర్తించింది.

విజయవంతంగా వాస్కులర్ లింబ్-సాల్వేజ్ శస్త్రచికిత్స:

కన్సల్టెంట్ వాస్కులర్ & ఎండోవాస్కులర్ సర్జన్ డాక్టర్ రంజిత్ కుమార్ ఆనందసు ఆధ్వర్యంలో వైద్య బృందం అత్యవసరంగా అవయవాన్ని కాపాడే వాస్కులర్ శస్త్రచికిత్సను నిర్ణయించింది. రోగికి 'రైట్ ఫెమురో-పాప్లిటియల్ బైపాస్ శస్త్రచికిత్స'తో పాటు గ్యాంగ్రీన్‌కు గురైన కుడి కాలి మూడు వేళ్లను మాత్రమే తొలగించే శస్త్రచికిత్సను విజయవంతంగా పూర్తి చేశారు.

ఈ శస్త్రచికిత్స ప్రత్యేకతలు:

బైపాస్ ద్వారా కాలికి రక్తప్రసరణను విజయవంతంగా పునరుద్ధరించారు.

గ్యాంగ్రీన్‌కు గురైన వేళ్లను మాత్రమే తొలగించి, మిగిలిన కాలును పూర్తిగా కాపాడారు. ఎలాంటి ప్రధాన శస్త్రచికిత్స సమస్యలు లేకుండా ఆపరేషన్ పూర్తయింది.

రక్తప్రసరణ సజావుగా సాగడంతో కాలు తిరిగి సురక్షిత స్థితికి చేరింది.

సమగ్ర వైద్య సేవలు:

రోగి వయస్సు, ఇతర ఆరోగ్య సమస్యలను దృష్టిలో ఉంచుకుని పలువురు నిపుణుల సమన్వయంతో చికిత్స అందించారు. ఇందులో భాగంగా అత్యాధునిక వాస్కులర్ శస్త్రచికిత్సతో పాటు మధుమేహ నియంత్రణ, గుండె సంబంధిత పరీక్షల పర్యవేక్షణ, మూత్రపిండాల పనితీరుపై ప్రత్యేక నిఘా, తీవ్రమైన రక్తహీనతకు రక్తమార్పిడి, యాంటీబయాటిక్స్ మరియు యాంటీకోగ్యులెంట్ చికిత్స, నిరంతర గాయం సంరక్షణ వంటి సమగ్ర వైద్య సేవలను రోగికి అందించినట్లు ఆసుపత్రి వర్గాలు వెల్లడించాయి. సకాలంలో అత్యాధునిక చికిత్సలు అందడం వల్లే అవయవాన్ని కాపాడటమే కాకుండా రోగి జీవన నాణ్యతను మెరుగుపరచడం సాధ్యమైందని వైద్యులు పేర్కొన్నారు.

# యువత సమస్యల పరిష్కారమే బీఆర్ఎస్ లక్ష్యం....

**- సరూర్‌నగర్‌లోని యువ సంగ్రామ సదస్సుకు బోడుప్పల్ నుంచి భారీగా తరలివెళ్లిన బీఆర్ఎస్ శ్రేణులు**

**- మాజీ జడ్పీటీసీ మంద సంజీవరెడ్డి ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయం నుంచి భారీ ర్యాలీ**



బోడుప్పల్,జూలై18(విజన్ ఆంధ్ర) : యువత,నిరుద్యోగుల సమస్యలపై ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూ బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో సరూర్‌నగర్‌లో నిర్వహించిన యువ సంగ్రామ సదస్సుకు బోడుప్పల్ సర్కిల్ నుంచి మాజీ జడ్పీటీసీ మంద సంజీవరెడ్డి ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయం నుంచి వివిధ డివిజన్లకు చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలు, యువకులు, నిరుద్యోగులు పెద్ద సంఖ్యలో పార్టీ శ్రేణులు భారీ ర్యాలీగా బయలుదేరి సదస్సులో పాల్గొన్నారు. కార్యాలయం నుంచి ర్యాలీగా బయలుదేరిన నాయకులు, కార్యకర్తలు యువత సమస్యలు, నిరుద్యోగ సమస్యలు, ఉద్యోగ అవకాశాలు, ప్రభుత్వ నియామకాలు తదితర అంశాలపై నినాదాలు చేస్తూ సదస్సుకు తరలివెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో యువత, విద్యార్థులు కీలక పాత్ర పోషించారని, రాష్ట్ర సాధనలో యువత చేసిన త్యాగాలను ఎవరూ మరిచిపోలేరని అన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో యువత, విద్యార్థులు, నిరుద్యోగుల కోసం అనేక కార్యక్రమాలు చేపట్టామని పేర్కొన్నారు. ప్రస్తుతం నిరుద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగులకు న్యాయం చేయాలని, ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేయాలని, యువతకు ఉపాధి అవకాశాలు పెంచాలని నాయకులు కోరారు. యువత భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం స్పష్టమైన కార్యాచరణతో ముందుకు సాగాలని సూచించారు. నిరుద్యోగులు, యువత ఎదుర్కొంటున్న సమస్యలను ప్రజల దృష్టికి తీసుకువెళ్లడంతో పాటు, వారి హక్కుల కోసం బీఆర్ఎస్ పార్టీ నిరంతరం పోరాటం చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మేయర్ సామల బుచ్చిరెడ్డి,బోడుప్పల్ బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి మీసాల కృష్ణ, కొత్త రవిగౌడ్,బొమ్మకు విశ్వనాథ్, బందారం శ్రీధర్ గౌడ్, శ్రీహరి గౌడ్, కాటం రాజి, బందారం నాగేశ్వర్ రావు, రెడ్డి రవికుమార్, శ్రీకాంత్ యాదవ్, మనోహర్ రెడ్డి, ఉప్పరి విజయ్, మైసగాళ్ల శ్రీకాంత్, విప్లవ్ రెడ్డి, తదితర బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, యువకులు, నిరుద్యోగులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# వికసిత్ భారత్ శిక్షా అధిష్ఠాన్ బిల్లును వెంటనే నిలిపివేయాలి

**- రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా ఉన్న బిల్లును పార్లమెంట్‌లో వ్యతిరేకించాలి**

**- మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్‌కు ఏఐఎస్ఎఫ్ మేడ్చల్ జిల్లా సమితి వినతి**



బోడుప్పల్,జూలై 18(విజన్ ఆంధ్ర) : కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టనున్న వికసిత్ భారత్ శిక్షా అధిష్ఠాన్ బిల్లు 2025 ను వెంటనే నిలిపివేయాలని, రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా ఉన్న బిల్లును పార్లమెంట్‌లో వ్యతిరేకించాలని కోరుతూ ఏఐఎస్ఎఫ్ మేడ్చల్ జిల్లా సమితి ఆధ్వర్యంలో మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్‌కు వినతిపత్రం అందజేశారు. శనివారం ఎంపీని కలిసి విద్యారంగానికి సంబంధించిన తమ అభ్యంతరాలను వివరించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ మేడ్చల్ జిల్లా కార్యదర్శి ఎండీ అన్వర్ మాట్లాడుతూ వికసిత్ భారత్ శిక్షా అధిష్ఠాన్ బిల్లు 2025ను ఏఐఎస్ఎఫ్ తీవ్రంగా వ్యతిరేకిస్తోందన్నారు. ఈ బిల్లు అమలులోకి వస్తే కేంద్ర, రాష్ట్రాల మధ్య ఉన్న సమాఖ్య విధానం బలహీనపడే అవకాశం ఉందని, ఉన్నత విద్యా సంస్థల స్వయం ప్రతిపత్తికి భంగం కలిగే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యారంగంలో ప్రజాస్వామ్య, సమగ్ర విధానాలకు ఈ బిల్లు ముప్పుగా మారుతుందని పేర్కొన్నారు. ప్రస్తుతం ఉన్న యూజీసీ, ఏఐసీటీఈ, ఎన్‌సీటీఈ వంటి ఉన్నత విద్యా నియంత్రణ సంస్థల స్థానంలో ఒకే అత్యున్నత నియంత్రణ సంస్థను ఏర్పాటు చేయాలనే ప్రతిపాదనపై ఏఐఎస్ఎఫ్ అభ్యంతరం వ్యక్తం చేసింది. దీని వల్ల విద్యా నియంత్రణ సంస్థల స్వతంత్రత తగ్గడంతో పాటు, విశ్వవిద్యాలయాల స్వయం ప్రతిపత్తి దెబ్బతినే అవకాశం ఉందని అన్వర్ అన్నారు. ఉన్నత విద్యపై రాష్ట్రాలకు ఉన్న హక్కులను కేంద్రం క్రమంగా కేంద్రీకృతం చేసే విధంగా బిల్లు ప్రతిపాదనలు ఉన్నాయని ఆయన ఆరోపించారు. ఐఐటి,ఐఐఎం,ఎన్ఐటీ,ఐఐఎస్ఈఆర్ వంటి ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థలు కూడా పరిధిలోకి వస్తే వాటి స్వయం ప్రతిపత్తి, విద్యా స్వేచ్ఛపై ప్రభావం పడే అవకాశం ఉందన్నారు. ముఖ్యంగా రాష్ట్ర విశ్వవిద్యాలయాల స్వయంప్రతిపత్తిని కాపాడుతూ, ప్రభుత్వ విద్యారంగాన్ని మరింత బలోపేతం చేసే విధానాలను కేంద్ర ప్రభుత్వం అనుసరించాలని డిమాండ్ చేశారు. వికసిత్ భారత్ శిక్షా అధిష్ఠాన్ బిల్లులోని ప్రతిపాదనలను సమగ్రంగా పరిశీలించి, విద్యార్థులు, ఉపాధ్యాయులు, రాష్ట్రాల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని బిల్లును వ్యతిరేకించాలని, పార్లమెంట్‌లో దీనిపై విస్తృతంగా చర్చ జరపాలని ఎంపీని ఏఐఎస్ఎఫ్ నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా నాయకులు కృష్ణ, సాయి, అరవింద్, మధు తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలకు వేగం..

**- అధికారులకు కలెక్టర్ గరిమ అగ్రవాల్ కీలక ఆదేశాలు**



రాజన్న సిరిసిల్ల, జూలై 18 (విజన్ ఆంధ్ర బ్యూరో): జిల్లాలో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను వేగవంతం చేసి, నిర్దేశిత లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ అధికారులను ఆదేశించారు. నిర్మాణాల పురోగతి, రెండో దశ ఇండ్ల మంజూరు ప్రక్రియపై శనివారం గృహనిర్మాణ శాఖ అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించి సమీక్షించారు. జిల్లాలోని అన్ని మున్సిపాలిటీలు, మండలాల వారీగా కేటాయించిన లక్ష్యాలు, పూర్తయిన ఇండ్లు, వివిధ దశల్లో ఉన్న నిర్మాణాల వివరాలను కలెక్టర్ సమీక్షించారు. నిర్మాణాల్లో ఎక్కడైనా జాప్యం ఉంటే కారణాలను వెంటనే గుర్తించి, సమస్యలను పరిష్కరించి పనులు వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం పేదలకు సొంత ఇంటి కలను నెరవేర్చే లక్ష్యంతో ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని పారదర్శకంగా అమలు చేస్తోందని కలెక్టర్ పేర్కొన్నారు. గుడిసెలు, రేకుల షెడ్లలో నివసిస్తున్న అర్హులైన కుటుంబాలకు నిబంధనల ప్రకారం ఇండ్లు మంజూరు చేయాలని ఆదేశించారు. నిర్మాణాల పురోగతిని క్షేత్రస్థాయిలో మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలు, ఏఈలు నిరంతరం పర్యవేక్షించాలని, లబ్ధిదారులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని సూచించారు. నిర్మాణంలో ఉన్న ఇండ్లను త్వరితగతిన పూర్తి చేసి గృహప్రవేశాలకు సిద్ధం చేయాలని ఆదేశించారు. రెండో దశ ఇందిరమ్మ ఇండ్ల మంజూరుపై కూడా కలెక్టర్ సమీక్ష నిర్వహించి, నిర్మాణానికి ఆసక్తి ఉన్న అర్హులైన లబ్ధిదారులకు పారదర్శకంగా ఇండ్లు మంజూరు చేయాలని అధికారులను ఆదేశించారు. టెలీ కాన్ఫరెన్స్‌లో హౌసింగ్ పీడీ వెంకట మాధవరావు, డీఆర్డీఓ లక్ష్మీనారాయణ, జిల్లా పంచాయతీ అధికారి జయశీలతో పాటు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# రైల్వే జేఏసీ మహా పాదయాత్రను విజయవంతం చేయాలి....

**- తేజో మయి మాల కుల సంఘం**



హన్మకొండబ్యూరోఛిఫ్ జులై 18( విజన్ఆంధ్ర ) : రైల్వే జేఏసీ ఆధ్వర్యంలో నేడు జరగబోయే మహా పాదయాత్రలో రైల్వే కార్మికుల పిల్లలు రైల్వే ఎంప్లాయిస్ కూడా పాల్గొని ఈ కార్యక్రమం విజయవంతం చేయాలని తేజో మయి మాల కులసంఘం నాయకులు పిలుపు నిచ్చారు ఈ సంధర్బంగా సంఘం అధ్యక్షుడు మరియాల కృష్ణ మాట్లాడుతూ.... కాజీపేట నివాసులు, అయోధ్య పురం గ్రామస్తులు కడిపికొండ గ్రామస్తులు మడికొండ గ్రామస్తులకు చుట్టు ప్రక్కల గ్రామస్తులకు ఉమ్మడి వరంగల్ జిల్లా వారికి కాజీపేట లోని అయోధ్య పురం ఆర్ఎంయు కోచ్ ఫ్యాక్టరీలో భూనిర్వాయితులకు స్థానికులకు ఉద్యోగాలు. కాజీపేట ను డివిజన్ గా చేయాలని అంశంపై నేడు ఉదయం 9 గంటలకు మడికొండ అంబేద్కర్ స్టార్చ్ నుండి కాజీపేట రైల్వే స్టేషన్ వరకు మహా పాదయాత్ర నిర్వహించడం జరుగుతుంది. కావున పార్టీలకతీతంగా,కులాలకతీతంగా, మతలకు అతీతంగా, యవనస్తులు పెద్దలు యువతి యువకులు ఈ కార్యక్రమంలో పాల్గొనాలని ఆయన కోరారు ఈ కార్యక్రమంలో రైల్వే జేఏసీ కన్వీనర్ దేవులపల్లి రాఘవేంద్ర, చైర్మన్ కొండ్ర నర్సింగ రావు, రాజయ్య సంఘం కోశాధికారి పప్పుల గోవర్ధన్, కాందారి రాజమౌళి, కొత్త రవి, బత్తుల సమ్మయ్య, బరబరీ ఉప్పల్ రావు, నీరటి సాయిరాజ్, బరాబరి శ్రీకాంత్, బండారి రాజేందర్, పోతరాజు రాజేశ్వర్ రావు,కాలమాల మహేందర్, బండారి నర్సింగ్ రావు, ఓగ్గుల భద్రయ్య, పోతుల సాంబయ్య, పర్లపల్లి రాజేష్, అలువాల అనిల్, జనపట్ల యాదగిరి, గొర్రె ఇశ్వర్, గడెం వెంకట స్వామి, బొబ్బిలి రాజేందర్, తదితరులు పాల్గొన్నారు.

# మహిళ పై గొడ్డలితో దాడి,

**- గాయాపడిన మహిళను ఆసుపత్రికి తరలింపు.**



అసిఫాబాద్ జిల్లా ప్రతినిధి జులై 18 ( విజన్ అంధ్ర) : కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా తిర్యాణి మండలం తలండి గ్రామంలో శుక్రవారం రాత్రి దారుణం చోటుచేసుకుంది. కొర్యంగ జ్యోతి అనే మహిళపై ఆమె అన్న వరుసైన తిరుపతి గొడ్డలితో దాడి చేశాడు. చిన్నపాటి ఘర్షణ తలెత్తడంతో ఆగ్రహానికి లోనైన తిరుపతి ఇంట్లోని గొడ్డలితో జ్యోతిపై విచక్షణారహితంగా దాడి చేశాడు. తీవ్రంగా గాయపడిన ఆమెను కుటుంబ సభ్యులు ముందుగా తిర్యాణి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అక్కడి నుండి మంచిర్యాల మీదుగా వరంగల్ కు తరలించగా. ప్రస్తుతం ఆమె అక్కడ చికిత్స పొందుతున్నారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## వెస్ట్ క్రాంతి కాలనీలో నూతన వాటర్ ప్లాంట్ ప్రారంభం

**- మాజీ కార్పొరేటర్ దొంతిరి హరిశంకర్ రెడ్డి**



బోడుప్పల్,జూలై 18(విజన్ ఆంధ్ర) : వెస్ట్ క్రాంతి కాలనీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్‌ను 25వ వార్డు మాజీ కార్పొరేటర్ దొంతిరి హరిశంకర్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాజీ కార్పొరేటర్ దొంతిరి హరిశంకర్ రెడ్డిని కాలనీ కమిటీ సభ్యులు శాలువాతో ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. కాలనీ ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు కె. నర్సింహా, ఉపాధ్యక్షుడు తిరుమలేష్, జనరల్ సెక్రటరీ కృష్ణస్వామి, వర్కింగ్ ప్రెసిడెంట్ హీరాలాల్ నాయక్, శివరాజ్, మాజీ జనరల్ సెక్రటరీ కళ్యాణ్, క్యాషియర్ సురేందర్ రెడ్డి, కమిటీ సభ్యులు రమేష్, శ్రీను, సురేష్, రైస్ షాప్ సురేష్, పాండు తదితరులు పాల్గొన్నారు.

## కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన కార్యనిర్వాహక ఇంజనీర్ రవీందర్



కామారెడ్డి బ్యూరో జులై 18(విజన్ఆంధ్ర) : హనుమకొండ జిల్లా TGEWIDC కార్యనిర్వాహక ఇంజనీర్ (EE)గా విధులు నిర్వహించి, నిజామాబాద్‌కామారెడ్డి జిల్లాల TGEWIDC కార్యనిర్వాహక ఇంజనీర్‌గా బదిలీపై బాధ్యతలు స్వీకరించిన రవీందర్ శనివారం జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్‌ను కలెక్టర్ ఛాంబర్ లో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

## కామారెడ్డిలో టీఎస్ ఎస్సీ స్టడీ సర్కిల్ విజయగాథల పుస్తకావిష్కరణ



కామారెడ్డి బ్యూరో జులై 18 (విజన్ఆంధ్ర) : హైదరాబాద్‌లోని తెలంగాణ షెడ్యూల్డ్ కులాల (TS SC) స్టడీ సర్కిల్లో శిక్షణ పొందిన విద్యార్థులు వివిధ పోటీ పరీక్షల్లో సాధించిన విజయాలను ప్రతిబింబించే "విజయగాథలు" పుస్తకాన్ని నేడు ఘనంగా ఆవిష్కరించారు. కలెక్టర్ ఛాంబర్ లో ఈ పుస్తకాన్ని ఆశిష్ షాంగ్వాన్, చేతుల మీదుగా ఆవిష్కరించగా, ఈ కార్యక్రమంలో విక్టర్, అదనపు కలెక్టర్ (రెవెన్యూ), డిప్యూటీ కలెక్టర్ రవితేజ.పి. వెంకటేష్, జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి దేవిదాస్, డైరెక్టర్, నిజామాబాద్ జిల్లా ఎస్సీ స్టడీ సర్కిల్ పాల్గొన్నారు. ఈ పుస్తకంలో తెలంగాణ ఎస్సీ స్టడీ సర్కిల్‌లో శిక్షణ పొంది వివిధ పోటీ పరీక్షల్లో విజయాలు సాధించిన అభ్యర్థుల స్ఫూర్తిదాయక విజయగాథలను పొందుపరిచారు. ఈ విజయగాథలు పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులకు ప్రేరణగా, మార్గదర్శకంగా నిలవడంతో పాటు, తెలంగాణ ఎస్సీ స్టడీ సర్కిల్ అందిస్తున్న నాణ్యమైన శిక్షణ, మార్గనిర్దేశం మరియు వెనుకబడిన వర్గాల విద్యార్థుల అభివృద్ధికి సంస్థ చేస్తున్న విశేష కృషిని ప్రతిబింబిస్తున్నాయి.

## స్వస్తిక్ కాన్సెప్ట్ స్కూల్‌లో ఘనంగా గ్రీన్ కలర్ డే వేడుకలు




మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి జులై 18 (విజన్ ఆంధ్ర): మహబూబాబాద్‌లోని స్వస్తిక్ కాన్సెప్ట్ స్కూల్లో చిన్నారుల కోసం గ్రీన్ కలర్ డే వేడుకలను ఉత్సాహభరితంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ శ్రీ కే. చంద్రమౌళి గారు కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ,విద్యార్థులలో బాల్యం నుండే రంగుల మీద అవగాహనా పెంపోదించేందుకు ఇలాంటి కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు... విద్యార్థులు ఆకుపచ్చ రంగు దుస్తులు ధరించి, పచ్చని ప్రకృతిని ప్రతిబింబించే వివిధ వస్తువులతో ఆకట్టుకున్నారు. పాఠశాల ఆవరణను ఆకుపచ్చ రంగు బెలూన్లు, అలంకరణలతో అందంగా తీర్చిదిద్దారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు ఆకుపచ్చ రంగు యొక్క ప్రాముఖ్యత, చెట్ల విలువ, పర్యావరణ పరిరక్షణ అవసరాన్ని వివరించారు. విద్యార్థులు పాటలు, పద్యాలు, ప్రసంగాలు, నృత్యాలు ప్రదర్శించి అందరినీ అలరించారు. ఈ కార్యక్రమం ద్వారా చిన్నారుల్లో ప్రకృతిపట్ల ప్రేమ, చెట్ల సంరక్షణ, పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంపొందించడమే లక్ష్యమని పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీ దాసరి మధు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ ఖ. చంద్రమౌళి గారు,విద్యార్థులు, ఉపాధ్యాయులు మరియు తల్లిదండ్రులు ఉత్సాహంగా పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.


## ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు పరీక్షా సామగ్రి పంపిణీ

**- మధ్యాహ్న భోజనాన్ని విద్యార్థులతో కలిసి స్వీకరించిన ప్రజా ప్రతినిధులు**



విజన్ ఆంధ్ర(18) నల్గొండ : శాలిగౌరారం మండలంలోని చిత్తలూరు గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు సామాజిక సేవా దృక్పథంతో, గ్రామానికి చెందిన యువకుడు తూడి మధు సహకారంతో పరీక్షలకు అవసరమైన, పరీక్షా ప్యాడ్లు, పెన్నులు, నోటు పుస్తకాలు, డైరీలు, అలాగే అత్యవసర వైద్య సేవల కోసం ఫస్ట్ ఎయిడ్ బాక్స్‌తో పాటు మందులను పంపిణీ చేశారు, ఈ కార్యక్రమంలో శాలిగౌరారం మార్కెట్ కమిటీ చైర్మన్ పాదూరి శంకర్ రెడ్డి, గ్రామ సర్పంచ్ గిరగాని వెంకన్న, ఉప సర్పంచ్ యనమల శంకర్, విద్యార్థులకు సామగ్రిని అందజేశారు, విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలను సాధించాలని వారు ఆకాంక్షించారు, ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి సమాజం భాగస్వామ్యం కావడం ఎంతో అవసరమని పేర్కొన్నారు, అనంతరం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న మధ్యాహ్న భోజన పథకంలో భాగంగా ప్రజా ప్రతినిధులు విద్యార్థులతో కలిసి భోజనం చేసి, వారి యోగ క్షేమాలను తెలుసు కున్నారు, ఈ కార్యక్రమం విద్యార్థుల్లో ఆత్మ విశ్వాసాన్ని పెంపొం దించడంతో పాటు, ప్రభుత్వ పాఠశాలల పట్ల సమాజంలో మరింత సానుకూల భావన ఏర్పడేందుకు దోహద పడిందని పలువురు అభిప్రాయ పడ్డారు, ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బొమ్మగాని రవి, అన్నపూర్ణ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## ఆర్జెడి ఎం.వి ప్రసాద్ ను కలిసిన జాస్ నేతలు



కడప, జూలై 18 (విజన్ ఆంధ్ర)సమాచార పౌర సంబంధాల శాఖ కడప జోన్-4 రీజనల్ జాయింట్ డైరెక్టర్ గా కడపలో బాధ్యతలు స్వీకరించిన ఎం.వెంకటేశ్వర ప్రసాద్ ను జర్నలిస్ట్ అసోసియేషన్ ఆఫ్ సౌత్ ఇండియా(జాస్)నేతలు ఫౌండర్ గుండ్రాతి విజయకుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎన్. వి. సుబ్బారెడ్డి, జాస్ సీనియర్ నాయకుడు వాం రమణ మర్యాదపూర్వకంగా శనివారం కలిశారు. ఆయనను శాలువా తో సన్మానించి అభినందనలు తెలిపారు. జోన్ పరిధిలోనీ జర్నలిస్టులందరికీ ప్రభుత్వ పథకాలు అందేలా కృషి చేయాలని కోరారు. కొంతమంది జర్నలిస్టులకు మూడవ విడతలో ఇవ్వవలసిన అక్రిడేషన్లు త్వరగా మంజూరు చేయించాలని కోరారు. జర్నలిస్ట్ లకు మేలు చేసేందుకు తన వంతు సహాయ సహకారాలు ఎప్పుడూ ఉంటాయని ఆయన హామీ ఇచ్చారు.

# మీ ఖాళీ స్థలం.. ఐటీ కంపెనీలకు చిరునామా కావచ్చు

**- పారిశ్రామికంగా దూసుకెళ్తున్న కడపకు మరో సువర్ణావకాశం**

**- ఆదాయ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోండి**

**- జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి పిలుపు**



కడప,జూలై 18 (విజన్ ఆంధ్ర) రాష్ట్రంలో ఐటీ రంగాన్ని వేగంగా విస్తరించడంతో పాటు జిల్లాల్లో ఉపాధి అవకాశాలను పెంపొందించేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఐటీ మౌలిక వసతుల ప్రత్యేక పోర్టల్‌ను అందుబాటులోకి తీసుకొచ్చిందని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి తెలిపారు.వైఎస్ఆర్ కడప జిల్లా శరవేగంగా పారిశ్రామికాభివృద్ధి దిశగా ముందుకు సాగుతున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన https://itinfra.ap.gov.in/#/home/landing` పోర్టల్ జిల్లా ప్రజలకు మరింత ప్రయోజనకరంగా చక్కటి ఉపాధి, ఆదాయ రంగాల పైపు నడిపించే మార్గదర్శి మారనుందని ఆయన పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం జిల్లాను సమగ్ర పారిశ్రామిక కేంద్రంగా తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రతి నియోజకవర్గంలో ఒక పారిశ్రామిక పార్కు అభివృద్ధి దిశగా చర్యలు చేపడుతోందని, భారీ, మధ్యతరహా పరిశ్రమలతో పాటు వేలాది సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు విజయవంతంగా కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయని తెలిపారు.కడప జిల్లా ప్రజలకు సువర్ణావకాశం ఎందుకంటే .సిమెంట్ పరిశ్రమలకు కడప ఇప్పటికే దేశవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు పొందిందని, అదే సమయంలో సౌర విద్యుత్, వస్త్ర పరిశ్రమలు, ఆహార ప్రాసెసింగ్, ఇంజినీరింగ్, ఖనిజ ఆధారిత పరిశ్రమలు వంటి అనేక రంగాల్లో కూడా పెట్టుబడులు పెరుగుతున్నాయి. వేలాది ఎకరాల్లో వివిధ పారిశ్రామిక ప్రాజెక్టులు అభివృద్ధి చెందుతుండటంతో జిల్లా పెట్టుబడులకు అనువైన గమ్యస్థానంగా రూపుదిద్దుకుంటోంది. అదేవిధంగా రాష్ట్రానికే తలమానికంగా అభివృద్ధి చెందుతున్న కొప్పర్తి ఎలక్ట్రానిక్ తయారీ సముదాయం దశలవారీగా విస్తరిస్తూ ఎలక్ట్రానిక్స్, సమాచార సాంకేతిక రంగాల్లో కొత్త పెట్టుబడులను ఆకర్షిస్తోంది. భవిష్యత్తులో కొప్పర్తి కేంద్రంగా మరిన్ని జాతీయ, అంతర్జాతీయ ఐటీ, ఎలక్ట్రానిక్స్ సంస్థలు జిల్లాకు వచ్చే అవకాశాలు ఉన్నాయి. ఇండస్ట్రియల్ మాన్యుఫాక్చరింగ్ క్లస్టర్ ను అధిగమించి సరిపడా స్థలాలు, భవనాలు అవసరం అవుతుంది. మరోవైపు జిల్లాను అన్ని పెద్ద నగరాలకు అనుసంధానం చేసే జాతీయ రహదారులు విస్తరించాయి. పారిశ్రామిక అవసరాలకు అవసరమైన రవాణా వ్యవస్థ జిల్లాకు ఉంది. జాతీయ స్థాయి కనెక్టివిటీలో రైల్వే, విమానయాన సర్వీసులు జిల్లా ప్రజలకు చక్కటి అవకాశాలుగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం తీసుకొచ్చిన ఐటీ మౌలిక వసతుల పోర్టల్ జిల్లా ప్రజలకు అరుదైన అవకాశంగా నిలువనుంది. పెద్ద పెద్ద భవనాల యజమానులే కాకుండా చిన్న వాణిజ్య భవనాలు, కార్యాలయ స్థలాలు, ఖాళీ అంతస్తులు, ఖాళీ భూములు కలిగిన వారంతా తమ ఆస్తులను ఈ పోర్టల్‌లో నమోదు చేసుకోవడం ద్వారా ఐటీ సంస్థలు, స్టార్టప్‌లు, గ్లోబల్ సామర్థ్య కేంద్రాలు (జీసీసీలు), ఇతర సాంకేతిక సంస్థలకు లీజుకు ఇవ్వడం లేదా విక్రయించడం ద్వారా అదనపు ఆదాయాన్ని పొందవచ్చు.డా. శ్రీధర్ చెరుకూరి, జిల్లా కలెక్టర్, వైఎస్ఆర్ కడప జిల్లా.

రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన https://itinfra.ap.gov.in/ #/home/landing` పోర్టల్‌లో ఆస్తుల వివరాలను నమోదు చేస్తే అవి నేరుగా పెట్టుబడిదారుల దృష్టికి చేరుతాయని, నమోదు ప్రక్రియ పూర్తిగా ఉచితమని తెలిపారు. ఈ డిజిటల్ వేదిక ద్వారా జిల్లాలో అందుబాటులో ఉన్న మౌలిక వసతులపై సమగ్ర సమాచారం పెట్టుబడిదారులకు చేరి కొత్త పరిశ్రమలు, ఐటీ సంస్థలు జిల్లాకు రావడానికి దోహదపడుతుందని పేర్కొన్నారు.ఐటీ సంస్థల రాకతో స్థానిక యువతకు నాణ్యమైన ఉపాధి అవకాశాలు పెరగడమే కాకుండా, రవాణా, గృహవసతి, హోటళ్లు, వ్యాపార సేవలు, విద్య, ఇతర అనుబంధ రంగాలు కూడా అభివృద్ధి చెందుతాయని కలెక్టర్ వివరించారు. తద్వారా జిల్లా ఆర్థిక వ్యవస్థ మరింత బలోపేతం కావడంతో పాటు కడపను రాష్ట్రంలో ప్రముఖ పారిశ్రామిక, ఐటీ కేంద్రంగా తీర్చిదిద్దే లక్ష్యానికి ఈ పోర్టల్ దోహదపడుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.అందువల్ల చిన్న, పెద్ద వాణిజ్య భవనాలు, కార్యాలయ స్థలాలు లేదా ఖాళీ భూములు కలిగిన ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఐటీ మౌలిక వసతుల పోర్టల్‌లో తమ ఆస్తుల వివరాలను నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి పిలుపునిచ్చారు. మరిన్ని వివరాల కోసం జిల్లా ఐటీ మేనేజర్ (90108 21844)ను సంప్రదించవచ్చని తెలిపారు.

## ప్రభుత్వ పథకాల అమలులో అధికారులు ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి అభివృద్ధికి కృషి చేయాలి

**- ఎంపీ సురేష్ షెట్కర్**




కామారెడ్డి బ్యూరో జులై (విజన్ఆంధ్ర) : దిశా సమావేశంలో జిల్లా అభివృద్ధి పనులపై సమగ్ర సమీక్ష ప్రభుత్వ పథకాల అమలులో సమన్వయంతో పనిచేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఎంపీ సురేష్ షెట్కర్ చెప్పారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో దిశ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో జహీరాబాద్ పార్లమెంట్ సభ్యులు, జిల్లా దిశా కమిటీ చైర్మన్ సురేష్ షెట్కర్, ఎమ్మెల్సీ అంజిరెడ్డి, ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి, జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ తో పాటు వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పార్లమెంట్ సభ్యుడు సురేష్ షెట్కర్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి లబ్ధిదారునికి సకాలంలో అందించేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. అభివృద్ధి పనులను వేగవంతం చేసి, ప్రజలకు నాణ్యమైన సేవలు అందించడంపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు.వ్యవసాయం, నీటిపారుదల, రహదారులు, రహదారి భద్రత, బ్యాంకింగ్, విద్య, గ్రామీణాభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుపై శాఖల వారీగా సమీక్ష నిర్వహించి, పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. రైతులకు కేంద్ర ప్రభుత్వ పథకాలపై విస్తృత అవగాహన కల్పించి, కిసాన్ క్రెడిట్ కార్డులు, పంట బీమా, ఇతర ఆర్థిక సహాయ పథకాల అమలును మరింత వేగవంతం చేయాలని పేర్కొన్నారు.జాతీయ రహదారులపై రహదారి ప్రమాదాల నివారణకు అవసరమైన భద్రతా చర్యలను పటిష్టం చేయాలని, తాగునీరు, సాగునీటి సౌకర్యాల మెరుగుదలకు ప్రాధాన్యత ఇవ్వాలని సంబంధిత శాఖలను ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేసి, అందుబాటులో ఉన్న నిధులను సమర్థవంతంగా వినియోగించాలని సూచించారు. ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ ప్రస్తుత వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని రైతులకు ఆరుతడి పంటలపై పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం ద్వారా నిర్వహిస్తున్న ఉపాధి హామీ పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ప్రతి ఒక్కరికి ఉపాధి లభించేలా క్షేత్రస్థాయిలో అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఎమ్మెల్సీ అంజిరెడ్డి మాట్లాడుతూ జిల్లా అభివృద్ధికి తనవంతుగా సహకారం అందించి అభివృద్ధి పనులను వేగవతానికి కృషి చేస్తానని, ప్రజలకు కావలసిన మౌలిక వసతులను సంబంధిత శాఖ అధికారులు కల్పించాలన్నారు. అనంతరంజిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ మాట్లాడుతూ సమావేశంలో సభ్యులు చేసిన సూచనలను సంబంధిత శాఖలు కార్యాచరణ ప్రణాళికతో అమలు చేయాలని, శాఖల మధ్య సమన్వయం పెంపొందించి అభివృద్ధి కార్యక్రమాలను నిర్దేశిత గడువులో పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర. మున్సిపల్ చైర్మన్ ఇప్ప ఉమారాణి. అదనపు కలెక్టర్ విక్టర్ అదనపు స్థానిక సంస్థల కలెక్టర్ యన్ వై గిరి. డి ఆర్ డి ఏ దామోదర్ రెడ్డి.జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్ది చంద్రకాంత్ రెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.


## ఘనంగా ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి జన్మదిన వేడుకలు



సూర్యాపేట జూలై 18:(విజన్ ఆంధ్ర) : మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్ రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని శనివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. నగరంలోని వివిధ ప్రాంతాల్లో అన్నదానాలు, అల్పాహార పంపిణీ, కేక్ కటింగ్, పండ్ల పంపిణీ, ప్రత్యేక పూజలు నిర్వహిస్తూ ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. జిల్లా మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ నిమ్మల స్రవంతి శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో అల్పాహార పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి వై.వి., జగదీశ్ రెడ్డి వ్యక్తిగత కార్యదర్శి ప్రభాకర్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ పెరుమళ్ల అన్నపూర్ణ శ్రీనివాస్, 8వ వార్డు కౌన్సిలర్ హిందు శ్రీ, సూర్యాపేట మండల మాజీ జడ్పీటీసీ జీడీ బిక్షం, సయ్యద్ తదితరులు పాల్గొన్నారు.బీఆర్ఎస్ హేయ్ కళ్లేపల్లి మహేశ్వరి దశరథ ఆధ్వర్యంలో అల్పాహార పంపిణీ నిర్వహించగా, పార్టీ నాయకులు పాల్గొన్నారు.శ్రీ వెంకటేశ్వరస్వామి దేవాలయంలో బిఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు సవరాల సత్యనారాయణ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి జగదీశ్ రెడ్డి ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రార్థించారు. 60 ఫీట్ రోడ్డులో బొలిశెట్టి మధు ఆధ్వర్యంలో కేక్ కటింగ్ కార్యక్రమం నిర్వహించగా, వార్డు ప్రజలు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.48వ వార్డు కూరగాయల మార్కెట్‌లో మార్కెట్ అధ్యక్షుడు కాల్ రామ్ ఆధ్వర్యంలో కేక్ కటింగ్ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో భాషా, యూసుఫ్ షరీఫ్, బొమ్మిడి అశోక్, శ్రీశైలం, అన్నపూర్ణమ్మ, జ్యోతి, కొండమ్మతో పాటు బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.27వ వార్డులో బిఆర్ఎస్ జిల్లా నాయకులు కక్కిరేణి నాగయ్య గౌడ్ ఆధ్వర్యంలో కేక్ కటింగ్ కార్యక్రమం నిర్వహించారు. పల్స వెంకన్న, శబరి, కక్కిరేణి సత్యనారాయణ, రాపర్తి శ్రీను, మోహినుద్దీన్, రాపర్తి సైదులు, కక్కిరేణి ఆనంద్, తండు పరశు రాం, రాపర్తి రవి, పిల్లలమర్రి రాజు, రాపర్తి రాము, బట్టు సైదులు, ఇండ్ల సురేష్, బైరు సాయి, రాపర్తి రమేష్ తదితరులు పాల్గొన్నారు.22వ వార్డులో బిఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జి మోత్కూరు సందీప్ ఆధ్వర్యంలో వార్డు ప్రజల మధ్య కేక్ కటింగ్ నిర్వహించారు. టైసన్ శ్రీను, శ్రీనివాస్, బండర్ సతీష్, సుజాత, లక్ష్మి, సౌజన్య, అంజయ్య, దుర్గారావు, దుర్గమ్మ తదితరులు పాల్గొన్నారు.బిఆర్ఎస్ లీగల్ సెల్ అధ్యక్షుడు నల్లగుంట్ల అయోధ్య, బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి తలమల్ల హసేన్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి గోవులకు పండ్లు తినిపించి జగదీష్ రెడ్డికి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపిన న్యాయవాదులు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ లీగల్ సెల్ న్యాయవాదులు కాకి రాంరెడ్డి, గ్రంధి వెంకటేశ్వర్లు, కొంపెల్లి లింగయ్య బాణాల విజయ్ కుమార్, డప్పు మల్లయ్య మీసాల శీను రేగట్టి లింగయ్య గౌడ్ అనుములపూరి సైదులు రేగటి శంకరయ్య గౌడ్ పిట్టల వెంకటేశ్వర్లు తొగిటి మురళి అల్లంనేని వెంకటేశ్వరరావు గద్దల శ్రీను చిప్పలపల్లి చిరంజీవి హనుమాన్ చింతల నాగార్జున కొమ్మ రమేష్ జటంగి శ్రీనాథ్ నాగరాజు రత్నావత్ లూనావత్ ప్రేమ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.బీఆర్ఎస్ నాయకుడు పల్స వెంకన్న ఆధ్వర్యంలో అపూర్వ బధిరుల పాఠశాలలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో జగదీశ్ రెడ్డి వ్యక్తిగత కార్యదర్శి ప్రభాకర్ రెడ్డి, మాజీ గ్రంథాలయ చైర్మన్ నిమ్మల శ్రీనివాస్ గౌడ్, బీఆర్ఎస్ జిల్లా నాయకుడు అంతటి విజయ్ కుమార్, రాపర్తి సైదులు, పరశురాం, రాపర్తి రామ్, రమేష్, సాయి, రషీద్, శ్రీను, కళ్యాణ్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.మాజీ మున్సిపల్ చైర్మన్ పెరుమళ్ల అన్నపూర్ణ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఏరియా ఆస్పత్రిలో రోగులకు పండ్ల పంపిణీతో పాటు 9వ వార్డులో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో స్థానిక ప్రజలు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని జగదీశ్ రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

## వేకువ జామున జగదీష్ రెడ్డి జన్మదిన వేడుకలు..

**- 23 వ వార్డు బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ వల్దాస్ స్పందన కిరణ్..**



సూర్యాపేట జూలై 18:(విజన్ ఆంధ్ర) : మాజీ మంత్రి,సూర్యాపేట అభివృద్ధి ప్రదాత నియోజకవర్గ ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్ రెడ్డి జన్మదిన వేడుకలు మున్సిపల్ సిబ్బంది తో కలిసి 23 వ వార్డు బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ వల్దాస్ స్పందన కిరణ్ కేక్ కటింగ్, పండ్ల పంపిణీ చేసారు.శనివారం జిల్లా కేంద్రం 23వ వార్డులో సూర్యాపేట అభివృద్ధి ప్రదాత మాజీ మంత్రి, నియోజకవర్గం ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్ రెడ్డి జన్మదిన వేడుకలను మున్సిపల్ సిబ్బంది తో కలిసి నిర్వహించుకోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ జన్మదిన వేడుకలు మున్సిపల్ సిబ్బంది నడుమ కలిసి చేసుకోవడం కేక్ కటింగ్, మున్సిపల్ సిబ్బందికి పండ్లు పంపిణీ చేయడం చాలా సంతోషం అని పేర్కొన్నారు. మున్సిపల్ కార్మికుల కుటుంబం నుండి తాను వచ్చిన వాడని కార్మికులతో కలిసి ఎమ్మెల్యే జన్మదిన వేడుకలను చేసుకోవడం 23 వ వార్డు ఎస్సీ కాలనీ నుండి మున్సిపల్ సిబ్బంది ఎక్కువగా ఇక్కడి నుండి ఉండడం వారి మధ్యలో ఈ వేడుకలు జరిపించుకోవడం సంతోషంగా ఉందన్నారు.వారికి ఆయురారోగ్యాలు సుఖసంతోషాలను ప్రసాదించాలని ఉదయం ఐదు గంటలకు మున్సిపల్ కార్మికుల నడుమ ప్రార్థన పూర్వకంగా కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమం లో వార్డు అధ్యక్షులు ఏర్పుల కిరీటి, సీనియర్ నాయకులు వల్దాస్ ఉపేందర్ , వీర్లల వేణు బలరాం, గండమళ్ళ యాదగిరి బాబు, వీర్లల శివ, దండు మహేష్, యూత్ అధ్యక్షులు పిడమర్తి మధు, చింతమల్ల రాంబాబు, ఉపాధ్యక్షులు కోడి సైదులు,బి ఆర్ టి యు స్టేట్ కమిటీ మెంబర్ వల్దాస్ మధుసూదన్ , బి ఆర్ టి యు జిల్లా నాయకులు చింతమల్ల సోమయ్య , వార్డు మహిళా అధ్యక్షురాలు చింతమల్ల జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

## మేడిపల్లిలో ఎస్ఐఆర్ ప్రత్యేక హెల్ప్‌డెస్క్‌లు...

**- క్రాంతి కాలనీ పార్క్, మేడిపల్లి బోడ్రాయి, కమలానగర్ కమిటీ హాల్ వద్ద ఏర్పాటు**

**- మేడిపల్లి మండల తహసీల్దార్ వెంకట నర్సింహ్మారెడ్డి**



బోడుప్పల్,జూలై 18(విజన్ ఆంధ్ర) : ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా మేడిపల్లి మండల పరిధిలోని ఓటర్ల సౌకర్యార్థం ప్రత్యేక హెల్ప్‌డెస్క్‌లను ఏర్పాటు చేసినట్లు మేడిపల్లి మండల తహసీల్దార్ వెంకట నర్సింహ్మారెడ్డి తెలిపారు. ఓటర్లు తమ ఎన్యూమరేషన్ ఫామ్‌లను తీసుకోవడం, నింపడం, సమర్పించడం వంటి ప్రక్రియల్లో అవసరమైన సహాయం అందించేందుకు ఈ హెల్ప్‌డెస్క్‌లు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. క్రాంతి కాలనీ పార్క్, మేడిపల్లి బొడ్రాయి, కమలానగర్ కమిటీ హాల్ వద్ద ప్రత్యేక హెల్ప్‌డెస్క్‌లు అందుబాటులో ఉంటాయని తహసీల్దార్ తెలిపారు. ఆదివారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు హెల్ప్‌డెస్క్‌ల ద్వారా సేవలు అందించనున్నట్లు వెల్లడించారు. మేడిపల్లి మండల పరిధిలోని ఓటర్లందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ ఎన్యూమరేషన్ ఫామ్‌లను సకాలంలో పూర్తి చేసి సమర్పించాలని తహసీల్దార్ వెంకట నర్సింహ్మారెడ్డి కోరారు. ఫామ్ నింపడంలో ఏవైనా సందేహాలు ఉన్నవారు హెల్ప్‌డెస్క్‌లను సంప్రదించి అవసరమైన సహాయం పొందాలని సూచించారు.

## ప్రతి వర్షపు నీటి బొట్టును కాపాడుకోవాలి

**- జిల్లా కలెక్టర్ కె.హరిత**




ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి జూలై 18,(విజన్ ఆంధ్ర )ప్రతి వర్షపు నీటి బొట్టును భూమిలోకి ఇంకించి కాపాడుకోవాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. శనివారం వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా జిల్లా కేంద్రంలోని ఆసిఫాబాద్ రాజస్వ మండల అధికారి కార్యాలయ ఆవరణలోని ఖాళీ ప్రదేశంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎం. డేవిడ్, ఆసిఫాబాద్ రాజస్వ మండల అధికారి లోకేశ్వర్ రావు, ఆసిఫాబాద్ మున్సిపల్ కమిషనర్ అంజయ్య లతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ దేశంలోని పలు రాష్ట్రాలు ఎల్ నినో ప్రభావం వల్ల సమృద్ధిగా వర్షాలు కురవకపోవడంతో నోటు వర్షపాతం నమోదు కారణంగా భూమిలోని నీటిమట్టం మరింత క్రిందికి పోవడంతో భవిష్యత్తు తరాల వారు ఇబ్బందులు ఎదుర్కోవలసి ఉంటుందని తెలిపారు. ఈ నేపథ్యంలో ప్రతి వర్షపు నీటి బొట్టును ఇంకుడు గుంతల ద్వారా భూమిలోకి ఇంకించి భూగర్భ జల మట్టాన్ని పెంపొందించాలని తెలిపారు. వర్షాలు సమృద్ధిగా కురవాలంటే ప్రతి ఒక్కరు మొక్కలు నాటి సంరక్షించాలని, ఇంకుడు గుంతల నిర్మాణాలు చేపట్టాలని తెలిపారు. వర్షపు నీటిని వృథాగా పోనివ్వకుండా భూమిలోకి ఇంకించడంతో పాటు నీటిని పొదుపుగా వినియోగించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల తహసిల్దార్ రియాజ్ అలీ, తహసిల్దార్ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులకు శంకుస్థాపన.





పరిగి, జూలై 18(విజన్ ఆంధ్ర): పరిగి మున్సిపాలిటీ పరిధిలోని సుల్తాన్పూర్ గేట్ వద్ద రూ.185 కోట్ల వ్యయంతో చేపట్టనున్న హ్యామ్ రహదారి అభివృద్ధి పనులకు రాష్ట్ర రోడ్లు & భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి మరియు వికారాబాద్ జిల్లా ఇంచార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి, ఎమ్మెల్సీ, ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి, పరిగి ఎమ్మెల్యే, టీపీసీసీ ట్రైనింగ్ కమిటీ చైర్మన్ (ఎస్ఐఆర్ ) డాక్టర్. టి.రామ్మోహన్ రెడ్డి చేతుల మీదుగా ఘనంగా శంకుస్థాపన చేశారు. శంకుస్థాపన అనంతరం సుల్తాన్పూర్ గేట్ నుంచి ఏబీఎస్ ప్లాజా వరకు భారీ ఎత్తున ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. అనంతరం పరిగి పట్టణంలోని ఏబీఎస్ ఫంక్షన్ హాల్లో నిర్వహించిన పీఏసీఎస్ నూతన పాలకవర్గ ప్రమాణస్వీకార కార్యక్రమం మరియు కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పార్టీ బలోపేతం,అభివృద్ధి కార్యక్రమాల అమలు,ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయడంపై నాయకులు కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య, డీసీసీ అధ్యక్షుడు ధారాసింగ్, జిల్లా కలెక్టర్ దీపక్ తివారి, ఎస్పీ స్నేహ మెహ్రా, మున్సిపల్ చైర్పర్సన్, మార్కెట్ కమిటీ చైర్మన్లు, జిల్లా అధికారులు, పరిగి నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, సర్పంచ్లు, వార్డు సభ్యులు, కౌన్సిలర్లు, మాజీ ప్రజాప్రతినిధులు, యూత్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## మల్దకల్‌లో ఫోర్జరీ కేసు: ప్రధాన నిందితుడు అరెస్ట్ రిమాండ్, పరారీలో మరో నిందితుడు

మల్దకల్, జూలై 18 ( విజన్ ఆంధ్ర) : జోగులాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండలంలోని ఎల్కూర్ గ్రామంలో విలువైన రోడ్డు కార్నర్ ఓపెన్ ప్లాట్‌ను అక్రమంగా కబ్జా చేసేందుకు నకిలీ పత్రాలు సృష్టించి ఫోర్జరీకి పాల్పడిన కేసులో ప్రధాన నిందితుడు కె. విజయ్ (ఏ-1)ను మల్దకల్ పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేసి న్యాయస్థానం ఎదుట హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసులో మరో నిందితుడు దేవర్ల తిమ్మప్ప (ఏ-2) ప్రస్తుతం పరారీలో ఉండగా, అతని కోసం పోలీసులు గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. పోలీసుల వివరాల ప్రకారం, దేవర్ల తిమ్మప్ప అసలు భూయజమానిని తప్పుదోవ పట్టిస్తూ రిజిస్టర్డ్ డాక్యుమెంట్ నెం.1437/2024లో కావాలనే చతుర్దిశలను మార్చి నకిలీ పత్రాలు సృష్టించినట్లు దర్యాప్తులో వెల్లడైంది. అనంతరం ఆ పత్రాలను ఆధారంగా చూపిస్తూ కె. విజయ్ సివిల్ కోర్టు నుంచి స్టే ఆర్డర్ పొందినట్లు గుర్తించారు.ఆ స్టే ఆర్డర్‌ను ఆధారంగా చేసుకుని బాధితుడు తెలుగు నర్సింహులు స్థలంలోకి అక్రమంగా ప్రవేశించి, పనులను అడ్డుకోవడంతో పాటు బెదిరింపులకు పాల్పడినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు మల్దకల్ పోలీసులు రెవెన్యూ శాఖ, సబ్-రిజిస్ట్రార్ కార్యాలయ రికార్డులను పరిశీలించి ఫోర్జరీ జరిగినట్లు నిర్ధారించారు. ఈ మేరకు భారతీయ న్యాయ సంహిత (బిఎన్ఎస్)లోని సెక్షన్లు 338, 336(3), 340, 329(3), 318(4) అర్/డబ్ల్యూ 3(5) కింద కేసు నమోదు చేసి ప్రధాన నిందితుడు కె. విజయ్‌ను రిమాండ్‌కు పంపించారు. పరారీలో ఉన్న మరో నిందితుడు దేవర్ల తిమ్మప్పను త్వరలోనే అరెస్ట్ చేస్తామని మల్దకల్ ఎస్ఐ కె. శ్రీహరి తెలిపారు.

## గడువులోగా భూముల రీ-సర్వే పూర్తి చేయాలి: కలెక్టర్ రాజర్షి షా



ఆదిలాబాదు, జూలై 18 (విజన్ ఆంధ్ర): జిల్లాలో జరుగుతున్న 'భూ భారతి' భూముల రీ-సర్వే పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో రీ-సర్వే పురోగతిపై ఆయన ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. భూవివాదాల శాశ్వత పరిష్కారానికి ప్రభుత్వం చేపట్టిన ఈ సర్వేలో ఎలాంటి అలసత్వాన్ని సహించేది లేదని కలెక్టర్ స్పష్టం చేశారు. డ్రోన్ సర్వే పూర్తయిన గ్రామాల్లో గ్రౌండ్ ట్రూతింగ్, వాలిడేషన్ ప్రక్రియలను వేగవంతం చేయాలన్నారు. రైతుల నుంచి వచ్చే అభ్యంతరాలను పారదర్శకంగా పరిష్కరిస్తూ, రికార్డుల డిజిటలైజేషన్‌లో తప్పులు దొర్లకుండా ల్యాండ్ సర్వే విభాగం ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. క్షేత్రస్థాయి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఆర్డీఓ, ల్యాండ్ సర్వే ఏడీలను ఆదేశించారు. ఈ సమావేశంలో ఆర్డీఓ జగదీశ్వర్ రావ్, ల్యాండ్ రికార్డ్స్ ఏడీ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## బైక్ చోరీ ముఠా గుట్టురట్టు: నలుగురు అరెస్ట్, 7 బైక్‌లు స్వాధీనం




ఆదిలాబాద్, జూలై 18(విజన్ ఆంధ్ర): జిల్లాలో వరుస ద్విచక్ర వాహన చోరీలకు పాల్పడుతున్న ముఠాను ఆదిలాబాద్ టూ టౌన్ పోలీసులు పట్టుకున్నట్లు జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. గత ఏడాది డిసెంబర్‌లో నమోదైన ఓ బైక్ దొంగతనం కేసును సీసీటీవీ ఫుటేజీలు, సాంకేతిక ఆధారాలతో విచారించి ఈ కేసును ఛేదించారు. ఈ ముఠాలోని కరణ్ షిండే, మేశ్రం సాయికిరణ్, పవార్ విక్రమ్, ఫర్దీన్ ఖాన్‌లను అరెస్ట్ చేసి, వారి వద్ద నుంచి దొంగిలించిన 7 మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. మరో ముగ్గురు నిందితులు పరారీలో ఉన్నట్లు ఎస్పీ పేర్కొన్నారు. ఈ కేసును ఛేదించడంలో సీసీ కెమెరాలే కీలక పాత్ర పోషించాయని, ప్రజలంతా తమ ఇళ్ల వద్ద నాణ్యమైన సీసీటీవీలను ఏర్పాటు చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ సమావేశంలో డీఎస్పీ జీవన్ రెడ్డి, టూ టౌన్ సీఐ నాగరాజు, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్, ఎస్ఐలు పాల్గొన్నారు.

# మన గోదావరిఖనికి ఏమైంది గురూ..!!

- నల్ల బంగారపు నేలపై... కన్నీటి చారికలు

- ఇది శ్రమజీవుల అడ్డాయా? నేరగాళ్ల అరణ్యమా?

- కన్న ఊరిని కాటేస్తున్న కాలసర్పం

- పవిత్ర గోదావరి సాక్షిగా...మమకారాలు మంటగలుస్తున్నాయ్




పెద్దపల్లి బ్యూరో, జూలై 18 (విజన్ ఆంధ్ర) : గోదావరిఖని... ఈ పేరు వింటేనే గుండెల్లో ఒక రకమైన వైబ్రేషన్. సింగరేణి బొగ్గు గనుల




సైరన్ మోత, ఎన్ టి పి సి వెలుగులు, ఆర్ ఎఫ్ సి ఎల్ వ్యవసాయ ఎరువులు, కార్మికుల చెమట చుక్కల సువాసన, పక్కనే పారే పవిత్ర గోదావరి అమ్మ ఒడి. కానీ... ఈ మధ్య ఈ ఊరి పేరు వింటే గుండెల్లో వణుకు పుడుతోంది.

అవును గురూ... "గోదావరిఖని చాలా డిఫరెంట్... కానీ ఇప్పుడు ఆ డిఫరెన్స్ భయపెడుతోంది!"

చెమట చిందించిన నేలపై... రక్తం చారికలా? ఒకప్పుడు ఈ నేల కష్టానికి, నమ్మకానికి మారుపేరు. తెల్లవారితే బొగ్గు బావుల్లోకి వెళ్లే అన్నల నవ్వులు, సాయంత్రమైతే చౌరస్తాలో చాయ్ తాగుతూ ముచ్చటించుకునే స్నేహాలు. కానీ ఈరోజు పగలు-ప్రతీకారాలు. చిన్న విషయాలకే కత్తులు దూస్తున్నారు.

**వింత వింత నేరాలు:**

సైబర్ మోసాల నుండి గంజాయి ముఠాల వరకు... వ్యభిచారం నుండి పేకాట వరకు, దొంగతనాల నుండి మర్డర్ల వరకు, చైన్ స్నాచింగ్ నుండి చెక్ బౌన్స్ వరకు అన్నీ ఇక్కడే అడ్డా వేస్తున్నాయి.

**మసకబారుతున్న బంధాలు:**

ఆస్తి కోసం సొంతవాళ్లే శత్రువులవుతున్నారు. నిత్యం ఏదో ఒక క్రైమ్ వార్త టీవీల్లో స్క్రోలింగ్ అవుతుంటే... "ఇది మన గోదావరిఖనేనా?" అని స్థానికులు ముక్కున వేలేసుకుంటున్నారు. ఎందుకు మారడం లేదు? ఎందుకు ఆగడం లేదు?

ఈ నేల రంగు నలుపు కావచ్చు... కానీ ఇక్కడి మనుషుల మనసులు తెల్లటి కాగితాలు. మరి అలాంటి ఊరిలో ఈ నేరాల జాతర ఎందుకు ఆగడం లేదు?

**వేగంగా మారుతున్న లైఫ్ స్టైల్:**

మోడర్న్ కాలంతో పాటు ఇక్కడి యువతలో "ఈజీ మనీ" (సులువుగా డబ్బు సంపాదించాలనే) పిచ్చి పెరిగిపోతోంది.

**వ్యసనాల ఊబి:**

ఒకప్పుడు కష్టపడితే వచ్చే కిక్ కోసం చూసేవాళ్లు, ఇప్పుడు మత్తు పదార్థాల కిక్ కోసం వెతుకుతున్నారు.

**కరిగిపోతున్న సెంటిమెంట్:**

పక్కింట్లో ఏం జరిగినా పట్టించుకోని 'అర్బన్' కల్చర్ రావడం వల్ల నేరగాళ్లకు భయం లేకుండా పోతోంది.

గురూ... మార్పు ఎక్కడ రావాలి?

"చట్టాలు లాఠీ ఝుళిపించవచ్చు... కానీ మార్పు అనేది మన ఇంట్లోనే, మన మనసులోనే మొదలవ్వాలి."

పోలీసులు పెట్రోలింగ్ పెంచొచ్చు, సీసీ కెమెరాలు పెట్టొచ్చు. కానీ కన్న కొడుకు ఏం చేస్తున్నాడో తల్లిదండ్రులు గమనించనంత వరకు, పక్కవాడి ఆపదను చూసి స్పందించే గుణం మనలో రానంత వరకు ఈ మార్పు రాదు.

**చివరిగా ఒక్క మాట:**

గోదావరిఖని అంటే కేవలం క్రైమ్ రేట్ పెరిగే నగరం కాదు... వేల కుటుంబాలకు అన్నం పెట్టిన కల్పవృక్షం. ఆ పవిత్రమైన నేలపై నేరాల నీడలు తొలగిపోవాలి. మళ్లీ పాత గోదావరిఖని నవ్వులు చౌరస్తాలో వినిపించాలి.

**మనం మారుదాం...**

**మన ఖనిని కాపాడుకుందాం!!**




# దక్షిణ కాశీగా పేరొందిన గుండాల క్షేత్రం దుస్థితి



గుండాల ఆలయం...

## శ్రీరాముడే ప్రతిష్టించిన అంబా రామలింగేశ్వర స్వామి ఆలయం అభివృద్ధికి నోచుకోక వైభవం కోల్పోతున్న పుణ్యక్షేత్రం

- పుట్టు గుండాల నీరు...
- ద్వాదశ జ్యోతిర్లింగాల ప్రతిష్టతో అత్యంత పవిత్రం...
- 15 రోజుల జాతరకు లక్షల మంది భక్తులు.. సౌకర్యాలు శూన్యం




గుండాలలో వెలసిన అంబా రామలింగేశ్వర స్వామివార్లు...

ఉమ్మడి పాలమూరు జిల్లా బ్యూరో, జూలై 19 (విజన్ ఆంధ్ర): ఉమ్మడి పాలమూరు జిల్లా కల్వకుర్తి నియోజకవర్గం గుండాల గ్రామంలో వెలసిన శ్రీ అంబా రామలింగేశ్వర స్వామి దేవాలయం దాదాపు 500 సం"ల త్రేతాయుగం నాటి ప్రాచీన క్షేత్రం. స్వయంగా శ్రీరాముడు ప్రతిష్ఠించిన శివలింగం ఇక్కడ ఉండటంతో ఈ క్షేత్రానికి "దక్షిణ కాశీ" అనే పేరు కూడా ఉంది. అయినప్పటికీ ఇంతటి మహా పుణ్యక్షేత్రం నేడు అభివృద్ధికి నోచుకోక వైభవాన్ని కోల్పోతుంది.

**దేవాలయ విశిష్టత - స్వామివారి ప్రతిష్ట**

పూర్వం త్రేతా యుగంలో రావణాసురుని సంహరించిన తర్వాత శ్రీరామునికి బ్రహ్మహత్యా దోషం తొలగించుకోవాలనే సంకల్పం కలిగింది. అప్పుడు కులగురువు వశిష్ట మహర్షి కాశీ గంగలో ఒక బాణాన్ని సంధించి, ఆ బాణం ఎక్కడ తగులుతుందో అక్కడ శివలింగాన్ని ప్రతిష్ఠించి పూజించాలని సూచించారు. కాలక్రమంలో అరణ్యవాసం పూర్తి చేసుకుని తిరిగి వస్తున్న రాములవారు ఈ ప్రాంతంలో బాణాన్ని చూసి, గురువు చెప్పిన స్థలం ఇదే అని భావించి ఇక్కడ శివలింగాన్ని ప్రతిష్టించారు. అందుకే స్వామివారికి "రామలింగేశ్వరుడు" అనే పేరు వచ్చింది. కొద్ది రోజులకు పార్వతి దేవి కైలాసం నుంచి వచ్చి, "స్వామి మీరు ఎక్కడ ఉంటే నేను అక్కడే ఉంటాను" అని కోరగా, శివుడు "ఈ క్షేత్రానికి నీ పేరు ముందుగా వచ్చేలా వరం ఇస్తున్నాను" అని పలికారు. అప్పటి నుంచి "అంబా రామలింగేశ్వర స్వామి" గా భక్తులను అనుగ్రహిస్తున్నారు. అమ్మవారి సంరక్షణ కోసం వీరభద్రుడు, రాముడు ప్రతిష్ఠించిన శివలింగానికి సేవల కోసం ఆంజనేయ స్వామి స్వయంగా ఈ క్షేత్రంలో వెలిశారని స్థలపురాణం.

**పుట్టు గుండాలు - ద్వాదశ జ్యోతిర్లింగాలు**

శివుడికి అభిషేకం చేయడానికి నీరు కావాలని రాముడు తన చేతి బాణాన్ని భూమిలోకి సంధించగా, అది కాశీకి చేరి సొరంగ మార్గం ద్వారా నీరు ఇక్కడికి వచ్చింది. ఆ నీటినే "పుట్టు గుండాలు" అంటారు. రాముడి బాణం చేత పుట్టినందున గ్రామానికి "పుట్టు గుండాల"అనే పేరు వచ్చి, కాలక్రమంలో "గుండాల"గా మారింది.ఇక్కడి శివలింగం కాశీ స్వరూపమని భావించిన ఋషులు ద్వాదశ జ్యోతిర్లింగాలను కూడా ప్రతిష్టించారు. కాశీ నుంచి దక్షిణ దిశగా నీటి ప్రవాహం ఉండటంతో ఈ క్షేత్రానికి "దక్షిణ కాశీ" అనే పేరు సార్థకమైంది.

**అభివృద్ధి కరువై భక్తుల ఇబ్బందులు**

ఇంతటి విశిష్టత ఉన్నప్పటికీ ఈ ఆలయానికి సరైన ఆదరణ లేదు. ప్రతి సంవత్సరం మహాశివరాత్రికి 15 రోజుల పాటు ఇక్కడ అంగరంగ వైభవంగా జాతర జరుగుతుంది. రాష్ట్రం నలుమూలల నుంచి, జిల్లా నలుమూల నుంచి లక్షలాది మంది భక్తులు వచ్చి స్వామివారికి మొక్కులు చెల్లించుకుంటారు. కానీ భక్తులకు వసతి గృహాలు లేవు, సరైన ముఖ ద్వారం లేదు, కళ్యాణ మండపం లేదు. జాతర సమయంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

**భక్తుల విజ్ఞప్తి**

ఈ నేపథ్యంలో భక్తులు రాష్ట్ర ప్రభుత్వానికి, సీఎం రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి చేస్తున్నారు. "స్వయంగా రాముడు ప్రతిష్ఠించిన ఈ పవిత్ర క్షేత్రాన్ని అభివృద్ధి చేసి, వసతి గృహాలు, ముఖ ద్వారం, కళ్యాణ మండపం లాంటి సకల సౌకర్యాలు కల్పించాలి"బి అని కోరుతున్నారు. స్థానికులు మాట్లాడుతూ, బి"గుండాలను దక్షిణ కాశీగా తీర్చిదిద్దితే ఉమ్మడి పాలమూరుకు పేరు వస్తుంది. ప్రభుత్వం చొరవ చూపాలి"బి అన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఈ ఆలయ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని భక్తులు, ప్రజలు ఆశిస్తున్నారు.



శ్రీ రాముల వారి బాణం వల్ల ఏర్పడిన గుండం....



గుండం....

EDITED,PRINTED, PUBLISHED AND OWNED BY J.NARENDER PRINTED AT SREE DATTA SAI GRAPHICS,# H.NO.1-1-651/8. GANDHINAGAR.HYDERABAD-500020.TELANGANA STATE,PUBLISHED AT J.N.PUBLICATIONS,H.NO.2-1-340/A/4,G.H.M.C NO 12, NEAR FEVER HOSPITAL, BESIDE SBI ATM CENTRE, O.U.ROAD, NALLAKUNTTA MAIN ROAD, HYDERABAD-500044, TELANGANA STATE. RNI.NO.70731/1999 EDITOR : J.NARENDER, CELL:9440897445, Mail visionandhra1999@gmail.com.